www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 253
సోమవారం 05-03-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

వయ్యారి భామల

వగలమారి చేటు...

- హరిత సంపదను మింగేస్తోంది
- ఆహారం కలుషితం
- భూసారం స్వాహా
- పంటలకు బోలెడు నష్టం
- పశువులకు రోగాలు



విశాలాంధ్ర, ప్రత్యేక ప్రతినిధి : స్థానికులు వయ్యారి భామగా (శాస్త్రీయ నామం పార్థీనియం హిస్టిరోపోరస్) పిలుచుకునే కలుపు మొక్క దేశ హరిత సంపదను హరించేస్తోంది. ఈ కలుపు మొక్కతో పశువులకు, పంటలకు అపార నష్టం వాటిల్లుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పంటలకు నష్టం వాటిల్లచేసే ఈ కలుపు మొక్క అత్యంత ప్రమాదకారి. మట్టి,గాలిలో కలిసిపోయిన వీటి పుప్పొడి రేణువులు ఆహారాన్ని కలుషితం చేస్తున్నాయి. అంతే కాకుండా భూమిలోని సారన్నంతటినీ పంట మొక్కలకు అందకుండా ఇవే తీసుకుంటాయి. ఈ మొక్కలు మరింతగా విజృంభించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జీవశాస్త్రవేత్తలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. వీటిని అరికట్టడంలో అలసత్వం చూపుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోని నాలుగువంతుల భూమిలో ఇది వ్యాప్తి చెందిందని వారు హెచ్చరిస్తున్నారు. దీంతో పంట దిగుబడులు 27 శాతానికి తగ్గాయన్నారు. దేశవ్యాప్తంగా దీని ప్రభావం 40 శాతం ఉందన్నారు. కొన్ని దేశాలు కావాలనే మన దేశంలో ఈ పంట వ్యాప్తి చేస్తున్నాయని, అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం దీన్ని నివారించేందుకు గట్టి చర్యలు చేపట్టాయన్నారు. ఇది అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న ఆహార ధాన్యాల ద్వారా మనదేశంలోకి ప్రవేశించిందని శ్రీవెంకటేశ్వరా వర్సిటీ బోర్డుఆఫ్ స్టడీస్ (పీజీ) ఇన్ బోటనీ ఛైర్మన్ జి. సుదర్శన్ తెలిపారు. దీనిలోని రసాయనిక పదార్థాలైన పార్థీనిన్, హిస్టరిన్, హైమెనిన్, ఆంబ్రోసిన్ పంట దిగుబడిని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ పుష్పంలో 600 నుంచి 800 వరకు పుప్పొడి రేణువులు ఉంటాయి. వీటి ద్వారా టమాటో, వంగ, పచ్చిమిర్చి, జొన్న పంటలకు విపరీతమైన నష్టం వాటిల్లుతోంది. ఈ మొక్కలు ఉన్నచోట మేత మేసిన పశువులకు

- మిగతా 2 లో

వయ్యారిభామ మొక్కలోని పుప్పొడి, ఎండిన మొక్కలు, వేర్లు మనుషులు, జంతువులలో పార్థీనిన్, కొరినోఫిలిన్, టెట్రాన్యూరిస్, ఆంబ్రోసిన్ రకాలైన ఎలర్జీలను వ్యాప్తి చేస్తాయి. చర్మసంబంధిత వ్యాధులు, హై ఫీవర్, ఆస్తా, గొంతువ్యాధులు కూడా ఈ కలుపు మొక్క ద్వారా సంక్రమిస్తాయి. రైలు ప్రయాణీకుల్లో 25 నుంచి 30 శాతం మంది ట్రాక్ వెంబడి ఉండే ఈ మొక్కల వల్ల అలర్జీ వ్యాధిగ్రస్తులవుతున్నారు.

మాయమాటలొద్దు

- 45 నెలలుగా లెక్కలు తేలలేదనడం పచ్చి మోసం
- 14 రోజుల్లోనే లెక్కలు తేల్చిన జేఎఫ్‌సీకి అభినందనలు
- నేటి నుంచి ఢిల్లీలో భారీ ఎత్తున ఆందోళనలు
- హోదాపై ఢిల్లీలో తాడోపేడో తేల్చుకుంటాం
- హామీలు సాధించే వరకూ అక్కడే ఉంటాం
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలని ఛాలెంజ్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రామకృష్ణ, రావుల వెంకయ్య, హరినాథరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక లోటును భర్తీ చేసే క్రమంలో 45 నెలలుగా కేంద్రం మోసపూరిత మాటలతో కాలం వెళ్లతీస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గురు మాజీ ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ) కేవలం 14 రోజుల్లో లెక్కలు తేలిస్తే.. కేంద్రం మూడున్నరేళ్ళుగా లెక్కలు తేలడంలేదని చెప్పడం ఏపీ ప్రజలను మోసగించడమే అవుతోందన్నారు. ఇకనైనా మభ్యపెట్టే మాటలను కట్టిపెట్టి రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా సహా విభజన చట్టంలోని అన్ని హామీలను నెరవేర్చేందుకు ముందుకు రావాలని ఆయన డిమాండు చేశారు. దాసరిభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, పుట్టా హరినాథరెడ్డితో కలసి మాట్లాడారు. విశేష అనుభవం కలిగిన

- మిగతా 2 లో

వస్తా...మార్పు తెస్తా

- థర్డ్ ఫ్రంట్‌కు అనూహ్య స్పందన
- మమతా, సోరెన్‌ల అభినందన.. సంపూర్ణ మద్దతుకు హామీ
- తెలంగాణ నుంచే జాతీయ రాజకీయాల్లో కొత్త యుగం
- ఎవ్వరితో మాట్లాడాలో వారితో మాట్లాడి మద్దతు కూడగడతా
- ప్రజల ఆకాంక్ష తెలియని కాంగ్రెస్, బీజేపీ
- ప్రగతిభవన్ సమావేశంలో కేసీఆర్



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ : అవసరమైతే జాతీయ రాజకీయాల్లోకి వస్తానని, థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తానని సీఎం కేసీఆర్ ఉద్ఘాటించారు. జాతీయ రాజకీయాల్లో మార్పు అవసరమని, ఆ మార్పు తెలంగాణ నుంచే మొదలవుతుందన్నారు. ఆదివారం ప్రగతిభవన్‌లో ఆయనను కలిసేందుకు వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన వారిని ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడారు. శనివారం చేసిన వ్యాఖ్యలపై దేశం నలుమూలల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఫోన్ చేసి 'తమ్ముడు కేసీఆర్ సరైన నిర్ణయం తీసుకున్నావ్' అని అన్నట్లు కేసీఆర్ తెలిపారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ కూడా ఫోన్ చేసి సంపూర్ణ మద్దతిస్తానన్నారన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని ముఖ్యమంత్రి విమర్శించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఇంకా ఎందుకు జరగాలి? జీవితాంతం వాళ్లు చెప్పే కథలు వినాల్సిందేనా..? అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా రైతులను అదుకుంటామని

- మిగతా 2 లో

స్వాగతిస్తున్నా : పవన్

2లో

టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

9వరకూ అభ్యంతరాల స్వీకరణ
ఆ తర్వాత తుది కీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హతా పరీక్ష) ప్రాథమిక కీను పాఠశాల విద్యాశాఖ కమిషన్ విడుదల చేసింది.ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 2వరకూ ప్రతిరోజూ సెషన్ల వారీగా నిర్వహించిన పరీక్షా పత్రాలను, వాటి కీ వివరాల్ని సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్లో అందుబాటులో వుంచారు.టెట్ పేపర్-1,2,3 పేపర్ల కీలపై అభ్యంతరాల్ని ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తారు. అభ్యర్థులు, విద్యావేత్తల అభిప్రాయాల్ని ఆన్‌లైన్లోనే పంపాలి. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2వ తేదీ వరకూ టెట్ పేపర్-1,2,3 పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్ పద్దతిలో 190 కేంద్రాల్లో ప్రభుత్వం నిర్వహించింది. టెట్ పేపర్-1కు 8, పేపర్-2కు 8, పేపర్-3కు 3 సెషన్ల చొప్పున పరీక్షలు జరిగాయి.

భారీగా హాజరైన అభ్యర్థులు..
ఏపీ టెట్ పరీక్షలకు అభ్యర్థులు భారీ స్థాయిలో హాజరయ్యారు.ఈ పరీక్షలకు మొత్తంగా 4,46,833 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 4,10,828 మంది (91.94శాతం) పరీక్ష రాశారు.కీలను సెషన్ల వారీగా కమిషన్ వెబ్‌సైట్లో అందుబాటులో వుంచారు. వారం రోజుల్లో తుది కీను విడుదల చేస్తారు. ఆ తర్వాత ఏపీ టెట్ ఫలితాలను ప్రకటిస్తారు.టెట్ ఫలితాల ప్రక్రియ అనంతరం డీఎస్సీ(టీఆర్టీ) నోటిఫికేషన్ జారీకి ప్రభుత్వం నిమగ్నమైంది. డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే..టెట్ అర్హతను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. టెట్‌లో 150మార్కులకుగాను ఓసీ-90, బీసీ-75, ఎస్సీ,ఎస్టీలు-60 మార్కులు సాధించాలి.

బీజేపీ అనైతిక గెలుపు

ఈశాన్య ఫలితాలపై
డి.రాజా వ్యాఖ్య



9లో



ఓటమిపై నిశిత పరిశీలన అవసరం

ఏచూరి వాదానికి అచ్యుతానందన్ మద్దతు

9లో

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

కలకలం

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



11లో



విశాఖపట్నం సాగర తీరంలో ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న రామకృష్ణ, రఘువీరారెడ్డి, శివాజీ, కొణతాల రామకృష్ణ, జేవీఎస్ఎన్‌మూర్తి తదితరులు

హోదా ఇవ్వాల్సిందే..

- కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి బాబుకు లేదు
- ఇది ఆంధ్రుల ఆత్మగౌరవ శంఖారావమే
- అధికార, ప్రతిపక్ష నేతలు ఉద్యమించాలి
- సాగర తీరంలో కాగడాల ప్రదర్శనలో నేతలు

11లో

నేటి నుంచే

అసెంబ్లీ పర్వం

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

- ఆ తర్వాత మంగళవారానికి వాయిదా
- బడ్జెట్ సమావేశాలకూ వైసీపీ దూరం
- మిత్రభేదం వికటిస్తే ప్రతిపక్ష పాత్రలో బీజేపీ
- మరుక్షణమే మంత్రుల రాజీనామా
- ఆసక్తికరంగా మారిన సమావేశాలు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. గుంటూరు జిల్లా వెలగపూడిలోని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన అనంతరం ఉభయ సభలు మంగళవారానికి వాయిదా వేస్తారు. మొత్తం 18 రోజులపాటు జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో 2018-19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర నిధుల కోత నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనకు ప్రభుత్వం పెద్ద కసరత్తే చేసింది. ఇదిలావుండగా, ఈసారి బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితిలో ఏ పక్షం ఎటువైపు మొగ్గు చూపుతుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ ప్రారంభమైంది. 2014లో జరిగిన ఎన్నికలలో టీడీపీ, బీజేపీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!



రైల్వే భూముల్లో

హైటెక్ హంగామా

- ప్రధాన స్టేషన్లకు చేరువగా నివాస సముదాయాలు
- ప్రభుత్వ,ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో నిర్మాణం
- స్టేషన్ అభివృద్ధి చేసే కాంట్రాక్టర్లకే అప్పగింత
- రూపురేఖలు మారనున్న ప్రధాన స్టేషన్లు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రైల్వేశాఖకు చెందిన వినియోగంలో లేని భూముల్లో ఆకాశ హర్మ్యాలను నిర్మించేందుకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఉద్యోగ, వ్యాపార పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు రైలు దిగిన వెంటనే కాలినడకన నివాసానికి చేరుకునే విధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టడం ప్రధాన ఉద్దేశం. డీలక్స్ మొదలుకొని సాధారణ వరకూ ఆయా వర్గాలకు అందుబాటులో ఉండే ధరల్లో వీటిని నిర్మించనున్నారు. వీటికి అనుసంధానంగా షాపింగ్‌మాల్స్, మల్టీపెక్స్‌లు, వినోదాన్ని కలిగించే ఎమ్యూజిమెంట్ పార్కులు.. ఇలా అన్నీ రైల్వేస్టేషన్ పరిసరాల్లోనే ఉండడం వల్ల ప్రయాణీకులకు ఎంతో వెసులుబాటుగా ఉండగలదు. ఈ చర్యతో రాష్ట్రంలోని ప్రధాన రైల్వేస్టేషన్ల చేరువలోనే

- మిగతా 2 లో

అమెరికాకు కిమ్ హెచ్చరిక



పోంగ్‌యాంగ్ : కొరియా ద్వీపకల్పంలో దక్షిణ కొరియాతో కలసి సైనిక విన్యాసాలను అమెరికా నిర్వహిస్తే తాము సహించబోమని ఉత్తర కొరియా నేత కిమ్‌జాంగ్ ఉన్ హెచ్చరించారు. ఉద్రిక్తతల సడలింపు, శాంతియుత వాతావరణం నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలను సైనిక విన్యాసాలు దెబ్బతీస్తాయని కిమ్ పేర్కొన్నారు. ఒకవేళ సైనిక విన్యాసాలు జరిపినట్లయితే వాటిని ప్రతిఘటించక తప్పదని ఆయన అన్నారు. ఏప్రిల్‌లో సైనిక విన్యాసాలు నిర్వహించాలని అమెరికా నిర్ణయించింది. తాజాగా ఫిబ్రవరి 23న ఉత్తర కొరియాపైన భారీ ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మళ్లీ ఆంక్షలు విధిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. చర్చలకు రమ్మని తాము అడుక్కోబోమని, అదే సమయంలో సైనిక సంఘర్షణకు కూడా వెనుకాడబోమని తెలిపారు.

ఆఫ్ఘన్‌లో 13 మంది టెర్రరిస్టుల హతం



కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లోని ఉత్తరప్రాంత రాష్ట్రం జాజన్ సైనిక దళాలు జరిపిన దాడుల్లో ఐఎస్ ఉగ్రవాద సంస్థకు చెందిన 13 మంది టెర్రరిస్టులు హతం అయినట్లుగా తెలుస్తోంది.

చనిపోయిన వారిలో కనీసం ఇద్దరు కజికిస్తాన్ నుంచి వచ్చిన వారు ఉన్నారని మీడియా తెలిపింది. ఐఎస్ ఉగ్రవాద సంస్థ స్థావరాలపైన వైమానికి దళాలు దాడులు జరిపాయి. అయితే ఈ సంఘటనపై ఐఎస్ ఉగ్రవాద సంస్థ స్పందించలేదు. గతవారంలోనూ రెండు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా జరిపిన దాడుల్లో ఏడుగురు ఉగ్రవాదులు హతం అయ్యారు.



ఉత్తర కొరియాకు ద.కొరియా దూత



సీయోల్ : ఉభయ దేశాల మధ్య చర్చల కోసం ప్రతిపాదిస్తూ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జాయే ఇన్ ఉత్తర కొరియాకు ప్రత్యేక దూతను ఆదివారం పంపారు. రెండు దేశాలమధ్య సంబంధాలను ఏర్పరచుకునేందుకు ఇటీవల సానుకూల వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో దక్షిణ కొరియా తీసుకున్న చొరవ కొరియా ద్వీపకల్పంలో శాంతిని కోరుకునేవారందరూ స్వాగతిస్తారు. అమెరికా ఉత్తర కొరియా మధ్య చర్చల కోసమే దక్షిణ కొరియా ప్రత్యేక దూతను పంపి ఉండవచ్చని ఎక్కువ మంది భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి ఉత్తర కొరియాతో విబేధాలు, వివాదాలు కొనసాగుతున్నాయి. అణుక్షిపణులు ప్రయోగించిన ఉత్తర కొరియాను భూమిపై లేకుండా చేస్తానని ట్రంప్ బెదిరించడం, అందుకు బదులుగా ఉత్తర కొరియా నేత కిమ్‌జాంగ్ ఉన్ అమెరికాపై అణుదాడి చేస్తామని హెచ్చరించడంలాంటివి చోటు చేసుకున్నాయి. ఆతర్వాత అమెరికా ఉత్తర కొరియాపైన పలు ఆంక్షలు విధించింది. సైనిక చర్యకు కూడా అవకాశముందని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు. దక్షిణ కొరియా నుంచి అధ్యక్షుడి జాతీయ భద్రతాకార్యాలయం అధిపతి చుంగ్ ఈయాంగ్‌ను ఉత్తర కొరియాకు ప్రత్యేక దూతగా పంపారు. ఐదుగురితో కూడిన బృందానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఈ బృందం ఉత్తర కొరియాలో పర్యటిస్తుంది. ప్రత్యేక విమానంలో ఈ బృందం నేరుగా పోంగ్‌యాంగ్ చేరుకుంటుంది. ఉత్తర కొరియా ఉన్నతాధికారులతో చర్చించే అవకాశం ఉంది. వాషింగ్టన్‌తో చర్చలను జరిపేందుకు తగిన వాతావరణం కల్పించడానికి ఈ బృందం వెళుతున్నట్లుగా తెలుస్తోంది.

అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్

- ట్రంప్ ప్రకటనపై ఈయూ హెచ్చరిక
- తిప్పికొడతామన్న వాషింగ్టన్



బ్రసెల్స్ : చైనా, యూరోపియన్ యూనియన్(ఈయూ) దిగుమతులపై సుంకాలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరిక అంతర్జాతీయంగా విమర్శలకు గురవుతోంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపైన 25 శాతం టారిఫ్ విధిస్తామని ఈయూ తాజాగా హెచ్చరించింది. చైనా మాత్రం బహుళవాణిజ్య నిబంధనలను అనుసరించాల్సిందేనని పేర్కొంది. ఈయూ ప్రకటనపై అమెరికా స్పందిస్తూ తాము తిప్పికొట్టగలమని మాట్లాడింది. ఈయూ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ ఆటోమొబైల్ ఉత్పత్తుల ఎగుమతుల ధరలను పెంచుతామని ఆదివారం ట్రంప్ ప్రకటించారు. అమెరికా నుంచి తాము 3.5 బిలియన్ డాలర్ల విలువైన స్టీలు వస్తువులను దిగుమతి చేసుకుంటామని వాటన్నింటిపైనా 25 శాతం సుంకాలు విధిస్తామని ఈయూ తెలిపింది. స్టీలు, అల్యూమినియం ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. యూరోపియన్ కమిషన్ వర్గాలు ట్రంప్ ప్రకటనపై స్పందించారు. అలాగే ప్రపంచ వాణిజ్య కేంద్రం సమావేశంలో తాము కూడా రక్షణ చర్యలు చేపడతామని,విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇతరులతో కలసి పనిచేస్తామని యూరోపియన్ కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాతో వాణిజ్యాన్ని తిరిగి సమతుల్యం చేసుకునేందుకు ఆదేశాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రతిఘటనా చర్యలు తీసుకుంటామని ఈయూ వర్గాలు తెలిపాయి. జాతీయ స్వీయ రక్షణ చర్యల్లో భాగంగా అమెరికా టారిఫ్‌లను పెంచదలచుకుంది. అమెరికాలో జరిగే ఉత్పత్తుల్లో అక్కడి సైన్యానికి అవసరమయ్యే ఆయుధాలు ఇతర పరికరాల ఉత్పత్తులు 3 శాతానికి మించి ఉండవని, నిజానికి ఇది స్వీయ రక్షణ చర్య కాదని ఈయూ వర్గాలు తెలిపాయి. అమెరికా స్వీయ రక్షణా చర్యలను తాము అంగీకరించబోమని, ఈయూ వర్గాలు తెలిపాయి. కొన్ని రకాల స్టీలు ఉత్పత్తుల దిగుమతిని పెంచినట్లుగా అమెరికా ఎంతమాత్రమూ చెప్పలేదని అందువల్ల ట్రంప్ ప్రకటనలు సమంజసం కాదని ఈయూ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం ట్రంప్ తన ట్విటర్‌లో యూరోపియన్ యూనియన్ అమెరికా మధ్య వాణిజ్య అసమతుల్యం చాలా ఎక్కువగా ఉందని అందువల్లనే తాము దిగుమతి సుంకాలను విధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఇప్పటికే ఈయూ వస్తువులు టారిఫ్‌లు ఎక్కువగా ఉన్నాయని, ఒకవేళ వారు టారిఫ్‌లను పెంచాలనుకుంటే తాము దిగుమతి చేసుకునే ఈయూ కార్లపై పన్నులు విధిస్తామని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలతో తమ వాణిజ్యం అసమతుల్యంగా ఉన్నందున తమ దేశంలో కార్మికుల రక్షణ కోసమే ఈ చర్యలని ట్రంప్ పేర్కొన్నారు. ఏడాదికి 800 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉంటోందని తమ ఉద్యోగాలను సంపదను ఇతరులకు అప్పగిస్తున్నామని, దీన్ని ఇతర దేశాలు అవకాశంగా తీసుకుంటున్నాయని, అనేక సంవత్సరాలుగా ఇది కొనసాగుతోందని ట్రంప్ తన ట్విటర్‌లో వెల్లడించారు. మేము తెలివితక్కువ వారమని వారు మమ్మల్ని చూసి నవ్వుతున్నారు. వోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యు కంపెనీలు ఉత్పత్తి చేసే యూరోపియన్ కార్లపైన ట్రంప్ ప్రకటన ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

జర్మనీలో 6 నెలల అనిశ్చితికి తెర



బెర్లిన్ : జర్మనీలో ఎన్నికలు జరిగిన తర్వాత ప్రభుత్వం ఏర్పడకుండా దాదాపు 6 నెలలు గడిచిపోయింది. ఎట్టకేలకు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సోషల్ డెమాక్రటిక్ పార్టీ (ఎస్పీడీ) అంగీకరించింది. దీంతో రాజకీయ అనిశ్చితికి తెరపడింది. చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ సుదీర్ఘ చర్చల ఫలితమే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు నిర్ణయం. మెర్కెల్ నాల్గవ సారికూడా చాన్సలర్‌గా కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆదివారం ఎస్పీడీ నాయకత్వం ప్రకటించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఇంత సుదీర్ఘకాలం జర్మనీలో ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడం ఇదే మొదటి సారి. ఎస్పీడీ పార్టీ సభ్యుల్లో 66.02 శాతం మంది సంకీర్ణ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేయడంతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమేనని ఆపార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటించింది. పార్టీ నాయకుడు వోల్ఫ్ స్కల్జ్ పార్టీ నిర్ణయాన్ని ప్రకటించారు. మొదట మెర్కెల్ ప్రభుత్వంలో చేరేందుకు ఎస్పీడీ తిరస్కరించింది. గత సెప్టెంబరులో జరిగిన ఎన్నికల్లో నిరుత్సాహ పరిచే ఫలితాలు వచ్చిన నేపథ్యంలో ఎస్పీడీ ప్రభుత్వంలో చేరేందుకు ఇష్టపడలేదు. సంకీర్ణ ప్రభుత్వం కోసం మితవాద సీడీయూ పార్టీ నేత, చాన్సలర్ మెర్కెల్ పలుమార్లు చర్చలు జరిపారు. ఒక దశలో మెర్కెల్ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఎస్పీడీ అగ్రనాయకత్వం ఆమోదించినప్పటికీ యువజన నేత కెవిన్ కునర్ట్ వ్యతిరేకించడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది.

రష్యా హెచ్చరికలు సమ్మతం కాదు : నాటో

బ్రసెల్స్ : తమ మిత్ర దేశాలను రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ హెచ్చరించడం సమ్మతం కాదని, ఉద్రిక్తతలను తగ్గించేందుకు, కూటములు ఏర్పాటు చేసేందుకు దోహదం చేయదని నాటో తెలిపింది. తమ వద్ద శక్తివంతమైన నూతన అణ్వాయుధాలు ఉన్నాయని పుతిన్ చేసిన ప్రకటనకు నాటో ఈ విధంగా స్పందించింది. పూర్వపు సోవియట్ యూనియన్ ప్రభావంగల ప్రాంతాలకు నాటో ఇప్పటికే విస్తరిస్తున్నందున రష్యా ఆగ్రహంగా ఉంది. తమ మిత్ర దేశాలపైన దాడులు జరిపితే అది తమమీద దాడిజరిపినట్లుగా భావిస్తామని పుతిన్ పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న క్రిమియా ప్రాంతం రష్యాలో విలీనం కావడంతో ఆనాటి నుంచి అమెరికా ఇతర నాటో దేశాలు రష్యా చర్యను విమర్శిస్తూనే ఉన్నాయి. తాజాగా పుతిన్ చేసిన ప్రకటనలు వ్యతిరేక ఫలితాలను ఇస్తాయని నాటో వెల్లడించింది.

చైనాలో ఆధునిక సోషలిస్టు సమాజ నిర్మాణంపై చర్చ

బీజింగ్ : గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను నిర్మించాలన్న లక్ష్యసాధనతో చేపట్టాల్సిన కార్యాచరణపైన ఆదేశ ఉన్నత స్థాయి రాజకీయ సలహాసంఘం సమావేశం అయ్యింది. చైనా ప్రజారాజకీయ సంప్రదింపుల సంస్థ జాతీయ కమిటీ 13వ ప్లీనరీ సమావేశం ఇక్కడ 'గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్'లో జరుగుతోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇతరు ఉన్నత స్థాయినాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సలహా సంఘంలో 2000 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది చైనాలో సంస్కరణలు ప్రారంభమై 40 ఏళ్లు గడిచిన సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రజారాజకీయ సంప్రదింపుల సంస్థ జాతీయకమిటీ చైర్మన్ జంగ్‌షంగ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. 2158 మంది సలహా సంఘ సభ్యులు పాల్గొన్నారు. వీరిలో 60 శాతం మంది సభ్యులు కమ్యూనిస్టుయేతర పార్టీలకు చెందినవారు. బహుళపార్టీ వ్యవస్థ చైనాలో ఉన్నదని చెప్పేందుకు ఇది తిరుగులేని తార్కాణం.

జిన్‌పింగ్ ప్రతిపాదించిన చైనా లక్షణాలతో సోషలిజం నిర్మాణం, ఐక్యతా, ప్రజాస్వామ్యం ఆధారంగా ఆధునిక సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలని కమ్యూనిస్టుపార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐక్యతా, ప్రజాస్వామ్యం ప్రధానమైన అంశాలుగా ఉంటాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు ఎజెండాలో ప్రధానంగా చోటు చేసుకున్నాయి.

వగలమారి చేటు...

(మొదటిపేజీ తరువాయి)

దురదలు, కురుపులు వస్తాయి. పొరపాటున గడ్డితోపాటు దీన్ని మేయడం ద్వారా నోటి అల్సర్‌కు, విపరీతమైన చొంగ కార్చడానికి కారణమవుతుందన్నారు. అనారోగ్యాల బారిన పడటంతో పశువుల నుంచి పాలదిగుబడి తగ్గుతుందని అందువల్ల ప్రభుత్వం తక్షణమే దీనిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని సుదర్శన్ కోరుతున్నారు.

మాయమాటలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, చంద్రశేఖర్, ఐవైఆర్ కృష్ణారావుతో కూడిన జేఎఫ్‌సీ జరిపిన పరిశీలనలో రాష్ట్రానికి రూ. 74,542 కోట్లు రావలసి ఉందని గుర్తించారన్నారు. నిష్ణాతులైన నిపుణులతో కూడిన ఎంతో పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగిన కేంద్ర, రాష్ట్ర ఆర్థికశాఖలు 45 నెలలు గడచినా లెక్కలు తేలలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిని బట్టి రాష్ట్రానికి సాయం చేయడం మోడీ ప్రభుత్వానికి ఇష్టంలేదని స్పష్టంగా తేలిపోయిందన్నారు. ప్రత్యేక తరగతి హోదాపై కేంద్రం ఇంకా అబద్దాలు చెబుతూనే ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం ఎక్కడా చెప్పలేదని జేఎఫ్‌సీ స్పష్టం చేసిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన 9 నెలల తర్వాత ఏర్పాటు చేసిన నీతి అయోగ్ పార్లమెంట్, ప్రధానమంత్రి, కేంద్రమంత్రివర్గం కంటే గొప్పదా? అని ఆయన ప్రశ్నించారు. సాక్షాత్తు పార్లమెంటులో ప్రధాని ప్రకటించడమే కాకుండా కేబినెట్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించి దానిని ఆర్థిక సంఘానికి పంపిన తర్వాత నీతి అయోగ్‌ను అడ్డుపెట్టడం సరైంది కాదన్నారు. దీనిపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఢిల్లీ కేంద్రంగా జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్, వైసీపీ నేతలు ఢిల్లీకి చేరుకున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై తాడోపేడో తేలే వరకూ ఢిల్లీలోనే మకాం వేస్తామన్నారు. పాలకులు బుకాయింపు మాటలు మాని, పార్లమెంటు సాక్షిగా చెప్పిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు.

బీజేపీ తీరు నవ్వాలో, ఏడవాలో తెలియడంలేదు..

ఏపీకి అది చేసాం.. ఇది చేస్తాం.. అంటూ మూడున్నరేళ్లుగా కాలక్షేపం చేసిన ఏపీ బీజేపీ నేతల ప్రస్తుత వ్యవహారశైలిని చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో తెలియకుండా ఉందని రామకృష్ణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో ఉండి ఇన్నాళ్లూ కల్లబొల్లి కబుర్లుచెప్పిన బీజేపీ ఒక్కసారిగా అడ్డం తిరిగిందన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇప్పటి వరకూ కేంద్రం రాష్ట్రానికిచ్చిన నిధుల గురించి ఏకరువు పెడతామని బీజేపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏలాగూ ప్రతిపక్షమైన వైసీపీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించినందున ప్రతిపక్ష పాత్రను బీజేపీ పోషించడంలో తప్పులేదన్నారు. అయితే కేంద్రం రాష్ట్రానికి ఏమిచ్చిందో మొదటి రోజంతా చెప్పిన బీజేపీ రెండో రోజు నుంచి ఇంకేమి చెబుతుందో వేచి చూడాల్సి ఉందన్నారు. మేము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి 10 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన బీజేపీ తీరా అధికారంలోకి వచ్చాక ఎందుకు మాట మార్చిందో ప్రజలకు తెలియచేయాలన్నారు. బీజేపీకి ఏమాత్రం నైతిక విలువలు, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రెండు ఎంపీ, నాలుగు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండు చేసారు. కేంద్రం ఇప్పటి వరకూ ఏమిచ్చిందో శాసనసభలో చెబుతారు కనుక దానినే పుస్తకంగా ముద్రించి ఎన్నికల్లో ప్రచారం చేసి గెలవాలని సూచించారు. తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి ఏ ఒక్కరు గెలిచినా మేము మాట్లాడడం మానుకొంటామని ఆయన ఛాలెంజ్ చేశారు. తన సవాలును స్వీకరించాలని బీజేపీ నేతలను కోరారు. ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు విభజన హామీలు సహా విశాఖ రైల్వే జోన్ గురించి ఎక్కడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. హోదా విషయమై రాష్ట్రంలో పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతుంటే రాయలసీమలో సమావేశంపెట్టి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే పనికి బీజేపీ పూనుకొనడం ఆపార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలుస్తుందని రామకృష్ణ విమర్శించారు. అనంతరం ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ముద్రించిన చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను నేతలో కలసి ఆవిష్కరించారు.

మార్పు తెస్తా

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రభుత్వాలు ప్రకటించాయని అన్నారు. దేశంలో నేడున్న పరిస్థితులు తనను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని చెప్పారు. ఏ కులమైనా.. ఏ మతమైనా దేశమంటే ప్రజలేనని, రాజకీయంగా ఆటలాడుకుంటున్నారు కానీ ప్రజలకు చేయాల్సింది చేయడం లేదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఇంకో ఏడాదైతే కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందని, రాష్ట్ర ప్రజల బాధలు తీరుతాయని సీఎం తెలిపారు. కాంగ్రెస్‌ని కాదని బీజేపీని గెలిపించినా రైతులకు, విద్యార్థులకు, కార్మికులకు ఒరగిందేమీ లేదని, వాళ్ల జమానాలో మాల్యా.. వీళ్ల జమానాలో నీరవ్.. బ్యాంకులను మోసం చేసి పారిపోయారని విమర్శించారు. ఒకప్పుడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న చైనా.. నేడు అత్యంత బలమైన దేశంగా ఆవిర్భవించినప్పుడు.. మనం ఆ స్థాయిలో ఎందుకు ఎదగలేకపోతున్నామని కేసీఆర్ ప్రశ్నించారు. 10 లక్షల కిలోమీటర్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతోందని, ప్రజల దీవెన ఉంటే దేశానికి అద్భుతమైన దశాదిశా నిర్దేశిస్తానని చెప్పారు. మనది పేరుకే సమాఖ్య వ్యవస్థ అని, అన్ని అధికారాలు కేంద్రం వద్ద ఉన్నాయన్నారు. కేంద్రం వద్ద పరిమిత అధికారాలుండాలని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, విద్యావిధానాన్ని రాష్ట్రాలకు ఎందుకు అప్పగించరు? రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకు ఎందుకివ్వరని కేసీఆర్ నిలదీశారు. ఆర్మీ, జాతీయ రహదారులు కేంద్రపరిధిలో ఉంటే సరిపోతుందన్నారు. ఇప్పటికైనా రెండు జాతీయ పార్టీల్లో మార్పు రావాలని, పంథాను, పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. దేశంలో మార్పు తీసుకొచ్చేందుకు ఎవరితో మాట్లాడాలో వారితో మాట్లాడి మద్దతు కూడగడతానని కేసీఆర్ వెల్లడించారు. నీళ్ల పంపకాల్లో రాష్ట్రాల మధ్య గొడవ పెడుతున్నారని కేంద్రం తీరుపై మండిపడ్డారు. అన్ని ధరలు పెంచుతున్నారు కానీ పంటల మద్దతు ధరలు పెంచలేదన్నారు. రైతాంగం సంక్షోభంలో ఉన్నా.. మనం ఎందుకు మాట్లాడకూడదు? అని ప్రశ్నించారు. ఒకవేళ మాట్లాడితే జైలుకు పంపుతారట. పిట్ట బెదిరింపులకు కేసీఆర్ భయపడడంటూ స్పష్టంచేశారు. అలా భయపడి ఉంటే 14ఏళ్ల పాటు ఉద్యమాన్ని నడిపేవాడిని కాదన్నారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానమంత్రి కావాలంటూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు.

హైటెక్ హంగామా

(మొదటిపేజీ తరువాయి)

ఆకాశహర్మ్యాలు కనువిందు చేయనున్నాయి. వాణిజ్య సముదాయాల నిర్మాణంతోపాటు నివాస పరమైన నిర్మాణాలను స్టేషన్ అభివృద్ధి పథకంలో చేర్చాలని రైల్వేబోర్డు నిర్ణయించినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ద్వారా నివాస సముదాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో 600 రైల్వేస్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో అన్ని హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. రైల్వేస్టేషన్ల నిర్వహణను ప్రైవేటు పరం చేయడం ద్వారా రూ. లక్ష కోట్ల ఆదాయాన్ని పొందాలని కేంద్రం భావిస్తోంది. రైల్వేభూముల అభివృద్ధి కోసం ఏర్పాటైన రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ), ఇండియన్ రైల్వేస్టేషన్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌ఎస్‌డీసీ) ద్వారా స్విస్‌ఛాలెంజ్ విధానంలో బిడ్లను ఆహ్వానించి ప్రైవేటు సంస్థలకు ఆయా స్టేషన్ల అభివృద్ధి పనులను అప్పగించనుంది. ఇప్పటికే దేశంలో తొలి ప్రైవేటు రైల్వేస్టేషన్‌గా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని హబీబ్‌గంజ్ స్టేషన్ సకల సదుపాయాలతో సిద్ధమవుతోంది. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసే కాంట్రాక్టును రైల్వేశాఖ బన్సల్ గ్రూప్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ ఆధునిక హంగులతో స్టేషన్‌ను నిర్మించి 45 సంవత్సరాలపాటు నిర్వహణ బాధ్యతలను తానే స్వయంగా చూసుకుంటుంది. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 600 స్టేషన్లను అభివృద్ధి చేయాలనేది రైల్వేశాఖ ఆలోచన. స్టేషన్ అభివృద్ధి కాంట్రాక్టును పొందిన సంస్థలకే గృహ నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించాలని యోచిస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ, విశాఖపట్నం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు జోనల్ అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. లీజు ఎంతకాలం కొనసాగాలి అనే విషయమై ఉన్న సందిగ్ధం తొలగిన వెంటనే బిడ్లను పొందిన సంస్థలకు అభివృద్ధి పనులు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజధానికి అత్యంత చేరువగా ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్ పరిసరాల్లో వందలాది ఎకరాల స్థలాలు రైల్వేకున్నాయి. స్టేషన్ సమీపంలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, రైల్వే ఇన్‌స్టిట్యూట్, హైస్కూల్, జూనియర్ కళాశాల, జాక్ అండ్ జిల్ స్కూల్, రన్నింగ్‌రూమ్.. తదితరాలను సత్యనారాయణపురంలోని సొంత స్థలాలకు తరలించి ఇక్కడ నివాస గృహాలతోపాటు మల్టీపెక్స్ థియేటర్లు, షాపింగ్‌మాల్స్, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా ఓపెన్ థియేటర్.. ఇలా పలు నిర్మాణాలు చేపట్టనున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, శిథిలావస్థలో ఉన్న రైల్వే నిర్మాణాల స్థానంలో ఇదే తరహాలో నిర్మాణాలు రానున్నాయి. అదేవిధంగా ప్రధాన స్టేషన్లయిన తిరుపతి, నెల్లూరు, గుంటూరు, తెనాలి, రాజమండ్రి, కాకినాడ, సామర్లకోట, ఏలూరు, భీమవరం వంటి స్టేషన్లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసే అవకాశాలున్నాయి. దేశంలో పేరొందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్‌ఎఫ్‌ఎస్), జీఎమ్మార్, టాటా రియాలిటీ, బ్రిగేడ్ గ్రూప్, మంత్రి డెవలెపర్స్, రహేజా, షాపూర్జీ-పల్లోంజీ, రిలయన్స్ ఇన్‌ఫ్రా, లాంకో ఇన్‌ఫ్రా, ఎస్సెల్ గ్రూప్ వంటి సంస్థలు స్టేషన్ పునరభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తోపాటు బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్(బీఓటీ), బిల్డ్-ఓన్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బీఓఓటీ), బిల్డ్-లీజ్-ట్రాన్స్‌ఫర్ (బీఎల్‌టీ) విధానం ద్వారా అధికారులు పనులను అప్పగించనున్నారు. రైల్వే ఆలోచన కార్యరూపం దాలిస్తే ఇతర ప్రాంతాల్లో నిత్యం విధి నిర్వహణలో భాగంగా వివిధ పనులపై వెళ్లేవారు స్టేషన్ సమీపంలోనే నివాసం ఉండడం వలన సమయంతోపాటు వాహనాలకు వెచ్చించే వ్యయం చాలా వరకూ తగ్గిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్వాగతిస్తున్నా : పవన్



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మూడవ కూటమికి అంకురార్పణ చేస్తే తన సంపూర్ణ మద్దతు ఉంటుందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. థర్డ్‌ఫ్రంట్‌కు కేసీఆర్ వంటి వారు నాయకత్వం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం పవన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై స్పందించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ప్రజల మనోభావాలను గౌరవించి ప్రత్యేక హోదాకు కేసీఆర్ మద్దతు ఇవ్వడాన్ని స్వాగతించారు. హోదాకు మద్దతుతో తెలుగు ప్రజలపై ఆయనకున్న ప్రేమ, అభిమానం స్పష్టంగా కనబడిందని పవన్ అన్నారు. తెలుగు వారు ఎక్కడున్నా ఒక్కటే అనడానికి కేసీఆర్ వ్యాఖ్యలు మంచి ఉదాహరణ అని చెప్పారు. చాలాకాలంగా తృతీయ ఫ్రంట్‌పై చర్చలు జరుగుతున్నాయని, అయితే ఎవరి వల్ల అది సాధ్యం కాలేదన్నారు. గతంలో కొంతమంది ప్రయత్నించినా అందరినీ ఏకతాటిపైకి తీసుకురాలేకపోయారని చెప్పారు. కేసీఆర్ వల్ల థర్డ్ ఫ్రంట్ సాధ్యమవుతుందనే నమ్మకం ఉందని, రాజకీయాల్లోకి కొత్త రక్తం రావాలంటే థర్డ్ ఫ్రంట్ అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాంతీయ పార్టీలను జాతీయ పార్టీలు పట్టించుకోపోతే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని పవన్ చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కల్యాణ్ ఎన్డీఏను డిమాండు చేశారు. అంకెలతో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీయాలనే ప్రయత్నం మానుకోవాలని ఆయన కేంద్రానికి సూచించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారా లేదా స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండు చేశారు.

అసెంబ్లీ పర్వం

(మొదటిపేజీ తరువాయి)

మిత్రపక్షంగా పోటీ చేసి అధికారంలోకి వచ్చాయి. సీఎం చంద్రబాబు తన మంత్రివర్గంలో నలుగురు బీజేపీ సభ్యులలో ఇద్దరికి మంత్రి పదవులు కేటాయించారు. కేంద్రంలోనూ బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వంలో టీడీపీ నుంచి ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ అధికారపక్షం సహా ప్రతిపక్షాలు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. నెల రోజులుగా బడ్జెట్ కేటాయింపులపై మిత్రపక్షాలు టీడీపీ, బీజేపీ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం సాగుతుండగా, కొందరు నేతలతై బాహాటంగానే విమర్శల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. బీజేపీలోని ఒక వర్గం టీడీపీతో కలిసి పని చేయాలని భావిస్తుండగా, మరో వర్గం విడిపోవాలని పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడలో జరిగిన పార్టీ పదాధికారుల సమావేశంలో పార్టీలో గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కొద్ది రోజులుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ టీడీపీపై నిప్పులు కురిపిస్తున్నారు. అదే సమయంలో టీడీపీ మంత్రులు, నాయకులు కూడా కేంద్రంపై స్వరాన్ని పెంచుతున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) బడ్జెట్ సమావేశాలకూ దూరంగా ఉండాలని నిర్ణయించింది. వైసీపీని వీడి టీడీపీలో చేరిన 23 మందిపై అనర్హత వేటు వేసేంత వరకు అసెంబ్లీ వచ్చేదిలేదని ఆ పార్టీ నిర్ణయించింది. అంతేగాకుండా వైసీపీ నేతలు స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావును ఆదివారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని కూడా అందజేశారు.

మారనున్న రాజకీయ పరిణామాలు

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షం సభకు వచ్చేదిలేదని స్పష్టం చేయగా, బడ్జెట్ సమావేశాలలో మిత్రపక్షాల వైఖరిపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సోమవారం నుంచే రెండో దశ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగటంపై పార్లమెంట్‌లో ఆందోళనలు కొనసాగించటంతోపాటు సభను స్తంభింప చేయాలని ఎంపీలకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తే మిత్ర బంధాన్ని తెచ్చుకునేందుకు కూడా సిద్ధమైన టీడీపీ, కేంద్రంలోని ఇద్దరు మంత్రులను ఉపసంహరించుకునేందుకు సిద్ధమైంది. అదే సమయంలో టీడీపీపై ఎదురుదాడికి మిత్రపక్షం బీజేపీ కూడా సిద్ధమైంది. శాసనసభ, శాసనమండలిలో ప్రతిపక్ష పాత్ర పోషించాలని రెండు రోజుల క్రితం విశాఖలో జరిగిన బీజేపీ శాసనసభాపక్షం (బీజేఎల్‌పీ) సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రంలో మంత్రులుగా కొనసాగుతున్న ఇద్దరితోనూ రాజీనామా చేయిస్తామని ఆ పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రసవత్తరంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టీడీపీ వైఖరినిబట్టే...

పార్లమెంట్‌లో టీడీపీ వైఖరిని బట్టి అసెంబ్లీ సమావేశాలలో పార్టీ వైఖరిని నిర్ణయిస్తామని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. తొలి రోజున గవర్నర్ ప్రసంగంతో రెండు సభలు వాయిదా పడతాయి. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో సమావేశాలు జరగనున్నాయి. దీంతో అసెంబ్లీలో పూర్తిస్థాయి ప్రతిపక్షం ఉండదనే విషయం స్పష్టమైంది. నవంబర్‌లో జరిగిన శీతాకాల సమావేశాల్లోనే బీజేపీ కాస్త ప్రతిపక్ష పాత్రను పోషించగా, ఈసారి టీడీపీ వైఖరి మేరకు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందో, మిత్రపతక్ష పాత్ర పోషిస్తుందో తెలుస్తుంది. అయితే అసెంబ్లీలో ఏవిధంగా వ్యవహరించాలో అధిష్టానం నుంచి ఇంకా ఎలాంటి స్పష్టత లభించలేదు. టీడీపీ వైఖరిని బట్టి అప్పటికపుడు నిర్ణయం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

విజయవాడకు చేరుకున్న గవర్నర్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కోసం ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆదివారం సాయంత్రానికే విజయవాడ చేరుకున్నారు. ఆయనకు గన్నవరం విమానాశ్రయంలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్వాగతం పలికారు. గవర్నర్ నరసింహన్ సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం చేయనున్నారు.

భయపెట్టి భూ కొనుగోళ్లు

పల్లె, పయ్యావులసహా మంత్రులు, ఎమ్మెల్యేలు

విచారణకు బీజేవైఎం నేత రమేష్‌నాయుడు డిమాండు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అనంతపురం జిల్లా పెనుగొండ ప్రాంతంలో నిర్మిస్తున్న కియో మోటార్స్ పరిశ్రమ సమీపంలో మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులను భయపెట్టి భూములను కొనుగోలు చేస్తున్నారని భారతీయ జనతా యువమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎన్ రమేష్‌నాయుడు ఆరోపించారు. సర్వే నంబర్లు 580 నుంచి 762 వరకు సుమారు రూ.200 కోట్ల విలువైన 275 ఎకరాల భూములను చీఫ్ విప్‌లు పల్లె రఘునాథ్‌రెడ్డి, పయ్యావుల కేశవ్‌తోపాటు మరికొందరు టీడీపీ నేతలు బలవంతంగా కొనుగోలు చేశారన్నారు. ఈ బలవంతపు భూముల కొనుగోళ్లపై ప్రభుత్వం విచారణ చేయించాలని ఆయన డిమాండు చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువ మోర్చా నాయకుడు రమేష్‌నాయుడు మాట్లాడారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు కూడా భూములు అమ్మాలంటూ రైతులను బెదిరిస్తున్నారని విమర్శించారు. అనంతపురం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకానున్న ప్రాంతాల్లోనూ ఇదే వైఖరిని టీడీపీ నేతలు అవలంభిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయల విలువైన భూములను తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పల్లె రఘునాథ్‌రెడ్డి, పయ్యావుల కేశవ్ తదితరులు పెద్ద మొత్తంలో భూములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫలితంగా కంపెనీల ఏర్పాటు వల్లే కలిగే ప్రయోజనాలను రైతులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతుంటే, ఓర్వలేకే ప్రతిపక్షాలు బురద జల్లటంతోపాటు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలతో భాగస్వామ్య పక్షం టీడీపీ కలవటం బాధాకరమన్నారు. విలేకరుల సమావేశంలో యువమోర్చా విజయవాడ నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల

నిరవధిక నిరాహార దీక్షలు

7న విద్యుత్ సౌధ ముట్టడి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది.విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని వారు డిమాండు చేస్తున్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తుండటంతో ఐక్యవేదిక అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆదివారం కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.వి.రమణమూర్తి ,సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల న్యాయబద్ధమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్పొరేట్ వర్గాలకు చెందిన వ్యక్తులు చట్టసభలకు వస్తున్నారని దాంతో వారు కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ కార్మికుల సమస్యలపై స్పందించకుంటే 5 నుంచి అన్ని కార్మికసంఘాల రాష్ట్ర ప్రధాన నాయకత్వంలో నిరవధిక దీక్ష జరుపుతామని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీతో అధికారంలోకి వచ్చి, దానిని నెరవేర్చకుండా కార్మికులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా సమ్మెను ఉధృతం చేస్తున్నామన్నారు. 7న ఛలో విద్యుత్ సౌధ చేపట్టి కార్మిక సత్తా చంద్రబాబుకు చూపుతామన్నారు. ఐక్యవేదిక చైర్మన్ పి.కాశీ మధుబాబు, జనరల్ సెక్రటరీ ఎం.బాలకాశి,కో-కన్వీనర్ కట్టా నాగరాజు,కోశాధికారి సి.శేఖర్,చీఫ్ కో-ఆర్డినేటర్ జి.హారతి, వైఎస్ఆర్ టీయూసీ రాష్ట్ర నాయకులు సి.హెచ్.సరోజ దీక్షలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.స్వరూప రాణి, ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్‌వి.నరసింహారావు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్,పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు శాస్త్రి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


21న చలో అసెంబ్లీ

ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉపాధి హామీ పనులు, పెండింగ్ బిల్లులు, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకునేందుకు ఈనెల 21న చలో అసెంబ్లీకి కూలీలంతా దండుగా తరలి రావాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు ఆదివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జల్లి విల్సన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు సంయుక్తంగా ప్రకటన చేశారు. వ్యవసాయ కూలీలకు ఉన్న ఊరిలో పని కల్పించి వలసలను నివారంచడానికి ఏర్పాటైన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ-టీడీపీ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. ఈ పథకంలో రాష్ట్రంలో చెల్లించాల్సిన బకాయిలు రూ. 450 కోట్లకు చేరుకుందన్నారు. ప్రతి గ్రామంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, చట్టాన్ని రక్షించుకోవడానికి చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. వంద రోజులు దాటిన ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని, రోజు కూలీ రూ. 500 చెల్లించాలని వారు డిమాండు చేశారు. రెండు పూటల పని ఆలోచన విరమించి, పని ప్రదేశాల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. బాలింతలకు 90 రోజుల పని దినాలకు ఉచితంగా వేతనం చెల్లించాలన్నారు. ఉపాధి నిధులను సిమెంటు రోడ్లు, భవనాలు, స్టేడియంలు, గోడౌన్ల నిర్మాణాలకు మళ్లించరాదన్నారు. యంత్రాలను నిషేధించడంతోపాటు అందరికీ పనిముట్లు అందచేసి టెంట్లు, మెడికల్ కిట్లను సమకూర్చాలన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండు చేశారు.

ఆరోగ్య నవ్యాంధ్ర

- మార్చి 5 నుంచి చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం 'పలకరింపు'
- పెరుగుతున్న ఆర్థరైటిస్, డయాబెటిస్, గుండె జబ్బులు
- అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం
- బులిటెన్ విడుదలలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర అమరావతి : ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉండవల్లిలోని ముఖ్య మంత్రి నివాసం పక్కన ఉన్న గ్రీవెన్స్ భవనంలో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ, ఆరోగ్య బులిటెన్ 'పలకరింపు'(మీ చిన్నారి ఆరోగ్యం కోసం) అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను, పలకరింపు కిట్ బ్యాగ్‌లను సీఎం ఆవిష్కరించారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం పీపీపీ విధానంలో ఇప్పటికే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 100 శాతం ఐఎమ్మార్, ఎంఎంఆర్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయటంలో సాధికారమిత్రల సహకారం మరువలేనిదని కొనియాడారు. శ్రీమంతం, అన్న ప్రాసనం వంటి కార్యక్రమాలు నిర్వహించడంతోపాటుగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, చిన్నారులకు పౌష్టికాహారం అందించే విషయాలలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. మార్చి నెలాఖరు నాటికి 100 శాతం ఓడీఎఫ్ రాష్ట్రంగా తీర్చిదిద్దే కార్యక్రమం పూర్తి చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించటంతో పాటుగా ఆరోగ్య సమస్యలు ఏర్పడకుండా వ్యాయామం కూడా కచ్చితంగా చెయ్యాలని సీఎం వ్యాఖ్యానించారు. ప్రతి నెల ఒక రోజు గ్రామంలో ఉన్న అధికారులందరూ కూర్చొని గ్రామ సమస్యలపై చర్చించుకోవాలని సూచించారు. దీనివలన మరోసారి గత సమస్యలు, కొత్త ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టవచ్చని ఆయన సూచించారు. పంచాయతీలు, మున్సిపాలిటీల సహకారంతో అనారోగ్యాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 13 జిల్లాల్లోని ఆరోగ్య సమస్యలు, ప్రమాణాలను సీఎం వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో షుగర్ వ్యాధి అధికంగా ఉండగా, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో ఆస్తమా బాధితులు పెరుగుతున్నారని చెప్పారు. విజయనగరం, కడపలలో హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉండగా, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గుండె జబ్బులు ఎక్కువయ్యాయని చెప్పారు. ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఆర్థరైటిస్ అధికంగా ఉన్నట్లు బులిటెన్‌లో వివరించారు.

భవిష్యత్తులో వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డ్సను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ చేపడతామని తెలిపారు. డిజిటల్ లాకర్స్ ద్వారా వైద్య చికిత్స విధానంలో సరికొత్త ఒరవడి సృష్టిస్తామన్నారు. ఏడాదిలో రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను ప్రజలు చూస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెల 4వ తేదీన జిల్లా, గ్రామ స్థాయిల్లో ఆరోగ్య బులిటెన్ విడుదల చేయాలని, అందరూ ఇందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కొందరు వైద్యులు అధిక మోతాదులో మందులు వాడుతున్నారని, అది తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'పలకరింపు'(మీ చిన్నారి ఆరోగ్యం కోసం)..

పలకరింపు కార్యక్రమం ద్వారా 5 సంవత్సరాల లోపు చిన్నారుల సమగ్ర ఆరోగ్య సమీకరణ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. మార్చి 5 నుంచి 31 వరకు అంటే 21 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 1,20,86,624 నివాసాలను సందర్శించి పిల్లల ఆరోగ్య వివరాలు తెలుసుకోవటం జరుగుతుందన్నారు. ఇందుకోసం 42,219 మంది ఆశా వర్కర్లు, 51,545 అంగన్‌వాడీ కార్యకర్తలు, లక్ష మంది మెప్మా కార్యకర్తలు 57,555 టీములుగా ఏర్పడి 'పలకరింపు' నిర్వహిస్తారని ఆయన వివరించారు.

పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించటంతోపాటుగా అనారోగ్యంతో ఉన్న వారికి అందుతున్న చికిత్సలు తదితర వివరాలు సేకరిస్తారని చెప్పారు. వారికి తగిన చికిత్సా కేంద్రాలు సూచించటం ఈ టీమ్‌ల బాధ్యత అని వివరించారు. అలాగే బాల్య వివాహాలు నిరోధించటం, గర్భిణులకు ఆరోగ్య సలహాలు అందిస్తారని తెలిపారు. ఈ పలకరింపు కార్యక్రమానికి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, యూనిసెఫ్, లయన్స్ ఇంటర్నేషనల్, ఐఎంఏ, ఐపీఏలు భాగస్వాములుగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణ విషయంలో 8వ స్థానంలో ఉన్నామని, రాబోయే రోజుల్లో నెంబర్ వన్ స్థానంలో ఉండాలని సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కామినేని శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాల కొండయ్య, కమిషనర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏపీతో అరవింద్ లిమిటెడ్ ఎంఓయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: చిత్తూరు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్-అప్పరల్ సదుపాయాలతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ప్రముఖ కంపెనీ అరవింద్ లిమిటెడ్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాలులో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అరవింద్ మిల్స్ ఎండీ సంజయ్ లాల్ భాయ్ ఎకనమిక్ డెవలెప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులతో ఎంఓయూ చేసుకున్నారు. ఈ కంపెనీ మొదటి దశలో రూ. 250 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 10వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

అసెంబ్లీ సమావేశాలకు భారీ భద్రత

రూరల్ ఎస్పీ అప్పలనాయుడు





విశాలాంధ్ర-అమరావతి : నేటి నుంచి జరగనున్న శాసనసభా బడ్జెట్ సమావేశాల సందర్భంగా వెలగపూడి సచివాలయం పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు చెప్పారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాలలోని 10 కిలోమీటర్ల వరకు సెక్షన్ 30 పోలీసు యాక్ట్, సెక్షన్ 144 అమలులో ఉంటుందని, పరిసర ప్రాంతాలలో ఎటువంటి సభలు, సమావేశాలు, ప్లకార్డుల ప్రదర్శన, నిరసన ప్రదర్శనలు నిషేధించినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి 900 మంది అధికారులు, 4 ప్లటూన్ల సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాలలో నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అణువణువును బీడీటీం క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. బందోబస్తును నిరంతరం పర్యవేక్షిస్తూ, అధికారులకు, సిబ్బందికి తగిన సూచన లిస్తూ అప్రమత్తం చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

అసెంబ్లీ ద్వారాల వద్ద, ప్రధాన కూడళ్లలో సిబ్బందిని నియమించామని, అధికారులకు బాడీవార్న్ కెమెరాలను, క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. బాంబు నిర్వీర్యం చేసే సిబ్బందితో తనిఖీ చేయించి లోపలకి అనుమతించడం జరుగుతుందన్నారు, భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ట్రాఫిక్‌లో ఇబ్బందులు తలెత్తకుండా శాసన సభాపతి, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రతిపక్ష నేతకు వేరు వేరు రూట్లను ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ స్థలాలను కూడా విడివిడిగా, సైన్ బోర్డులు ఏర్పాటు చేసి ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నా మన్నారు. డ్రైవర్లను, వ్యక్తిగత భద్రతా సిబ్బందిని, ఎమ్మెల్యేల అనుచరులను అసెంబ్లీలోకి అనుమతించబోమని ఎస్పీ తెలిపారు. 4వ నెంబరు గేట్ వద్ద మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని, అందరికీ ఐడెంటిటీ కార్డులు ఇచ్చామన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

- అప్పుడే..అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు వస్తారు..
- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేనిపై వేటు వేయాలి
- స్పీకరుకు వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి ఫిర్యాదు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్టీ ఫిరా యించిన 23 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ కాలయాపన చేయకుండా సత్వరమే అనర్హతవేటు వేయాలని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి కోరారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాల యంలో ఆదివారం ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హతవేటు వేసిన వెంటనే..వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరవుతారని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.ఇదే విషయాన్ని తాము స్పీకరును కలిసి ఫిర్యాదు చేశామన్నారు.దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై జైలుశిక్ష పడిన నేపథ్యంలో ఆయన్ని అనర్హుడిగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. దెందులూరు అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించాలని కోరారు.గత సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా చింతమనేనికి ఎమ్మెల్యేగా వ్యవహరించడంగానీ, అసెంబ్లీలో ఓటు వేసే హక్కుగానీ లేవని స్పష్టం చేశారు.ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకరు రాజ్యాంగం నిర్దేశించిన తరహాగా చర్యలు తీసుకుంటే..అసెంబ్లీ బడ్జెట్టు సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరవు తారని తమ పార్టీ అధినేత జగన్ సూచించారని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలునకు అనుగుణంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకరు చర్యలు తీసుకుంటారని తాము విశ్వసిస్తున్నామని అన్నారు.ఈ అంశంపై ముఖ్య ఎన్నికల అధికారికి వినతిపత్రాన్ని అందజేశామని చెప్పారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకరు,

ఎన్నికల కమిషన్, గవర్నర్లపై వుందన్నారు .'అవిశ్వాసం తీర్మానమనేదీ 21వ తేదీన పెట్టడం వల్ల ఉపయోగమేమీలేదంటూ' పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు జవాబిచ్చారు. వైసీపీ అన్ని విషయాల్ని గమనంలోకి తీసుకున్నాకే అవిశ్వాస నిర్ణయాన్ని వెల్లడించామని ఆయన స్పష్టం చేశారు. అవిశ్వాసం నిర్ణయాన్ని తెలంగాణా సీఎం కేసీఆర్ ఛీప్ ట్రిక్ అనడం అర్థరహితమని ఆయన ఖండించారు.

కరుణించని కేంద్రం

విశాలాంధ్ర-విశాఖసిటీ : రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రానికి వివిధ కేంద్ర విద్యా సంస్థలను కేటాయించినప్పటికీ, నిధులు విడుదల విషయంలో మాత్రం కేంద్రం తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. జాతీయ విద్యా సంస్థల శాశ్వత నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు అవసరమైన నిధులు ఏక మొత్తంలో కేటాయించకుండా దశలు వారీగా నిధులు కేటాయించడం, బ్యాంకుల నుంచి రుణం పొందడానికి కూడా కేంద్రం సహకరించకపోవటంతో హామీల నుంచి పక్కకు తప్పుకుంటున్న భావన కలుగుతోంది. రాష్ట్ర విభజన సమయంలో తాడేపల్లి గూడెంలో ఎన్ఐటీ, నెల్లూరులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజిమెంట్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, అనంతపురంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ నార్కోటిక్, గన్నవరంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్, విశాఖలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ లను కేటాయించింది. దీంతో పాటు తిరుపతిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్, రీసెర్చ్, చిత్తూరులో ఐఐఐటీ,మంగళగిరిలో ఎయిమ్స్‌ను కేటాయించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం 3,408 ఎకరాలు కేటాయించింది. వీటిలో కొన్ని విద్యాసంస్థలకు తాత్కాలికంగా తరగతులు కూడా ప్రారంభించారు. విద్యా సంస్థల్లో కొన్నింటికి ఇంకా డీపీఆర్ దశలోనే ఉండిపోవడం తీవ్ర విమర్శలకు కారణమయ్యింది. విశాఖలోని ఐఐఎం, ఐఐపీఈ తరగతులు ప్రస్తుతం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నడుపుతున్నారు. ఎయిమ్స్ నిర్మాణం శంకుస్థాపన వద్దే ఆగిపోయింది. తాడేపల్లి గూడెంలోని ఎన్ఐటీ తరగతులు కూడా ఒక ప్రైవేట్ కాలేజిలో అద్దె రూపంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడా ఏపీ సెంట్రల్ యూనివర్శిటీకు రూ.10, నిట్‌కు రూ.54, ఐఐటీకు రూ.50, ఐఐఎంకు రూ.42, ట్రిపుల్ ఐటీకి రూ.30, ఐఐఎస్‌సీఆర్‌కి రూ.49, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌కి రూ.5, ట్రైబల్ యూనివర్శిటీకి రూ.10, ఐఐపీఈకి రూ.32 కోట్లను కేటాయించారు.

ఈ అరకొర నిధుల కేటాయింపుతో ఆయా నిర్మాణాలకు మరో 10 ఏళ్ళు పడుతుందని ఆర్థికవేత్తలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల వద్ద నుంచి రుణాలు తీసుకునేందుకు ప్రతిపాదించి, కేంద్రాన్ని గ్యారెంటీగా వ్యవహరించాలని కోరింది. కానీ ఆయా తీసుకున్న మొత్తం రుణాలకు వడ్డీ ఎవరు చెల్లిస్తారంటూ కేంద్రం మెలిక పెట్టడంతో విస్తుపోవడం రాష్ట్ర ప్రభుత్వం వంతయ్యింది. ఇదిలా ఉండగా ఫార్మసీ ప్లాంట్ విశాఖలో నెలకొల్పుతాం మీదే ఆలస్యం అంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉందని, ప్రైవేట్ విద్యా సంస్థలే తక్కువ కాల వ్యవధిలో నిర్మాణాలు జరుపుకుంటే ప్రతిష్టాత్మక కేంద్ర విద్యా సంస్థలకు ఈ దుస్థితి ఏంటని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లదాడులతో పులివెందుల ఉద్రిక్తం

భారీగా వైసీపీ, టీడీపీ వర్గీయుల మోహరింపు
ఎస్పీ రాకతో పరిస్థితి అదుపు
టియర్‌గ్యాస్ ప్రయోగించిన పోలీసులు



రాళ్లు రువ్వుకుంటున్న ఇరువర్గాలు

విశాలాంధ్ర-పులివెందుల : కడపజిల్లా పులివెందుల రాళ్లదాడులతో దద్దరిల్లింది, అటు వైసీపీ, ఇటు టీడీపీ భారీ సంఖ్యలో మెహరించి, రాళ్లు రువ్వుకుంటూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. పూలంగళ్ల కూడలి అట్టుడు కుతుండగా ఎస్పీ అట్టాడ బాపూజీ రంగప్రవేశం చేయడంతో పోలీసులు ఇరువర్గాలను చెదర గొట్టారు. వివరాల్లోకి వెళితే.. మర్చి 1న పులివెందుల పూలంగళ్ల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆ ప్రాంత అభివృద్ధిపై చర్చకు రావాలంటూ మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఇందుకు స్పందించిన అవినాష్‌రెడ్డి తాము కూడా చర్చకు సిద్ధమేనంటూ ప్రతి సవాల్ విసిరారు. కాగా టీడీపీ చేపట్టిన అభివృద్ధి అంశంపై చర్చించేందుకు ఇరు వర్గాలు పూలంగళ్ల కూడలికి చేరుకున్నారు. రెండు వర్గాలు కవ్వింపు చర్యలకు దిగడంతో పరస్పరం రాళ్లు విసురుకున్నారు. పరిస్థితి చేయిదాటడంతో పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించి ఇరుపార్టీల కార్యకర్తలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇరువర్గాల దాడులు తారాస్థాయి చేరడంతో ఆ ప్రాంతంలో భయాందోళన నెలకొంది. అదే సమయంలో ఎస్పీ అట్టాడబాపూజీ పూలంగళ్ల కూడలికి చేరుకోవడంతో ఇరుపార్టీ కార్యకర్తలపై లాఠీచార్జి ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

అవినాష్, సతీష్, బీటెక్ రవిల ముందస్తు హౌస్ అరెస్టులు

పులివెందుల పట్టణంలో స్థానిక పూలంగళ్ల వద్ద బహిరంగ చర్చను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవిలను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. అలాగే కొంత మంది నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో గుంపులు, గుంపులుగా తిరగొద్దంటూ పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేశారు.



సంఘటనా స్థలంలో ఎస్పి



అవినాష్‌తో చర్చిస్తున్న పోలీసులు



స్టేషన్‌లో టీడీపీ నాయకులు బి.టెక్. రవి

సచివాలయం సాక్షిగా మహిళల ఆత్మగౌరవానికి భంగం

విశాలాంధ్ర అమరావతి : అందమైన భవనాలు..మధ్యలో పచ్చిన బయలు... చీకటిపడితే కళ్లు మీరమీట్లుగొలిపే లైటింగ్...ఇవి ఆంధ్రప్రదేశ్ తాత్కాలికి సచివాలయంలో మనకు దర్శనమిచ్చే దృశ్యాలు ... సెంట్రల్ ఏసీలు...బ్యాటరీ కార్లు...జర్మనీ స్మార్ట్ సైకిల్స్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే వాహనాలు... అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన ఏపీ సచివాలయంలో సామాన్యుల కనీస అవసరాల కోసం వసతులు లేవంటే మీరు నమ్ముతారా? ..సుమారు రూ. 1000కోట్లతో నిర్మించిన ఏపీ తాత్కాలిక సచివాలయానికి సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే బాధితులు, లోపలికి వెళ్లడానికి ఎంట్రీ పాస్ ఉంటే సరి ...లేదంటే ఎర్రటి ఎండలో పాస్‌ల కోసం గంటల తరబడి బయటే వేచి చూడాలి..తాగడానికి నీళ్లు, కనుచూపు మేరలో పబ్లిక్ టాయిలెట్స్ లేక అల్లాడిపోవాల్సిందే.. అక్కడి వచ్చే చాలా మంది పురుషులు...చెట్లు పొదల వైపుకు వెళ్లి తమ కాలకృత్యాలు తీర్చుకుంటారు. అనేక వ్యయభారాలకు ఓర్చి ఇక్కడకు వచ్చే మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది..చుట్టు ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడంతో సచివాలయం లోపలికి వెళ్లడానికి ఎంట్రీ పాస్ వచ్చే వరకు అష్టకష్టాలు పడాల్సిందే..ఒకవేళ ఎంట్రీ పాస్‌లు రాకపోతే వారి పరిస్థితి చెప్పనలవి కారు. ఇంతపెద్ద సచివాలయం నిర్మించి చిన్న మరుగుదొడ్డి నిర్మించకపోవడం ఏమిటని విమర్శలు వినిపిస్తున్నాయి...కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ నినాదంతో ఉపన్యాసాలు, ప్రచారాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. గ్రామాల్లో మరుగుదొడ్లు కట్టకపోతే ధర్నా చేస్తా అంటూ ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తూ, ప్రతి 15 రోజులకు ఒకసారి కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించి, జిల్లాలను ఓడీఎఫ్ ఫ్రీ జిల్లా ప్రకటించాలంటూ డెడ్‌లైన్‌లు విధిస్తారు..కాని ఆయన పాలన సాగించే సచివాలయంలోనే స్వచ్ఛభారత్ అనే మాట వినిపించదు..మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీ రోడ్లల్లో స్వచ్ఛభారత్ పాటించాలని ప్రకటలు ఇవ్వడం సర్వసాధారణం, సచివాలయం బయట మాత్రం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడలేకపోతున్నారు.

సాహితి

శ్రామికుని గ్రంథం 'సింధూరం'

నామా పురుషోత్తం
సెల్ : 9866645218


'కారల్‌మార్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథం ప్రపంచ మేధావుల ఆలోచల్ని మార్చివేసింది. పెట్టుబడి, కమ్యూనిస్టు మ్యానిఫెస్టో గ్రంథాలు ప్రపంచం మీద చూపిన ప్రభావం రాజకీయ విప్లవాలకూ దారితీసింది. 19వ శతాబ్దం చివరి దశాబ్దాలలో వచ్చిన 'పెట్టుబడి' వంటి సామాజిక చింతన వస్తువుగా ఈ కావ్యం రావడం అరుదైన అంశం. ఈ కావ్యం పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ చేసిన ప్రతిపాదనలనూ, సూత్రీకరణలనూ అనేక శీర్షికలతో కవితాత్మకంగా పాఠకులకు చేరవేస్తుంది. పెట్టుబడిని వర్తమానీకరించారు. దీనికి సమకాలీనత ఆపాదించారు. మానవ సంబంధాలను సంపద ఆర్థిక సంబంధాలుగా మారుస్తుందని మార్క్సిజం చెబుతోంది. ఈ పుస్తక రచయితలు కూడా ఆ వాస్తవాన్నే చెప్పారంటూ' సింధూరం పుస్తకానికి ముందుమాటలు రాసిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థి ఉద్యమాల నుండి మార్క్సిజానికి ఆకర్షితులైన సీనియర్ జర్నలిస్టులు వున్నం వెంకటేశ్వర్లు(వి.వి), కె.ఉషలకు గతంలోనే సాహిత్యంలో ప్రవేశముంది. మార్క్స్ 'పెట్టుబడి' కవితామాలిక అంటూ 'సింధూరం' పుస్తకాన్ని వెలువరించడం గొప్ప సాహసం. సంపద సృష్టి, పంపిణీ, అభివృద్ధి, దాని అనుభవం, సామాజిక వ్యవస్థలు, వాటి వర్గ స్వభావాలు వంటి అనేక కోణాల్లోంచి 'సింధూరం' కావ్యాన్ని కవితాత్మకంగా మన కళ్లముందుంచారు రచయితలు. పెట్టుబడి దారునికి, శ్రామికునికి మధ్య సాగే సంవాదం కూడా ఈ కావ్యంలో ఉంది. కార్మిక శక్తికి చైతన్యస్ఫూర్తిని నింపి మార్గం చూపించిన మార్క్సిస్టు సిద్ధాంతానికి మూల గ్రంథం 'పెట్టుబడి'. దీనికి నీరాజనం పలుకుతూ అక్షర రూపం కల్పించడం రచయితలకు మార్క్సిజంపై ఉన్న ప్రగాఢమైన విశ్వాసాన్ని తెలియజేస్తోంది.

జర్నలిజంలో అనేక మంది విద్యార్థులకు ఓనమాలు నేర్పిన గురువు వి.వి ప్రశంస నీయులు. ఆయనవద్ద శిక్షణపొందిన చాలా మంది ప్రస్తుతం జర్నలిజంలో అత్యున్నత శిఖరాలకు ఎదిగారు. అందులో నేనూ ఒకడినే. వి.వి పుస్తక రచయిత కాక ముందు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు. సీనియర్ జర్నలిస్టు. వృత్తిలో అనేక సవాళ్లను అధిగమించి ఎందరినో తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి. జర్నలిస్టుగా ఎదగాలంటే సామాజిక స్పృహ అవసరం. భాషపై పట్టుండాలి. అవి లేకుండా మనజాలలేమని నొక్కిచెప్పిన వ్యక్తి. అలాంటి వి.వి, వారికి తోడ్పడిన ఉష వెలువరించిన 'సింధూరం' కావ్యంలో ఎన్నో ఆణిముత్యాలు సరికొత్త పదబంధాలు, వర్ణనలు చాలా కన్పిస్తాయి.

ఎక్కడ ఎప్పుడైనా పేదరికం
సంకెలలతో ఉందీ అంటే
అక్కడ శ్రమ లొంగదీతకు
వెలి ఆయుధమయ్యింటుంది..

అంటూ ఉపోద్ఘాతంలో రచయితలు పేర్కొన్నారు. పేదరికానికి కారణాలేంటో ఈ వాక్యంలో తెలుసుకోవచ్చు.
అంతేకాదు...'ఆకలి చెలరేగిందంటే సిరి సంపదలన్నీ బందీ అయి ఉంటాయని',



'దౌర్జన్యం రాజ్యమేలుతోందంటే సంపద అహంభావం ప్రదర్శితమవడమే కారణమని' రచయితల అభిప్రాయం.

సముద్రంలో నదిని వెతుకు
గర్భప్రవాహాలు కనిపించొచ్చు
ఆకాశం అంచులు వెతుకు
భూమినెక్కడో తాకినట్టు చూడొచ్చు
పెట్టుబడిలో పరిమళాలు వెతక్కు
ఎక్కడైనా గుబాళించాయంటే
అవి మరో మోసానికి కట్టిన
అంట్లు అని భావించొచ్చు.

వాస్తవమే కదా. ఇలా పెట్టుబడి గ్రంథం వర్తమాన ఆవశ్యకతను వివరించే ఒక మాటతో మొదలై సమాజ పరిణామక్రమాన్ని వివరిస్తూ, అందులో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా కుప్పకూలిపోతుందో చెబుతూ కావ్యాన్ని ముగించారు.

ఆదిమ సమాజంలో ఆకులు, అలములు ఏరుకుని తినడం అప్పటి శ్రమ ఫలితం. క్రూరమృగాలను ఎదురిస్తూ, తలపడుతూ గెలిచేవారు, కొంతమంది చచ్చేవారు. అది అప్పటి శ్రమబతుకు. దొరికింది పంచుకోవడం చేసేవారు. సమిష్టితత్వం, ఆదర్శ సమాజం ఆనాటిదే. ఆహార వేటలో ఆయుధాలను వాడారు. సమిష్టి కృషితో ఆహార భద్రత కల్పించుకున్నారు. సంచార జీవనం సాగిస్తున్నా పశుపోషణ వదల్లేదు. రాతి, ఇనుప నాగలితో వ్యవసాయం చేశారు. అలా ఆనాటి జీవితం అందరికీ ఆదర్శ మంటూ రచయితలు కావ్యాన్ని ప్రారంభిం చారు. అప్పటి జీవితంలో ఎదురైన అనుభవా లను శీర్షికలుగా చేసుకుని కవితలు అల్లారు.

పని విభజనతో వృత్తులు ఏర్పడ్డాయి. ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకునేవారు. ఆ వృత్తులనే కులాలుగా విభజించింది సమాజం. ఆనాడు వస్తు మారకం జరిగింది. అలా కరెన్సీ ఉనికిలోకి వచ్చింది. దీంతో మారక నైజం మారింది. శ్రమ ఇక్కడ సరుకైంది. చరిత్రలో కొత్త శకం ఆవిర్భవించింది. ఉత్పత్తిలో విలువ మూలాన్ని కరెన్సీ భూతం మింగేసింది. మిగులు సంపద లాభాన్ని తీసుకొచ్చింది. అలా పెట్టుబడిదారులు పుట్టుకొచ్చారు. సంపద పంపకంలో దక్కని కార్మికులకు వేద బోధనలతో వారిని మానసిక బానిసగా మార్చారు. కట్టుకథలు వినని వారిని దండించిన సంఘటనలు కొకొల్లలు. ప్రశ్నించిన వారిని యంత్రశక్తులు తీసుకొచ్చి బతుకు లేకుండా చేశాయి. పని గంటలు పెంచి వెట్టి చాకిరి చేయించుకున్నారు. అలా పెట్టుబడిదారులు కొత్త సమాజాన్ని సృష్టించుకున్నారని రచయితలు చెప్పుకొచ్చారు.

ప్రజల యొక్క/ ప్రజల చేత/ ప్రజల కోసం/ అన్నది ప్రజాస్వామ్య నిర్వచనం/ ఏ ప్రజలు యొక్క / ఏ ప్రజల చేత/ ఏ ప్రజల కోసం అనేది కొండంత ప్రశ్నార్థకం/ అంటూ రచయితలు ప్రశ్నించారు.

పనీ పాటూ ప్రశ్నించకు
తిండీ తిప్పల జాడడక్కు
గూడూ నీడా మాటడక్కు
విద్యా, వైద్యం ఊసెత్తకు
అవి తప్ప ఏవడిగినా
ప్రజాస్వామ్యమే...

నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు రచయితలు వివరించారు. బాల కార్మిక వ్యవస్థను విశదీకరించారు. మహిళలకు సమాన హక్కుల్లేవంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలన్నీ ఆచరణలో కలవారి చుట్టాలయ్యాయని వ్యవస్థను తూర్పారబట్టారు.

డబ్బును డబ్బు పొదిగి
లాభం పుట్టుకొచ్చిందంటే
గుడ్డిగా ఏ తీరున నమ్మిస్తావ్
ఏ నోటితో జై కొట్టిస్తావ్

అంటూ పెట్టుబడిదారులను ప్రశ్నిస్తూనే.. చట్టాలతో శాసిస్తూ/ రాజ్య చట్రాలు బిగిస్తూ/ శ్రమ బతుకును చిదిమేస్తూ/ ఎదుగుతున్న, పెరుగుతున్న లాభాన్ని ప్రశ్నించాలంటూ/ ధైర్యం నూరిపోశారు.

పుస్తకంలో మూడు భాగాలున్నాయి. పైదంతా మొదటి భాగంలో చెప్పిందే. రెండో భాగంలో పెట్టుబడిదారుడికి, కార్మికుడికి మధ్య సంవాదం వివరించారు. ఒక పెట్టకు పదిగుడ్లు, పదికోళ్లుగా పెరిగినట్లు సాధారణ లాభం, అదనపు లాభం, అసాధారణ లాభం పొందుతున్నారని వివరించారు. ధరకు మూలం మార్క్స్ చెబితే, ఆయనకు ఏంగెల్స్, జెన్నీలు సహకరించారు. సోషలిజం, సోషలిజం అంటున్నారు, సోవియట్ రష్యాలో నిలిచిందా అని చాలామంది వేస్తున్న ప్రశ్నలకు రచయితలు ధైర్యంతో సమాధానం చెప్పారు.

సుడిగాలీ జడి వానకు
కొమ్మా రెమ్మా విరిగితే
అవుతుందా చెట్టు తప్పు?
కుదుటి వేళ్లు చెదరనివైతే
చివురులెపుడూ బెదరనివే
సోవియట్లులో కూలిందీ
సోషలిజం తప్పులే..

అంటూ మబ్బు పొరలు కమ్మినా/ సూర్యోదయం ఆగదు/మసకపొరలు ముసిరినా/ అసలు నిజం దాగదు/ అంటారు రచయితలు.

ఎక్కడుంది సమత్వం
చేతివేళ్లున చూపగలవా?
రంగుభేదాలాపగలవా..
బుద్ధులన్నీ కలపగలవా..
అడుగడుగునా అసమత్వం
సమత్వం సాధ్యం కాదు/ అంటూ
ధాంబీకాలు పలికే వారికి...
సంపద హరించే గద్దల
హద్దు నుంచే రాజ్యంలోనే
కడుపు నింపు కొలబద్దలు
అమలయ్యే కార్మికాధిపత్యం
ఉన్న చోటే సుసాధ్యం..

అంటూ సమాధానమిచ్చారు. రోగాలొస్తే భగవంతుని ప్రతినిధులమని చెప్పుకుంటున్న వారంతా వైద్యాన్ని ఆశ్రయిస్తారు కదా. పేదలకెందుకు నీతులు చెబుతారని రచయితలు ప్రశ్నించారు.

ఏ నీతులు చెప్పినా
ఏ గోతులు తవ్వినా
కాలే కడుపు రగిలే ఆకలి
చల్లార్చేది ఏ వేదం?
శ్రమ వాటా దక్కడం
ఒక్కటేగా పరిష్కారం...అని పేల్చారు.

ఒక వస్తువుకు విలువ రెండు రకాలుగా ఉంటుంది. ఉపయోగం, మారకం. వేరే వ్యక్తులు కొంటే మారకపు విలువ. అవసరాలకు వాడితే ఉపయోగపు విలువ. దీనిని మానవుడు తెలుసుకోలేక నష్టపోతున్నాడని పెట్టుబడి గ్రంథం చెబుతోంది. దీనినే నొక్కివక్కాణించారు రచయితలు. ధర, విలువ గురించి పెట్టుబడిదారులు వక్రభాష్యాలు చెబుతున్నారు. అందుకే రచయితలు 'విలువ త్రాసు లోలకం/ ధర తక్కెట తూకం' అంటారు. వస్తువు తయారీలో శ్రమ సృష్టించే విలువకూ, శ్రమ శక్తికిచ్చే కూలికి తేడా ఉంది. అది విప్పిచెప్పిందే పెట్టుబడి గ్రంథం. శ్రమ వాటా ఎగ్గొట్టి/ కూలి పేర లెక్కగట్టి/ దోచుకున్నదంతా మిగులు' అంటాడు మార్క్స్. పెట్టుబడి లేకుంటే పని ఉండదనే వాదనలూ ఉన్నాయి. శ్రమ చినుకులు పడితేనే/ 'సిరి' కాలం చిగురిస్తుంది' అంటారు రచయితలు.

ఇంకా పెట్టుబడి లక్షణాలు, నిరుద్యోగ పర్వం, ఎనిమిది గంటల పని, ఆర్థికమాంద్యాలు, రాజకీయ సంక్షోభాలు గురించి వివరించారు. సామ్రాజ్యవాదం పెరుగుతున్న దశలో ఎర్రజెండా పోరాటాలనూ విశ్లేషించారు. సోషలిస్టు వ్యవస్థ, విశిష్టతను వివరించారు. మార్పు అనివార్యమంటూ జయహో విప్లవం అన్నారు.

ఆ దిశగా కదిలించేదీ
పెనునిద్దర వదిలించేదీ
ఎత్తగడల అస్త్రశస్త్రాలనిచ్చేదీ
భావి చరిత్ర గమన ఆక్సిజన్
వేరు కాదు..చారిత్రిక నిజం
మార్క్సిజం

అంటూ సోషలిజం మీద మొక్కవోని విశ్వాసాన్ని ప్రకటించారు.

పుస్తకం పేరు 'సింధూరం' విషయంలోనూ రచయితలు క్లారిటీ ఇచ్చారు. పుస్తకావిష్కరణ సభల్లోనూ దానిపై వివరణ ఇచ్చారు. రాజ్యకాంక్షతో జరిగే యుద్ధానికి వెళ్లే వారికి 'సిందూరం'తో వీర తిలకం దిద్దుతారు. రచయితలు సోషలిజం కోరుకున్నారు. అందుకే 'సింధూరం' అన్నారు. వాస్తవంగా 'సింధూరం' పదానికి ఏ అర్థమూ లేదు. మహాకవి శ్రీశ్రీ కూడా తన మహాప్రస్థానంలో సిందూరం అనే వాడారు. ఇక్కడ రచయితలు మాత్రం తాము చెప్పాలనుకున్న భావజాలాన్ని, విషయాన్ని ఎఫెక్టివ్‌గా ఉండేందుకే 'సింధూరం' వాడామని చెప్పుకొచ్చారు.

అణిగిమణిగి ఉన్న జనం
అణగారిన వర్గతరం
కార్మిక కర్షక ఐక్యతన
వినువీధుల శ్రామిక బావుటా నెగరేసి
పదం పదం కదం కదం
సాగి కూల్చు రాజ్యతంత్రం
వచ్చుట తథ్యం శ్రామిక రాజ్యం..

అంటూ సోషలిజం మీద మొక్కవోని విశ్వాసమే కాదు మక్కువ కూడా ఉన్న రచయితలు మంచి ప్రయత్నం చేశారు. వారు అభినందనీయులు.

ఓ మానవతామూర్తీ! కృష్ణమూర్తీ!



తాను ప్రత్యేకంగా నిర్మించుకున్న ఆశ్రమంలాంటి ఒక విశ్రాంతి గృహంలో స్వేచ్ఛగా జీవించే ఒక మౌనమునిలా బతికిన డా॥నాయుని కృష్ణమూర్తి అందరినీ ఆదరించే మానవతామూర్తిగా, విలక్షణమైన సాహితీవేత్తగా గుర్తింపు పొందినవారు. వారి హఠాన్మరణం రాయల సీమ సాహిత్య లోకానికి తీరని లోటు. ఈ సందర్భంగా వారిని గురించీ, వారితో నాకున్న సాన్నిహిత్యం గురించి రాయడం నా కనీస బాధ్యతగా భావిస్తున్నాను.

నాయుని కృష్ణమూర్తి జన్మస్థలం చిత్తూరు జిల్లాలోని నడిమిచెర్ల అనే ఒక చిన్న గ్రామం. నాయుని రామయ్య, నాయుని నరసమ్మ దంపతులకు 1951లో నాల్గవ సంతానంగా, నలుగురి కొడుకులలో మూడవవాడిగా, జన్మించారు కృష్ణమూర్తిగారు. వీరికింకా ముగ్గురు అక్కచెల్లెళ్ళు కూడా ఉన్నారు. ఈ నలుగురు అన్నదమ్ములు ఎప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే జీవిస్తున్నారు. ప్రస్తుతం వీరి కుటుంబ సభ్యులు 42మంది. కృష్ణమూర్తిగారి శ్రీమతి పద్మకుమారిగారు. వీరికిద్దరు కుమారులు.

నాయునిగారు మేకల చిన్నపల్లెలో ప్రాథమిక విద్యను, మదనపల్లి, చౌడేపల్లిలో ఉన్నతవిద్యను తిరుపతిలో డిగ్రీ, ఎం.ఏ తెలుగు పూర్తి చేశారు. వీరు కథకుడిగా, నవలాకారుడిగా, నాటక రచయితగా, నిఘంటుకర్తగా సాహిత్యంలో ఎంతో కృషిచేశారు. వీరు 23ఏండ్ల వయసులోనే 1974లో ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన నవలల పోటీకి 'యామినీ కుంతలాలు' అన్న నవలను రాసి తృతీయ బహుమతి పొందారు. ఆ తర్వాత 'మనసు గుర్రముగోరి మనిషీ', 'ప్రలోభం' వంటి నవలల్ని, 'ఏంలేదు', 'నాయుని కృష్ణమూర్తి కథలు' అన్న రెండు కథాసంపుటాలను, 'ఈ కోతి ఈడ్రామాకు పని కొస్తుందా', 'వియోగ విభావరి', 'మాయామృగం,' వంటి నాటికలను ముద్రించారు. పిల్లల కోసం బొమ్మలతో 'తెలుగు- ఇంగ్లీషు నిఘంటువు' ను 'తెలుగు-ఇంగ్లీషు విద్యార్థి నిఘంటువు' ను ముద్రిం చారు. తెలుగు నాటక సాహిత్యంలో 'ఈ కోతి ఈడ్రామాకు పని కొస్తుందా' అన్నది మొదటి అసంబద్ధ నాటికగా గుర్తింపు పొందింది.

వీరు బొమ్మరిల్లు, విజయ, నీలిమ వంటి పత్రికలలో ఉప సంపాదకుడిగా పనిచేశారు. అలాగే 'స్నేహబాల' అన్న పిల్లల పత్రికను భాగస్వామిగా ఉండి నడిపారు. 1977లో హైస్కూలు విద్యార్థుల కోసం 'మాబడి', 1978లో 'పాఠశాల' అన్న మాస పత్రికల్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చారు. చౌడేపల్లిలో విజయ వాణి సంస్థను నడిపి తద్వారా ఒక విద్యాసంస్థను నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ ద్వారానే సోదరుల సహాయ సహకారాలతో దాదాపు 125 పుస్తకాలను ముద్రించారు.



1990 నుంచీ 'అక్షర తపస్మాన్' కు అకాడమిక్ కమిటీ అధ్యక్షుడిగాను, కేంద్రస్థాయిలో నేషనల్ లిటరసీ మిషన్ సభ్యుడిగానూ నిరక్షరాస్యుల కోసం ఎంతో కృషిచేశారు. వారికోసం 'వెలుగు బాట' వారపత్రికను నడిపారు. అలాగే 'వారం వారం విజ్ఞానం' పేరుతో 52 పుస్తకాలను తీసుకు వచ్చారు. పాఠశాలల కోసం 'చదువు' అనే మరో మాస పత్రికనూ తీసుకువచ్చారు. నూతన అక్షరాస్యులకోసం పఠనా సామగ్రిని తయారుచేసి, దీనిపైన అధ్యయనం చేయడానికి యు.కె.ప్రభుత్వం చేత అధ్యయన కమిటీ ఏర్పడడానికి మూల కారకులైనారు. వీరి 'వెలుగుబాట' పత్రిక యు.కె.లోని రీడింగ్ యూనివర్శిటీలో పరిశోధనకు మూలాంశంగా మారింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ వారు వారిపైన, వెలుగుబాట పత్రికపైన 30నిమిషాల డాక్యుమెంటరీ కూడా తీశారు.

ఇలాంటి విలక్షణమైన సాహితీవేత్తగా, నిఘంటుకర్తగా, పత్రికా సంపాదకుడిగా, గొప్ప స్నేహశీలిగా కృష్ణమూర్తిగారు గుర్తుండిపోతారు. ఇలాంటి వ్యక్తి మొట్టమొదటి గాంధీ రోడ్లో కారు ఆపి, మా శ్రీమతి నడిపే హోమియోక్లినిక్‌కు వచ్చి నన్ను తీసుకుని, మరో ముగ్గురి స్నేహితులతో ఒక హోటల్‌కి తీసుకు వెళ్ళి, అప్పటి నుంచీ స్నేహితుడిగా మారిపోయిన సంఘటన మరచిపోలేనిది. తిరుపతికి ఎప్పుడు వచ్చినా ఫోన్‌చేసి, పిలిపించుకుని మాట్లాడేవారు. నా పుస్తకాలను తక్కువ ఖర్చుతో వారి ప్రెస్‌లో ముద్రింప చేశారు కూడాను. ఎప్పుడు చౌడేపల్లికి వెళ్ళినా ఎంతో ఆత్మీయంగా భోజనం చేసిందాకా వదలని సహృదయులు.

ఇటీవల వారు మూలభారతాన్ని ఆధారం చేసుకుని రాసిన 'జయమ్' నవలను రాసేముందు ఒకరోజు నన్ను పిలిచి దానిపైన దాదాపు నాలుగు గంటల సేపు చర్చించిన సంఘటన మరచిపోలేనిది. అలాగే నేను రాసిన 'పరుస' నవలకు వారిచేత మాట రాయించుకున్న అదృష్టం కూడా నాకు దక్కింది. వారు సినిమా పాటలు రాశారు. అందులో ఒకపాటను లతామంగేష్కర్ పాడటం విశేషం.

ఇలాంటి విలక్షణమైన సాహితీవేత్త కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హఠాత్తుగా మరణించడం మనసును కలచి వేసే సంఘటన. అలాంటి మంచిమనిషి మరణానికి కన్నీటితో నివాళులర్పించడం తప్ప ఇంకేం చేయగలం!

-డా॥వి.ఆర్.రాసాని, ✆ : 9848443610

దేశదేశాల కవితా రహస్యం


అమెరికన్ బ్లాక్ పొయెట్రీ: మాయా ఏంజిలో

అయినా, పైకి లేస్తాను

వంకర తిప్పిన నీ అబద్దపు చేదు వాక్యాలతో
నువ్వు నన్ను చరిత్రలో
హీనురాలిగా చిత్రించుదువుగాక
చెత్తలాగా కుప్పపోద్దువుగాక
అయినా నేను ధూళి లాగా
పైకి లేస్తాను!
నా నిబ్బరం నిన్ను దెబ్బతీస్తోందా?
నాకేవో నూనె బావులున్నట్టూ
వాటిని నేను డ్రాయింగ్ రూంలోనే
తోడుకుంటున్నట్టూ
నువ్వెందుకంత తల్లడిల్లిపోతావ్
చంద్రుళ్ళ వలె, సూర్యుళ్ళ వలె
ఎగిసెగసి వస్తున్న కెరటాల వలె
ఆశల వలె, ఆకాంక్షల వలె
నేను, పై పైకి లేస్తూనే ఉంటాను.
నేనొక వికల శకలం కావాలని కదా
నువ్వు చూస్తున్నావూ?
నా కళ్ళు నేలచూపులు చూడాలని
నా భుజాలు అశ్రుబిందువుల్లా జారిపోవాలని
ఎవరూ వినని నా ఆర్తనాదాలు మరింత
దీనమై, హీనమై పోవాలని కదా చూస్తున్నావూ?
నా ధైర్యం నిన్ను ఇబ్బంది పెడుతోంది కదూ?
నా పెరట్లో బంగారు గనులున్నట్లుగా
హాయిగా నవ్వుతున్నందుకు?
నీ మాటల తూటాలతో నన్ను కాల్చేయ్
నీ చూపులతో నన్ను ముక్కలుగా కోసెయ్
నీ ఈర్ష్యా, ద్వేషాలతో నన్ను చంపేయ్
అయినా గాలిలాగ, నేను పైకి లేస్తాను
నా స్త్రీత్వం నిన్ను బాధిస్తున్నందుకు
ఆశ్చర్యంగా ఉందా?
నా కాళ్ళు కలుస్తున్న చోట వజ్రాలున్నట్టు
స్వేచ్ఛగా నేను నాట్యం చేయడం
నువ్వు భరించలేకపోతున్నావా?
సిగ్గుతో కుంచించుకుపోయిన
చరిత్ర గుడిసెల్లోంచి నేను పైకిలేస్తాను
వ్యథల్లో నాటుకుపోయిన
గతంలోంచి నేను పైకి లేస్తాను
నేనొక నల్ల సముద్రాన్ని
విశాలంగా పరచుకుని,
కెరటాలు కెరటాలుగా విస్తరిస్తున్న దాన్ని
భయానక రాత్రుల్ని, గగుర్పొడిచే భయాల్ని
నా వెనకే విడిచి నేను పైకి లేస్తాను



స్పష్టమైన పగటి వెలుగుల్లోకి
నేను లేస్తాను- లేస్తూనే ఉంటాను
నేను నా పూర్వీకుల
బానిస కలని, నిజమౌతున్న ఆశని
రుజువౌతున్న సంఘర్షణని
లేస్తాను. పైకి లేస్తాను
ఒక జీవితం వలె పైకి లేస్తాను
పైపైకి లేస్తూనే ఉంటాను.





నల్లజాతి అమెరికా కవయిత్రి, రచయిత్రి, పౌరహక్కులనేత అయిన మాయా ఏంజిలో (4 ఏప్రిల్ 1928–28 మే 2014) అసలు పేరు మార్గరెట్ ఏన్నీ జాన్సన్. నాటకాలకు, టెలివిజన్‌కు, సినిమాలకు విరివిగా స్క్రిప్టులు రాసి సుప్రసిద్ధులయ్యారు. యాభై గౌరవ పురస్కారాలు తీసుకున్నారు. ఏడు ఆత్మకథలు రాసుకున్నారు. అందులో Why The Caged Bird Sings (1969) అత్యంత ప్రజాదరణ పొందిన గ్రంథం. రచయిత్రిగా, దర్శకురాలిగా, నటిగా, నిర్మాతగా అంచెలంచెలుగా ఎదిగిన మాయా ఏంజిలో, బురదలోంచి ఎదిగి వికసించిన కమలం లాంటి వారు. తొలిదశలలో దుర్భరమైన జీవితం గడుపుతూ బతుకీడ్చారు. వంటమనిషిగా, వేశ్యగా, నైట్‌క్లబ్ డాన్సర్‌గా రోజులు దొర్లిస్తూ గడిపినా, ఒక ఉన్నతాశయంతో విలువలతో కూడిన ఆదర్శవంతమైన జీవితంలోకి తనను తాను నడిపించుకున్నారు. లేకపోతే మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌తో కలసి పౌరహక్కుల పోరాటంలో చురుకుగా పాల్గొనేవారు కాదు. నల్లజాతీయుల పక్షాన నిలబడి అప్రకటిత అధికార ప్రతినిధి కాగలిగే వారు కాదు. 1993లో బిల్‌క్లింటన్ అధ్యక్ష ప్రమాణ స్వీకారోత్సవంలో ఒక గౌరవనీయ కవయిత్రిగా పాల్గొని On the Pulse of Morning అనే కవిత వినిపించేవారు కాదు. (అంతకుముందు అలాంటి అరుదైన గౌరవం ఒక్క రాబర్ట్ ఫ్రాస్ట్‌కే దక్కింది. ఆయన జాన్.ఎఫ్. కెనడీ పదవీ స్వీకారోత్సవంలో కవిత్వం వినిపించారు). పౌరహక్కుల నాయకురాలిగా తరచుగా దేశాలు పర్యటిస్తూ, జాత్యహంకారానికి వ్యతిరేకంగా విరివిగా రచనలు చేశారు. రెండుసార్లు పెళ్ళి చేసుకుని రెండుసార్లు విడాకులు తీసుకున్న ఈమె, తన ఆలోచనలు సూటిగా, ధాటిగా చెప్పగలిగే గుండెధైర్యం నిండుగా ఉన్న కవయిత్రి–మాయా ఏంజిలో.

అనువాదం,పరిచయం: డాక్టర్ దేవరాజు మహారాజు, ✆ 9908633949

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం 05 మార్చి 2018



వేడుక ఏదైనా ధోతీ...కుర్తా!

పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు అంటే పిల్లలదే హడావుడి అంతా. ఆడపిల్లలకు అయితే బోలెడన్ని ఫ్యాషన్లు. మరి మగపిల్లల సంగతో? వాళ్ళకీ ఇప్పుడు ఫ్యాషన్లు చాలానే వచ్చాయి. కానీ అన్నింటిలోకీ చూడముచ్చటైందీ, అందరికీ నప్పేది ధోతీ, కుర్తా. ఇందులోనూ కుర్తాల్లో ఎన్ని మోడల్సో. ఫుల్ డిజైన్, సింపబుల్ డిజైన్, స్లీవ్‌లెస్, ఫుల్‌హ్యాండ్స్ ఇలా రకరకాలు వస్తున్నాయి. స్కూల్ ఫంక్షన్, ఇంట్లో పెళ్ళి, ఇంకేదైనా వేడుక ఎక్కడికైనా, ఎప్పుడైనా వేసుకోవడానికి బాగుండేది ధోతీ, కుర్తా. మరి ఈ మోడల్స్‌ని చూస్తే ఆ మాట మీరు కాదనగలరా!

బాదం పాలు.... బహు పసందు!

ఎండలు ముదురుతున్నాయిగా. ఇక అందరి దృష్టి పానీయాల మీదే ఉంటుంది. అందులోనూ అందరికీ అందుబాటులో ఉండేదీ, అందరూ ఇష్టపడేదీ బాదం పాలు. ఇవి రుచికి, నోటికి, నాలుకకు పసందుగా ఉండడమే కాదు అంతకంటే పదిరెట్లు ఎక్కువ ఆరోగ్యాన్నీ అందిస్తుంది. ఆవుపాలకు ప్రత్యామ్నాయంగా తీసుకోదగినవి ఈ బాదం పాలు. ఇందులో అన్ని రకాల పోషకాలు, ఆవు పాలంత బలమైన ఔషధాలు ఉన్నాయి. బాదం పాలులో లాక్టోజ్‌గానీ, కొలెస్ట్రాల్ గానీ ఉండవు. అయితే వీటిని బయట కొనడం కంటే ఇంట్లోనే తయారు చేసుకోవడం మంచిది.



ముందుగా బాదం నీళ్ళల్లో నానబెట్టి వాటిని మిక్సీలో వేసి బాగా నలగగొట్టి పాలు తీయండి. ఇలా సహజంగా తీసిన బాదం పాల వల్ల బరువు తగ్గడం నుంచి పటిష్టమైన ఎముకలు వరకూ ఎన్నో ప్రయోజనాలు అందుకోవచ్చు. గుండె, కిడ్నీల పని సామర్థ్యమూ వీటివల్ల పెరుగుతుంది. బాదం పాలు రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అధిక రక్తపోటు కారణంగా రక్తం సరిగ్గా సరఫరా కానప్పుడు బాదంపాలు తాగి చూడండి. సోయా, ఇతర పాల ఉత్పత్తులు ఇష్టపడనివాళ్ళు, అవి పడనివాళ్ళు వాటికి ప్రత్యామ్నాయంగా ఈ బాదం పాలు తీసుకోవచ్చు. పొటాషియం, పాస్ఫరస్ ఉన్న ఆహారాన్ని కిడ్నీ సమస్యలు ఉన్నవారు తీసుకోకూడదు అంటారు కానీ ఇవి రెండూ పరిమితస్థాయిలోనే ఉండే బాదం పాలను మాత్రం కిడ్నీ సమస్యలు ఉన్నవాళ్ళు కూడా ఏ మాత్రం సంకోచించకుండా వీటిని తీసుకోవచ్చు. ఈ పాలల్లో కొవ్వు పదార్థాలు అస్సలు ఉండవు. ఈ కారణంగానే ఇది గుండె సంబంధిత వ్యాధుల ముప్పునూ బాగా తగ్గిస్తుందని అనేక పరిశోధనల్లో తేలింది. బాదంపాలులో ఉండే పొటాషియం కండరాలు, రక్తనాళాలకు విశ్రాంతి కల్పించడం ద్వారా గుండెకు ఆదోళన, ఇబ్బందులను తొలగిస్తుంది. బి విటమిన్ రూపమైన రైబోఫ్లోవిన్, ఐరన్ లాంటి ఇతర ఖనిజాలతో కలిసి కండరాలను పటిష్టం చేస్తాయి. వాటి పనిసామర్థ్యాన్ని పెంచుతాయి.

బాదంపాలల్లో ఉండే ప్రోటీన్లు నిస్సత్తువగా మారిన కణాలకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయి. వీటిల్లో ఉండే విటమిన్ ఏ లాంటి పలు రకాల విటమిన్లు కంటిచూపును మెరుగుపరుస్తాయి. కంటి సంబంధిత వ్యాధులనూ దూరం చేస్తాయి. బాదం పాలు తరచూ తీసుకుంటే కేన్సర్‌నూ దూరంగా ఉంచుకోవచ్చు. కేన్సర్ కణాలు పెరగకుండా ఇది అణిచివేస్తుందని తాజా పరిశోధనల్లోనూ తేలింది. ప్రత్యేకించి పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ కేన్సర్ కణాలను ఇది అడ్డుకుంటుంది. ఎముక పుష్టికి అవసరమైన కాల్షియం కూడా బాదం పాలల్లో ఉంది. ఇది కండరాలకు తగినంత విశ్రాంతిని ఇవ్వడమే కాదు గుండె లయ సాధారణ స్థితిలో ఉండేదుకూ దోహదపడుతుంది. కాల్షియం ఆస్టియోపోరోసిస్‌ని అడ్డుకుంటుంది. ఎన్నో రకాల విటమన్లు, ఖనిజాలతో కూడిన బాదం పాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా బాక్టీరియా, అతి చిన్న సూక్ష్మజీవుల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలనూ దూరంగా ఉంచుతుంది. ఆవు పాలతో పోల్చినా ఇందులో ఉండే కేలరీలు చాలా తక్కువ. దీంతో బరువు తగ్గుతారు. ఇంట్లో తయారుచేసుకుంటే షుగర్ లేకుండానే దీనిని తీసుకోవచ్చు. ఈ కారణంగా డయాబెటీస్ రోగులూ నిస్సందేహంగా దీనిని తీసుకోవచ్చు. సో, ఇంకేం ఆలోచించకుండా ఈ సమ్మర్ సీజన్ అంతా ఎంచక్కా బాదం పాలు లాగించేయండి. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం రెండూ చేకూరతాయి.

నల్లులు వేధిస్తున్నాయా!



నిద్ర పోదామని మంచం ఎక్కితే నల్లులు కుట్టేస్తున్నాయా? ఏం చేసినా వదలకుండా పీడకలలా వేధిస్తున్నాయా! ఇవి కుడితే చాలా ప్రమాదకరమైన పరిస్థితులూ ఏర్పడతాయి సుమండీ! చూడడానికి చీమంతే ఉంటాయి కానీ వీటివల్ల మనిషి పడే పాట్లు అన్నీఇన్నీ కాదు. పరాన్న జీవులైన వీటికి మనిషి రక్తమే ఆహారం. ఇవి ఎక్కువగా రాత్రిపూటే తిరుగుతాయి. ఇవి ఎగరలేవు. సీలింగ్‌లు, గోడలు, నేల మీద కూడా ఇవి చాలా సులభంగా పాకగలవు. వీటి గుడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇవి ఇంటికి వచ్చే అతిథులు, లగేజ్, బట్టలు, ఫర్నిచర్ తదితరాల ద్వారా ఒక చోటి నుంచి ఇంకోచోటకి చేరతాయి. ఇవి కుడితే అలర్జీలు, చర్మం మీద దద్దుర్లు వస్తాయి. మనిషికి హాని తలపెట్టే నల్లుల్ని దూరంగా ఉంచాల్సిందే. కానీ ఇవి ఒక పట్టాన పోవే. ఇంట్లో నల్లులు లేకుండా చేసుకోవడం ఒక యజ్ఞమే అంటుంటారు చాలామంది. వీటిని తరిమేందుకూ కొన్ని ఇంటి చిట్కాలతో పాటు సహజసిద్ధమైన స్ప్రేలూ ఉన్నాయి. ఇంట్లో ఉండే కొన్ని రకాల పదార్థాలనే వీటికి ఉపయోగించుకోవచ్చు. అవేమిటో, ఎలా వాడుకోవచ్చో చూద్దాం.

1. లవంగం నూనె :

కీటకాలను తరిమికొట్టే లక్షణం దీని సొంతం. దీని నుంచి వచ్చే వాసనకు కీటకాలు దూరంగా ఉంటాయి. ఒకవేళ వచ్చినా ఈ నూనె ఘాటుకు అవి చచ్చిపోతాయి. కప్పు నీళ్ళల్లో ఒక టీ స్పూన్ లవంగం నూనె కలిపి దీనిని స్ప్రే బాటిల్‌లో వేసి నల్లులు ఉన్న చోట చల్లండి.

2. వేప నూనె :

ఎలాంటి కీటకాలనైనా తరిమేసే శక్తి ఈ వేప నూనె సొంతం. నాలుగు ఔన్స్‌ల నీటిలో ఒక ఔన్స్ వేప నూనె కలపండి. అందులో అర టీ స్పూన్ సబ్బు కలపండి. దీనిని బెడ్‌షీట్‌లు, మంచాలు, గోడల మీద, గది నాలుగు మూలలతో పాటు నల్లులు దాక్కోవడానికి వీలున్న ప్రతిచోటా చల్లండి. రోజుకి మూడుసార్లు ఇలా చేయండి. 20 రోజుల పాటు రోజు విడిచి రోజు ఇలా చేస్తే తొందరగా ఫలితం ఉంటుంది.

3. లావెండర్ ఆయిల్ :

నల్లులకి ఇది కూడా మంచి మందు. ఇది నల్లులు పెట్టే గుడ్లను కూడా చంపేస్తుంది. 50 మిల్లీలీటర్ల నీటిలో 10, 15 చుక్కల లావెండర్ ఆయిల్ కలపండి. దీనిని స్ప్రే బాటిల్‌లో వేసి మీకు కావలసిన చోటల్లా చల్లండి.

4. యూకలిప్టస్ ఆయిల్ :

ఇది నల్లులను తరిమికొట్టడమే కాదు వాటి గుడ్లనూ నాశనం చేస్తుంది. పురుగులు, బాక్టీరియా తదితరాలనూ ఇది తరిమేస్తుంది. 1.5 ఔన్సుల ఓడ్కాను రెండు ఔన్స్‌ల నీటిలో కలపండి. ఇందులో 30, 35 చుక్కల యూకలిప్టస్ ఆయిల్‌ను వేయండి. దీనిని స్ప్రే బాటిల్‌లో వేసి బాగా షేక్ చేసి నల్లులు ఉన్న చోటల్లా స్ప్రే చేయండి. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఇలా చేస్తే తొందరగా నల్లులు పోతాయి.

5. వాము :

కొన్ని వాము ఆకుల్ని తీసుకుని వలలాంటి వస్త్రం లేదా సంచుల్లో ఉంచి ప్రభావిత ప్రాంతంలో ఉంచండి. మూడు రోజులకు ఒకసారి పాత ఆకులు తీసేసి తాజా ఆకులు ఉంచండి. నెల రోజులపాటు ఇలా చేస్తే ఇంట్లో నల్లులు అన్నవే ఉండవు.

6. టీ ట్రీ ఆయిల్ :

50 మిల్లీలీటర్ల నీళ్ళల్లో రెండు టీ స్పూన్‌ల టీ ట్రీ ఆయిల్ వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో వవేసి నల్లులు ఉన్న చోట చల్లండి. కొన్ని రోజులపాటు రోజూ ఇలా చేస్తే నల్లులు పోతాయి. ఇది స్ప్రే చేసే ముందు బాగా షేక్ చేయడం మర్చిపోవద్దు.



ఆగ్రహం

హోలీ పండగ నేపథ్యంలో యువతులపై వేధింపులకు నిరసన తెలియజేస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థినులు



జరిగిన కథ

ఇంతలో సేట్జీవచ్చి నమస్కారంచేసి, "అమెరికన్ ఆఫీసర్సు స్పెషలులో అసలైన 'స్టోర్సు'ని దిగుమతి చేయిస్తున్నాను. రాత్రికి పద్మినీ, హస్తినీ, చిత్తినీ, శంఖినీ - అన్ని రకాలు యేర్పాటు చేయించాను. తమ ఆజ్ఞ..." అని చేతులు నులుపుకుంటూ నిలబడ్డాడు. నాకు తలప్రాణం తోకకొచ్చింది. "ఫో. యిక్కడ నుంచి ఫో" అని అన బోయి మళ్ళీ నాలిక కరచుకొని - "మీరు దయచేసి వెళ్ళండి! మరెప్పుడూ నా సెలూను దగ్గరకు రాకండి. నమస్కారం!" అని అతని ముఖంమీద తలుపుమూసి లోపలి గడియ వేశాను. "చిత్తం!" అంటూ సేట్జీ వెళ్ళిపోయాడు.

(నిన్నటి సంచిక తరువాయి)

"శివ - శివా!" అనుకున్నాను.

ఉదయం లేచి పత్రిక చదివేను:

"....చెన్నపట్నం కాంగ్రెసు లెజిస్లేచరుపార్టీ సమావేశంలో పార్టీ నాయకుడు శ్రీమాన్ రాజగోపాలాచారిగారు ప్రతిపాదించే తీర్మాన పాఠం: భారతదేశాన్ని ఎదుర్కొంటూన్నట్టి అత్యంత క్లిష్టపరిస్థితులను గమనించి, భవిష్యత్తులో భారతరాజ్యాంగ ప్రణాళికలు సిద్ధముచేయు సమయమాసన్నమైనపుడు ముస్లిం లీగు నేడు కోరుచున్నట్టే భారతదేశమునుండి వేరుపడుటకే నిశ్చయించిన యెడల అట్టి కోరికను మంజూరు చేయవలయునని ప్రస్తుత అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ముస్లింలీగుతో సంప్రతింపులు జరిపి సంయుక్త జాతీయ గవర్నమెంటును స్థాపించుటకు వారిని ఆహ్వానించవలసినదిగా యీ సభవారు అఖిల భారత కాంగ్రెసు సభవారికి సిఫార్సు చేయుచున్నారు...ఈ ప్రమాదభరితమైన పరిస్థితులలో భారతదేశ మందలి యీ దక్షిణ భూ భాగములో నివసించు ప్రజల తమ విద్యుక్తధర్మమును నిర్వర్తించుటకుగాను తగిన రీతిని అవకాశములను కలిగింపగలిగే జాతీయ గవర్నమెంటును యీ రాష్ట్రంలో స్థాపించుట మిక్కిలి అవసరమని యీ రాష్ట్ర ప్రజలు గాఢముగా వాంఛించుచున్నారు. ఈ రాష్ట్ర ప్రజల మనోభీష్టములను నెరవేర్చి సంయుక్తమైనట్టిన్ని కట్టుదిట్టమైనట్టిన్ని ప్రజా రాజ్యాంగమును నెలకొల్పు యత్నములో ఉచితరీతిని పాల్గొనవలసినదిగా ముస్లిం లీగును ఆహ్వానించవలయునని యీ సభవారు అభిప్రాయపడుచున్నారు..."

రాజాజీ ధోరణి నాకు పూర్తిగా నచ్చింది. ఆయన ఎంతో ధైర్యం అయిన పనిచేశాడు. ఉన్న విషయాన్ని కుండ బద్దలుకొట్టినట్టు ఏమీ దాపరికంలేకుండా చేప్పేశాడు. అంతా బాగానేవుంది. కాని, ఆయనతో కమ్యూనిస్టులు చేతులు కలిపితే అసలు ప్రజాభిప్రాయం సహిస్తుందో, సహించదో? గాంధీ, పటేలు, నెహ్రూ, అజాదులకి ఇది నచ్చుతుందా? జిన్నా ఏమంటాడో? శాస్త్రిగారి నక్కజిత్తులు బాగా ఫలించాయి! ఆయన రొట్టె నేతిలో పడ్డట్టే! దీంతో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఆయనకి స్థానం ఖాయం అన్నమాటే! శాంతంగారు మాత్రం పెనిమిటితో ఢిల్లీ వెళుతారా? లేకపోతే - కాంగ్రెసులోనే వుండిపోతారా? ఆయనకి అంత గొప్ప హోదా లభిస్తూంటే, కాంగ్రెసుని అంటిపెట్టుకుని ఆమె కూచుంటుందా? ఇక నాకు సుభ అన్నివిధాలా దూరం అయిపోతుంది! ఇక నా పని ఇంతే...

9 ఆమె

అబ్బ! ఎండలు మండిపోతున్నాయి. కత్తెర్లింకా ముందుకే వున్నాయి. ఇప్పుడే ఇలావుంటే ఇక అప్పుడెలా వుంటుందో! వొంటిమీద గుడ్డ వుంచుకోవడమే కష్టంగా వుంటే, యీ ఖద్దరు ఒకటి -చస్తూంటే సందిమంత్రంలాగు. దీనికితోడు వొంటికి బంకపూసుకున్నట్టు ఈ చెన్నపట్నం చెమట! ఇదంతా చాలనట్టు యీ ఆవకాయతంతు ఒకటి! అలహాబాదు వెళ్ళేముందు నాన్న నాతో -

"సుబ్బదూ! ఈ మాటు మేం ఇద్దరం ఇంట్లో లేకుండా అయింది. ఈ పూచీ అంతా నీ మీద పడిందేవ్, మరి ఎలా పెట్టిస్తావో యేమిటో. ఆవకాయంటే సామాన్యవిషయం కాదు - సంవత్సరం పొడుగునా వుండవలసిన ఆవకాయ అలాంటిది. సంసార సంగ్రామంలో జయాజపజయాలు ఆవకాయమీదే



ఆధారపడి వుంటాయనుకో, బహుపరాక్!" అని మరీ మరీ చెప్పి వెళ్ళారు. చెప్పి వెళ్ళడమేమిటి సభాకార్యక్రమం తయారు చేసినట్టు 'ప్రార్థన' దగ్గరనుంచి 'సభాధ్యక్షులకి వందనాలు' వరకూ కాగితం మీద ఇంగ్లీషున టైపుచేయించి మరీ ఇచ్చారు. రైలు కదులుతూండగా "సుబ్బదూ! మర్చిపోగలవు - రాయవేలూరు కోటగుమ్మందగ్గర వైయ్యాపురి మొదలియార్!" అని గొంతుక చించుకుని కేకేశారు. కార్యక్రమం ప్రకారం నిన్న ప్రొద్దున లేచి స్టూడ్‌బేకర్ కారులో వేలూరు కోట గుమ్మం దగ్గర వైయ్యాపురి మొదలియార్ మామిడితోటకు వెళ్ళి నాలుగు వందలకాయ దింపించుకొచ్చాను. "చెట్టుమీదనుంచి కాయల్ని



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

దింపించుతూన్నప్పుడు వొక్కకాయకూడా కిందపడితే వాటంకాదు. ఏమాత్రం దెబ్బ తగిలినా కాయల్ని తిరగొట్టేయ్! కాస్త ఇటూ అటూ వున్నా ఫరవాలేదు. పోలీసువాడి దెబ్బల్లాగు కాయ కిందపడినా దెబ్బ వెంటనే కనిపించదు. జాగ్రత్త! అటూ ఇటూ పరాగ్గా చూశావా దెబ్బ తగిలిన కాయని నీకు అంట కట్టేస్తాడు. ఆవకాయ పులిసి అఘోరిస్తుంది. నీ తెలివితేటలన్నీ ఉపయోగించవలసిన తరుణం! మల్‌గోవా మొదటిరకం వందకాయ, పుల్లకాయ రెండోరకం మూడువందలు దింపించు. రెండోరకం నౌఖర్లకీ, వారపు కుర్రాళ్ళకీ, అనుకోకుండావచ్చే అభ్యాగతులకీ సరిపోతుంది. ధర్మానికిస్తే పిచ్చుకుంచమని దెబ్బలాడినట్టు, ఏదో ఇంతపడేస్తున్నాం అని కృతజ్ఞత లేదు. అది బాగులేదు, ఇది బాగులేదు అని సణుగుడే. కాలం మారిపోతుంది. ఇక యీ యుద్ధం తరువాత సోషలిజం వచ్చిందంటే, కాంగ్రెసు ధర్మమా అంటూ ఇక అందరం గవర్నమెంటు ఫాక్టరీలో తయారైన ఆవకాయనే కొనుక్కోవాలని ఆర్డినెన్సు వేస్తారేమో కూడా!" అని సోషలిజంమీద ఒక ఉపన్యాసం ఇచ్చారు. టైపు కాగితం చేతికిస్తూ--

"ముక్కావకాయ వెల్లుల్లి వెయ్యనిది. డిటో బెల్లం వేసినది! తూర్పు ఆవకాయ కాయక్కాయ వెల్లుల్లి వేసింది. డిటో వెల్లుల్లి వెయ్యనిది; తొక్కుడుపచ్చడి! మామిడికాయ మెంతిపచ్చడి: మాగాయ - ఒకటవ షరా: టెంకలు మాగాయిలో వేయటం ఎన్నటికీ మరచిపోకూడదు. రెండవ షరా: మాగాయలో వేపగింజ విధిగా వేసితీరవలె."

అబ్బబ్బ! నాన్న కెందుకో ఇంత తిండితాపత్రయం, రుచులకోసం చెవికోసుకోవడం? ఎంత వృథా ప్రయాస? ఇదంతా మన క్షీణదశ చిహ్నాలు కావూ? నూటికి తొంబైతొమ్మందుగురు పస్తులుండి చస్తూంటే, ఒక్కడు రుచులు మరిగి పంచభక్ష్య పరమాన్నాలు ఆరగించి బేవుమని తేనుస్తే - ఏం నాగరికత? ఒకవైపు కొరవికారం. ఒకవైపు టొమాటో గరసం, బాదంఖీరు!

నాన్న పురమాయించిన రెండోరకం ఆవకాయ పదేళ్ళ కిందట మా నైజాంలో మాకు ఒక పూటకేనా దొరికివుంటే, పంచభక్ష్య పరమాన్నమే అనుకునేవాళ్ళమి. మామిడి టెంకలను చితక్కొట్టి లోపల జీడిబద్దలని తీసేసి అన్నంలో అద్దుకుని పచ్చిమిరపకాయ కొరుక్కు తినగలిగితే ఎంతో అదృష్టం అనుకునేదాన్ని ఆ రోజుల్లో! అటువంటిది ఇప్పుడు నాకెన్ని కొత్త రుచులు అలవాటై పోయాయి!

ఆవాలు, ఎర్రమిరపకాయలు, మెంతులు, వెల్లుల్లి, ఉప్పు, బెల్లం, సెనగలు - యేమి ధరలు! యేమి ధరలు! సామాన్య కుటుంబాలు యెలా సంసారాలు చేసుకుంటున్నాయో కదా! అన్నట్టు పులియంతోపు కర్రలు కొట్టుదగ్గిర పళనియాండి పడియాచిచేత నువ్వులు గానుగపట్టించి మరీ కొనమన్నారు నూనె. మొదటిరకం ఆవకాయలో అంగప్ప నాయకన్ వీధిలో బంగాళీ దుకాణంలో ఒక వీశె ఆవనూనె కొనివెయ్యమన్నారు. టైపు కాగితంలో ఆ దుకాణం చిరునామా సరిగ్గా చూడాలి - లేకుంటే కొంప మునుగుతుంది.

మా యింటిలో ఆవకాయకోసం గుండలు కొట్టించడం, కాయలని కడిగించి తుడిపించి, ఆల్చిప్పలతో తొక్కతీయించడం ఓఢ్రమంగలివాడి పని. మదత కత్తిపీటలో కాయలని తరగడం డ్రైవరు పని. అటువంటిది ఇంటినుంచి బయలుదేరేముందు నన్ను అసుంటా పిలిచి : "ఆవకాయ తరగడం పని వడివేలుకే వప్పచెప్పు. ఆ కమ్యూనిస్టు అమృతరావుని మాత్రం ఆవకాయ దగ్గరకి రానివ్వకు. వాళ్ళు భాగ్యవంతులని చూసి ఓర్వలేరు. ఏముంది, నువ్వు పరాకుగా వున్నప్పుడు ఆవకాయకుండలో ఒక పురిపెడు నీళ్ళుపోస్తే చాలు, బూజుపట్టి పాడవడానికి. అసలు కమ్యూనిస్టుల కళ్ళు పడితే ఆవకాయ కుళ్ళిపోతుంది. జాగ్రత్త సుమా సుబ్బదూ!" అన్నారు. "అదేమిటి శాస్త్రీ! నీకు సంధిపిచ్చ పదుతూన్నట్టుంది. ఆ మాటకివస్తే పదివేల రూపాయల కారూ, మన ప్రాణాలూ అతని చేతుల్లో పెడుతున్నాం కామా?" అంది అమ్మ కోపంతో. "కారూ, మన ప్రాణాలు వాడి చేతుల్లో పెట్టాం అంటే, సివిలుబాధ్యత భీమా కంపెనీది, క్రిమినలు బాధ్యతలు వాడికేం లేవు! ఈ పద్ధతులన్నీ వాళ్ళకి కొట్టినపిండే. మీ అమ్మది సత్యకాలం. నువ్వుమాత్రం వాడికి ఆరోజు సెలవిచ్చేయి. దగ్గరకు రానిస్తే కనికట్టుమంత్రం వేసేస్తాడు సుమా!' అన్నారు నాన్న. "అతను కమ్యూనిస్టు అని ఏం దాఖలా నాన్నా?" అని అడిగేను నవ్వుతూ. "అదుగో మళ్ళీ వాళ్ళలో వెళ్ళి చేరిపో!" అన్నారు నామీద విరుచుకుపడుతూ. శ్రీకృష్ణుడి విశ్వరూప సందర్శనంలాగు నాన్నకి యెక్కడ చూసినా కమ్యూనిస్టులే కనబడుతున్నారు. ఏ.ఐ.సి.సి.లోనూ వాళ్ళే. ఆవకాయ గూనల్లోనూ వాళ్ళే!

నాన్న ఎంత చెప్పారో సరిగ్గా అందుకు వ్యతిరేకం అయింది. బ్యూక్ కారుడ్రైవరు వడివేలు 'పెళ్ళానికి పురుడొచ్చి ప్రాణంమీదికి కొచ్చింది. ఆస్పత్రికి తీసుకువెళ్ళాను. నాలుగు రోజులు సెలవు కావా'లంటూ ఆస్పత్రి నుంచి అర్ధరాత్రి టెలిఫోను చేశాడు. ఓఢ్ర మంగలాడు వాళ్ళ వూళ్ళో అమ్మవారు పండుగలని, వద్దురా అంటూంటే మొండికేసి వెళ్ళిపోయాడు. ఇంకేం చేసేది? అమృతరావుని అడుగుతేనే కాని వీలు లేకపోయింది. 'అజానుబాహు అరవింద దళాయతాక్షం' అన్నట్టు అమృతరావు అందమైన మనిషి. తెల్లటి తెలుపు. ఆ తెలుపుకి మించిన కాంతి కళ్ళల్లో. ఆ కాంతిని మించిన మెరుపు. ఆ ధగధగమని ప్రకాశిస్తూ తమ్మెట్లు! అతని పిలిచి అడిగేను ఇంగ్లీషులో -

- ఇంకా వుంది.

టెన్త్‌తో ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 245 పోస్ట్‌మ్యాన్/ మెయిల్ గార్డ్ పోస్టులు

పదోతరగతి విద్యార్హతతో పోస్ట్‌మెన్, మెయిల్ గార్డ్ పోస్టుల భర్తీకి ఏపీ పోస్టల్ సర్కిల్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఖాళీలు వివరాలు

▸ **పోస్టుమెన్ 234 - మెయిల్ గార్డు 11**

పదోతరగతి విద్యార్హతతోనే జీవితంలో స్థిరపడే అవకాశం కల్పిస్తోంది తపాలా శాఖ. పోస్టు మెన్, మెయిల్ గార్డు అంటే ఇవేవో చిన్న ఉద్యోగాలే అనుకోవడం పొరపాటే. ఎందుకంటే కొత్తగా అమల్లోకి వచ్చిన వేతన నిబంధనల ప్రకారం ఈ రెండు ఉద్యోగాలకూ రూ.21,700 మూలవేతనం దక్కుతుంది. దీనికి అదనంగా కరవుభత్యం, ఇంటిఅద్దె భత్యం... మొదలైనవన్నీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తిస్తాయి. కాబట్టి ఎలాంటి చిన్న గ్రామంలో పోస్టింగ్ వచ్చినప్పటికీ పాతికవేల రూపాయల నెల జీతం గ్యారెంటీ. అంతేకాకుండా ఒత్తిడి, పనివేళలు తక్కువగా ఉంటాయి. కొద్దిపాటి అనుభవంతో శాఖాపరమైన పరీక్షల ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు. ఖాళీలను రాతపరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా భర్తీచేస్తారు. ప్రశ్నలు సైతం పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. కాబట్టి రైల్వే ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారు వీటినీ ప్రయత్నించవచ్చు.

పరీక్ష ఇలా...

వంద మార్కులకు ఆప్టిట్యూడ్ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. అవి...



▸ పార్ట్ - ఎ : జనరల్ నాలెడ్జ్, పార్ట్ - బి: మ్యాథమేటిక్స్

▸ పార్ట్ - సి : ఇందులో రెండు విభాగాలు ఉన్నాయి. విభాగం-1లో ఇంగ్లిష్, 2లో తెలుగు సబ్జెక్టు నుంచి ప్రశ్నలు వస్తాయి.

అర్హత సాధించాలంటే...

పార్ట్ ఎ, బిలు కలిపి ఓసీలైతే 10, ఓబీసీలు 9, ఎస్సీ, ఎస్టీలు 8 మార్కులు సాధించాలి. అలాగే పార్ట్ సిలో రెండు విభాగాలూ కలిపి ఓసీలైతే 10, ఓబీసీలు 9, ఎస్సీ, ఎస్టీలు 8 మార్కులు సాధించాలి. ఇలా విభాగాల వారీ మార్కులు సాధించడంతోపాటు మొత్తం ప్రశ్నపత్రం నుంచి ఓసీలు 40, ఓబీసీలు 37, ఎస్సీ, ఎస్టీలు 33 మార్కులు సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. అనంతరం అర్హుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. ఎంపికైనవాళ్లు రెండేళ్ల ప్రొబేషన్‌లో కొనసాగుతారు. ఆ తర్వాత శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఉద్యోగంలోకి చేరిన మొదటి నెల నుంచే రూ.21,700 మూలవేతనం చెల్లిస్తారు. ఇతర అన్ని అలవెన్సులూ కలుపుకుని ప్రారంభం నుంచే రూ.25 వేలకు తగ్గకుండా వేతనంగా పొందవచ్చు.

▸ **ఖాళీల వివరాలు :** పోస్టుమ్యాన్ ఖాళీలు విజయవాడ రీజియన్‌లో 106, కర్నూలులో 60, విశాఖపట్నంలో 68 ఉన్నాయి. మెయిల్ గార్డు పోస్టులు విజయవాడ రీజియన్‌లో 6, కర్నూలులో 2, విశాఖపట్నంలో 3 ఉన్నాయి.

▸ **అర్హత :** పోస్టుమ్యాన్, మెయిల్ గార్డు రెండు పోస్టులకూ పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.

▸ వయసు 18 - 27 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

▸ **దరఖాస్తులు :** ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

▸ **నియామకం :** పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన నియామకాలు చేపడతారు.

▸ **పరీక్ష తేదీ :** తర్వాత ప్రకటిస్తారు.

▸ **పరీక్ష కేంద్రాలు :** విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు.

▸ **ఫీజు :** అప్లికేషన్ ఫీజు రూ.వంద అందరు అభ్యర్థులూ చెల్లించాలి. పరీక్ష ఫీజు రూ.400. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

▸ **ఆన్‌లైన్‌లో ప్రాథమిక వివరాల నమోదుకు చివరితేదీ :** మార్చి 15

▸ **హెడ్ పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించడానికి చివరితేదీ :** మార్చి 16

▸ **ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరితేదీ :** మార్చి 20



లక్నో మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 386 ఉద్యోగాలు

కేంద్రం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన లక్నో మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎల్ఎంఆర్సీ).. 386 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ **పోస్టు-ఖాళీలు :** ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో.. అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం)-27 (సివిల్-7+ఎలక్ట్రికల్-6+ ఎస్అండ్‌టీ-3+ఆర్కిటెక్ట్-3+ ఆపరేషన్స్-2+ఐటీ-1+ ఫైనాన్స్-1+హెచ్ఆర్-2+ పబ్లిక్ రిలేషన్స్-2), అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ (ఏసీఎస్)-1; నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో స్టేషన్ కంట్రోలర్ కం ట్రెన్ ఆపరేటర్ (ఎస్‌సీటీవో)-101, కస్టమర్ రిలేషన్స్ అసిస్టెంట్ (సీఆర్ఏ)-49, జూనియర్ ఇంజనీర్ (జేఈ)-93 (సివిల్-31+ఎలక్ట్రికల్-35+ ఎస్అండ్‌టీ-27), ఆఫీస్ అసిస్టెంట్ (ఓఏ)-2 (హెచ్ఆర్), అకౌంట్స్ అసిస్టెంట్ (ఏఏ)-1, పబ్లిక్ రిలేషన్స్ అసిస్టెంట్ (పీఆర్ఏ)-2, మెయింటైనర్-110 (సివిల్-17+ఎలక్ట్రికల్-65+ ఎస్అండ్‌టీ-28).

▸ **వేతనశ్రేణి :** ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులకు రూ.20,600-రూ.46,500; నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని ఎస్‌సీటీవో, జేఈ పోస్టులకు రూ.13,500-రూ.25,520, మెయింటైనర్‌కు రూ.8,000-రూ.14,140, మిగిలిన పోస్టులకు రూ.10,170-రూ.18,500.

▸ **అర్హతలు :** ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని పోస్టులకు సంబంధిత విభాగాలను అనుసరించి బీఈ/ బీటెక్/ బీఆర్క్/ ఎంసీఏ/ ఎంటెక్/ ఎంబీఏ/ ఐసీఎస్ఐ మెంబర్/ మాస్టర్ డిగ్రీ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం); నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని పోస్టులకు సంబంధిత విభాగాలను బట్టి ఇంజనీరింగ్ డిప్లొమా/ బీకామ్/ బ్యాచిలర్ డిగ్రీ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం)/ఐటీఐ (ఎన్‌సీవీటీ/ ఎస్‌సీవీటీ)



ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ ఓబీసీ అభ్యర్థులకు కనీసం 60 శాతం, ఎస్సీ/ ఎస్టీకి కనీసం 50 మార్కులు తప్పనిసరి.

▸ **వయసు :** 2018, ఫిబ్రవరి 1 నాటికి 21-28 ఏళ్ల లోపు ఉండాలి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రిజర్వుడ్ కేటగిరీలకు మాత్రమే గరిష్ఠ వయోపరిమితిలో నిబంధనల మేర సడలింపు ఉంటుంది.

▸ **ఎంపిక :** సంబంధిత పోస్టులను బట్టి రాతపరీక్ష+ మెడికల్ ఎగ్జామినేషన్/ రాతపరీక్ష+ ఫిజియో ఆప్టిట్యూడ్ టెస్ట్+ మెడికల్ ఎగ్జామినేషన్.

▸ **రాతపరీక్ష విధానం :** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, లాజికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌తోపాటు సంబంధిత విభాగం/ట్రేడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. మెయింటైనర్ పోస్టులకు పరీక్ష 100 మార్కులకు, మిగిలిన పోస్టులకు 140 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ సమాన మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికీ 1/3వ వంతు మార్కు కోత విధిస్తారు.

▸ **పరీక్ష వ్యవధి :** 2గంటలు.

▸ **దరఖాస్తు రుసుం :** జనరల్/ ఓబీసీ-రూ.500; ఎస్సీ/ ఎస్టీ-రూ.200.

▸ **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్.

▸ **దరఖాస్తు చివరి తేదీ :** మార్చి 27, 2018.

▸ **వెబ్‌సైట్ :** www.lmrcl.com

ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్‌లో 300 పోస్టులు

తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్)... 300 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ **పోస్టు :** ట్రేడ్ అప్రెంటీస్.

▸ **స్టైపెండ్ :** కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ (డీజీఈటీ) నిబంధనల ప్రకారం.

▸ **విభాగాలు :** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ (జీఅండ్ఈ), ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాట్స్‌మ్యాన్ (మెకానికల్), మెకానిక్ ఆర్ అండ్ ఏసీ, కార్పెంటర్, పాసా (ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ : పీఏఎస్ఎస్ఏ), గార్డెనర్, హార్టికల్చర్ అసిస్టెంట్.

▸ **అర్హతలు :** పాసాకు కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్‌లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌సీవీటీ); గార్డెనర్, హార్టికల్చర్ విభాగాలకు పదోతరగతి; మిగిలిన విభాగాలకు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ల ఐటీఐ.

▸ **వయసు :** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 14-22 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

▸ **ఎంపిక :** వాకిన్ ఇంటర్వ్యూ.

▸ **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.

▸ **దరఖాస్తుకు చివరి తేదీ :** మార్చి 15, 2018.

▸ **ఇంటర్వ్యూ తేదీలు :** మార్చి 13-15, 2018.

▸ **వెబ్‌సైట్ :** www.igcar.gov.in

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 44 ఖాళీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) నార్తర్న్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-3లో 44 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. పీజీసీఐఎల్... కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్.

▸ **పోస్టు-ఖాళీలు :** డిప్లొమా ట్రెయినీ (ఎలక్ట్రికల్)-40; జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (హెచ్ఆర్)-4.


▸ **స్టైపెండ్/ వేతనశ్రేణి :** శిక్షణలో రూ.16,500 స్టైపెండ్; ఉద్యోగంలో నియమితులయ్యాక వేతన శ్రేణి-రూ.16,000-రూ.35,500.

▸ **అర్హతలు :** డిప్లొమా ట్రెనీకి ఇంజనీరింగ్ డిప్లొమాలో (ఎలక్ట్రికల్) కనీసం 70 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ కేటగిరీలకు పాస్ శాతం) మార్కులతో ఉత్తీర్ణత; జూనియర్ ఆఫీసర్ ట్రెనీ (హెచ్ఆర్)కు.. పీజీ డిప్లొమా (పర్సనల్ మేనేజ్‌మెంట్)/ ఎంఎస్‌డబ్ల్యూ (పర్సనల్ మేనేజ్‌మెంట్ మెయిన్ సబ్జెక్టు)/తత్సమాన విద్యలో కనీసం 55 శాతం (ఎస్సీ/ దివ్యాంగ కేటగిరీలకు పాస్ శాతం) మార్కులతో ఉత్తీర్ణత.

▸ **వయసు :** 2018, మార్చి 13 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

▸ **ఎంపిక :** డిప్లొమా ట్రెనీకి రాతపరీక్ష, జూనియర్ ఆఫీసర్ ట్రెనీకి రాతపరీక్ష, కంప్యూటర్ స్కిల్ టెస్ట్.

▸ **రాతపరీక్ష విధానం :** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1లో సంబంధిత విభాగం టెక్నికల్/ ప్రొఫెషనల్ నాలెడ్జ్ 120 ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-2లో ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో వొకాబ్యులరీ, వెర్బల్ కాంప్రెహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియెన్సీ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ 1 మార్కు చొప్పున మొత్తం 170 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు కోత విధిస్తారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన జూనియర్ ఆఫీసర్ ట్రెనీ అభ్యర్థులకు కంప్యూటర్ స్కిల్ టెస్ట్ ఉంటుంది. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు.



▸ **రాతపరీక్ష కేంద్రాలు :** లక్నో, కాన్పూర్, వారణాశి, ఆగ్రా.

▸ **దరఖాస్తు రుసుం :** రూ.300; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మాజీ సైనికోద్యోగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

▸ **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్.

▸ **దరఖాస్తు చివరి తేదీ :** మార్చి 13, 2018.

▸ **వెబ్‌సైట్ :** www.powergridindia.com

కపుర్తలా రైల్ కోచ్ ఫ్యాక్టరీలో 195 ఉద్యోగాలు

పంజాబ్‌లోని కపుర్తలాలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్).. 195 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ **పోస్టు :** అప్రెంటీస్.

▸ **ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు :** ఫిట్టర్-55; వెల్డర్ (జీఅండ్ఈ)-50; మెషినిస్ట్-17; పెయింటర్ (జీ)-9; కార్పెంటర్-16; మెకానిక్ (ఎంవీ)-6; ఎలక్ట్రీషియన్-28; ఎలక్ట్రానిక్ మెకానిక్-4; ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్-10.

▸ **అర్హతలు :** కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ.

▸ **వయసు :** 16-24 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ కేటగిరీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

▸ **ఎంపిక :** మార్కుల మెరిట్ (పదోతరగతి+ఐటీఐ) ఆధారంగా.

▸ **దరఖాస్తు రుసుం :** రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

▸ **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్.

▸ **దరఖాస్తు చివరి తేదీ :** మార్చి 19, 2018.

▸ **వెబ్‌సైట్ :** www.rcf.indianrailways.gov.in

ఎయిర్ ఇండియాలో 60 ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా... కోల్‌కతాలోని ఈస్టర్న్ రీజియన్ ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్)లో 60 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ **పోస్టు:** యుటిలిటీ హ్యాండ్.

▸ **మొత్తం ఖాళీలు :** 60 (జనరల్-32+ ఓబీసీ-13+ ఎస్సీ-13+ఎస్టీ-2). ▸ **వేతనం :** రూ.15,418.

▸ **అర్హతలు :** ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఏవియేషన్ సెక్టార్‌లో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. ఈ అనుభవం ఉన్న ఐటీఐ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

▸ **వయసు :** 2017, ఆగస్టు 31 నాటికి 55 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

▸ **ఎంపిక :** స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్ట్.

▸ **దరఖాస్తు రుసుం :** రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.

▸ **దరఖాస్తు విధానం :** వెబ్‌సైట్‌లో చూపిన దరఖాస్తు నమూనాలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కోల్‌కతాలోని 'ఆఫీస్ ఆఫ్ ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ కాంప్లెక్స్, హెచ్ఆర్ యూనిట్, ఏపీయూ సెంటర్, ఎన్‌టీఏ (న్యూ టెక్నికల్ ఏరియా), డం డం, కోల్‌కతా-700052' చిరునామాలో మార్చి 12, 2018న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు నేరుగా అందించాలి.

▸ **వెబ్‌సైట్ :** www.airindia.in



విశాలాంధ్ర

బెంగుళూరులో ఉడ్ ఫర్నిచర్ ట్రేడ్ ఫెయిర్...!

గుంటూరు : ఉడ్ వర్కింగ్ ఫర్నిచర్ తయారీ రంగానికి సంబంధించిన ఆసియాలో అతిపెద్ద ట్రేడ్ ఫెయిర్ ఇండియా ఉడ్ వర్కింగ్ 2018 అత్యధిక ఆవిష్కరణలు బీఐఈసీ, బెంగుళూరు వద్ద ఆవిష్కరణలు జరిపినట్లు ఇండియా ఉడ్ 2018 ఎగ్జిబిషన్ గురించి పీడీఏ ట్రేడ్ ఫెయిర్స్ వైస్‌ప్రెసిడెంట్ వి.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 40 దేశాలకు చెందిన 850 ఎగ్జిబిటర్లు మరియు భారతదేశంలోనే 900 నగరాలతోపాటు 60 దేశాలకు చెందిన 60,000 మంది వాణిజ్య సందర్శకులు రానున్నారని ఆయన తెలిపారు. ఈ ట్రేడ్ ఎగ్జిబిషన్‌లో 1000 ఉడ్ వర్కింగ్ మెషినరీలు, టెక్నాలజీలను ఇండియా 2018 ప్రదర్శించనుంది. ఈ ప్రదర్శన మార్చి 8 నుంచి 12 వరకు జరుగుతుంది. ఇండియా ఉడ్ వర్క్ అంతర్జాతీయంగా 40 దేశాలకు చెందిన ఎగ్జిబిటర్లతో పాటుగా భారతదేశంలోనే 22 రాష్ట్రాలకు చెందిన 850 మంది ఎగ్జిబిటర్లు ఆతిథ్యమిస్తున్నట్లు తెలిపారు. ఇండియా



ఉడ్‌లో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో ఎగ్జిబిటర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ఫెయిర్‌లో విస్తృతశ్రేణి ఫర్నిచర్, ప్రొడక్షన్ టెక్నాలజీలు, ఉడ్‌వర్కింగ్ మెషినరీలు, టూల్స్, ఫిట్టింగ్స్, యాక్సెసరీలు, రా మెటీరియల్స్, ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. ఉడ్ ఫర్నిచర్ పరిశ్రమను తీర్చిదిద్దే అత్యుత్తమ సాంకేతికత ధోరణులను ప్రదర్శించేందుకు అత్యుత్తమ వేదికగా ఇండియా ఉడ్ నిలుస్తుందని ఇండియా ఉడ్ వైస్ ప్రెసిడెంట్ శివకుమార్.వి. తెలిపారు.



జెఎల్ఆర్ నుంచి

తొలి ఎలక్ట్రిక్ కారు

న్యూఢిల్లీ: దేశీయ ఆటో రంగ సంస్థ టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల విభాగం జాగ్వార్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్).. తొలి ఎలక్ట్రిక్ కారు ఆవిష్కృతమైంది. ఆస్ట్రియాలో ఐ-పేస్ పేరుతో పరిచయమైన దీని ప్రారంభ ధర బ్రిటన్ మార్కెట్‌లో రూ.57.15 లక్షలుగా ఉన్న ట్లు శనివారం ఇక్కడ విడుదల చేసిన ఓ ప్రకటనలో జెఎల్ఆర్ తెలియజేసింది. ఈ నెల 6న జెనీవా మోటార్ షోలో దీన్ని ప్రదర్శించనున్నారు. కాగా, 45 నిమిషాల్లో 80 శాతం చార్జింగ్ అవుతుందని తెలుస్తుండగా, ఒకసారి పూరిగా చార్జ్ చేస్తే దాదాపు 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని సమాచారం. సంప్రదాయ ఇంధన వనరులైన డీజిల్, పెట్రోల్ ఆధారిత వాహనాల వినియోగంపై ప్రస్తుతం అటు పర్యావరణ పరిరక్షకుల నుంచి ఇటు ప్రభుత్వాల నుంచి గట్టిగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆటో రంగ సంస్థలు విద్యుత్ ఆధారిత వాహనాల తయారీపై దృష్టి సారిస్తున్నాయి.

మరో కుంభకోణం

- ఎస్‌బీఐలో రూ.3.3కోట్ల మేర మోసం..
- కారు కోసం రుణం తీసుకొని సినిమా తీశారు



చెన్నై: ఇప్పటికే మోసగాళ్ల బారిన పడిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఉదంతం ఓ కొలిక్కి రాకముందే ఇతర బ్యాంకుల్లో జరిగిన మోసాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తాజాగా ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సుమారు రూ.3.3కోట్ల మేర మోసం జరిగినట్లు అధికారులు గుర్తించారు. కార్లు కొనుగోలు చేసేందుకని రుణాలు తీసుకుని వాటిని ఓ తమిళ సినిమా నిర్మించేందుకు ఉపయోగించినట్లు ఎస్‌బీఐ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆ సినిమా విడుదలపై స్టేను కోరుతూ ఎస్‌బీఐ అధికారులు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి సీవీ కార్తికేయన్ సినిమా విడుదలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 16, 2018 వరకు సినిమా విడుదల చేయొద్దంటూ నిర్మాతలకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కబడ్డీ ఆటగాడు రాజాతో సహా మరో 13 మంది కార్లు కొనుగోలు చేసేందుకు రుణాలు కోరుతూ ఎస్‌బీఐను ఆశ్రయించారు. రాజా వైట్ స్క్రీన్ ప్రొడక్షన్స్(డబ్ల్యుఎస్‌పీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. కార్లు కొనుగోలు చేసేందుకు వీరందరూ ఎస్‌బీఐ నుంచి దాదాపు రూ.3,29,71,000 మేర రుణాలు తీసుకున్నారు. కానీ వాటిని కార్లు కొనుగోలు చేసేందుకు ఉపయోగించకుండా తమిళ సినిమాను నిర్మించేందుకు ఉపయోగించారు. ఆటోలోన్ కౌన్సిలర్ చిత్ర సహాయంతో బ్యాంకు కంప్యూటర్లను హ్యాక్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

మోసం వెలుగులోకి ఇలా..

వెళ్లచెరీ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సాధారణ తనిఖీలు నిర్వహించగా.. కారు రుణాల జారీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చిత్రలోన్ ఆరిజినేటింగ్ సాఫ్ట్‌వేర్ యూఆర్ఎల్‌ను హ్యాక్ చేసి రుణాలు నేరుగా వాళ్ల చేతికి వచ్చేలా చేసినట్లు విచారణలో తేలింది. కార్ల కొనుగోలు కోసం తీసుకున్న రుణం నేరుగా కారు డీలర్ల ఖాతాల్లో కాకుండా రుణాలు తీసుకున్న వారి ఖాతాల్లో పడేలా చేశారు. వాళ్లు ఆ నగదును సినిమా తీసేందుకు ఉప యోగించారు. విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు ఆ సినిమా విడుదలపై స్టే విధించాల్సిందిగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అందుకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది.

ఉద్యోగుల కుమ్మక్కు నిజమే



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన భారీ కుంభకోణానికి వ్యవస్థాగత లోపాలు, వైఫల్యాలే కారణమని ఆ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ సునీల్ మెహతా విచారాన్ని వ్యక్తం చేశారు. తమ బ్యాంకు ఉద్యోగుల్లో కొందరు ఈ కుంభకోణ నిందితులతో కుమ్మకై తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లు జారీచేసిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు.

పీఎన్‌బీ చీఫ్ అంగీకారం

పీఎన్‌బీ కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సునీల్ మెహతాను ప్రశ్నించినప్పుడు ఆయన ఈ విషయాన్ని ఒప్పుకున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కుంభకోణ కేసులో ప్రధాన నిందితులైన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాదాపు ఆరు గంటల పాటు సునీల్ మెహతాను ప్రశ్నించి ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. వ్యవస్థాగత వైఫల్యాలు, నిబంధనల్లో లోపాల వల్లనే పీఎన్‌బీలో భారీ కుంభకోణం జరిగిందని, కోర్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్‌కు, స్విఫ్ట్ ఇంటర్‌బ్యాంక్ మెసేజింగ్ వ్యవస్థకు మధ్య సరైన లింకులు లేకపోవడమే ఇందుకు కారణమని సునీల్ మెహతా పేర్కొన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

హాంకాంగ్‌లో నీరవ్ మోడీ?

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు(పీఎన్‌బీ) వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి భారత్ నుంచి పారిపోయిన వజ్రాల వ్యాపారి హాంకాంగ్‌లో ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇదే విషయాన్ని ముంబయిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానానికి శనివారం వెల్లడించారు. విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో ఈడీ పీఎంఎల్ఏలో పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారించిన న్యాయస్థానం నీరవ్, ఆయన వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీలపై నాన్ బెయిలబుల్ వారెంట్లను జారీ చేసింది. గతంలో నీరవ్ న్యూయార్క్‌లో ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఆయన ఎక్కడ ఉన్నాడనేది మాత్రం స్పష్టంగా తెలియడం లేదు.

పీఎన్‌బీ ఉద్యోగులకు ముడుపులుగా వజ్రాభరణాలు..

పీఎన్‌బీ నుంచి రుణాలు పొందేందుకు నీరవ్ మోదీ బ్యాంకు ఉద్యోగులకు భారీ స్థాయిలో ముడుపులు




ఇచ్చినట్లు సీబీఐ అధికారులు ముంబయి న్యాయస్థానానికి తెలియజేశారు. పీఎన్‌బీలో ఫారెక్స్ డిపార్ట్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న యశ్వంత్ జోషికి నీరవ్ నుంచి 60గ్రాముల బరువు ఉండే రెండు బంగారు నాణెలతో పాటు, బంగారు, వజ్రాభరణాలు కూడా ముట్టినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జోషితో పాటు మరికొంతమందిని ముంబయి కోర్టు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించింది.

వాణిజ్య యుద్ధం వద్దు

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాల పెంపుపట్ల అమెరికాకు ఐఎంఎఫ్ హెచ్చరిక

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకాలు వేయాలన్న అమెరికా నిర్ణయంతో ఆర్థిక ఇబ్బందులేనని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. అది సరికాదని విమర్శించింది. అగ్రరాజ్యాన్ని, దాని భాగస్వాములనూ ఇది నష్టపరిచే వీలుందన్న ఐఎంఎఫ్.. వాణిజ్య విభేదాలను నిర్మాణాత్మకంగా పరిష్కరించుకోవాలని అన్ని దేశాలనూ కోరింది. మొదట్నుంచి స్వదేశీ రక్షణాత్మక విధానాలను అవలంబిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్., తమ ఉత్పత్తిదారుల ప్రయోజనార్థం విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అవుతున్న ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాన్ని విధించనున్నట్లు గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన దిగుమతి ఆంక్షలు.. అమెరికాయేతర దేశాల్నేగాక, అమెరికా ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ఉక్కు, అల్యూ మినియం వినియోగంపై ఆధారపడిన తయారీ, నిర్మాణ రంగాల వృద్ధిని ఆటంకపరుస్తాయి అని ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి గెర్రీ రైస్ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా భావించే అమెరికానే.. ఇలాంటి రక్షణాత్మక ధోరణులను అమలుపరుస్తుండటం ఎంతమాత్రం అంగీకారం కాదన్నారు. ట్రంప్ నిర్ణయం వెలువడిన వెంటనే అమెరికా స్టాక్ మార్కెట్లైన డోజోన్స్ పారిశ్రామిక సూచీ



సగటున 400 పాయింట్లు పడిపోయింది.

అన్ని దేశాలకూ వర్తిస్తుంది

ఉక్కు అల్యూమినియం దిగుమతులపై అమెరికా పెంచే సుంకాలు.. అన్ని దేశాలకు వర్తిస్తాయని, మిత్ర దేశాలకు మినహాయింపేమీ లేదని వైట్‌హౌజ్ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. మరోవైపు తన నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించుకుంటున్నారు. మా దేశ ప్రయోజనాలు, మా కార్మికుల రక్షణకే మేము పెద్దపీట వేస్తాం. అమెరికా వాణిజ్య లోటును అదుపులో పెట్టడానికి సుంకాల పెంపు తప్ప మరో మార్గం కనిపించడం లేదు. గతంలో వందల కోట్ల డాలర్లు నష్టపోయాం. ఈ క్రమంలో ఉక్కు అల్యూమినియం దిగుమతులపై సుంకాల పెంపు.. అమెరికాకు లాభిస్తుంది అని ట్విట్టర్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఈ వాణిజ్య యుద్ధంలో అమెరికాదే విజయం అని ఆయన ట్వీట్ చేశారు.

మిత్ర దేశాల నుంచి వ్యతిరేకత

అమెరికాలోకి ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను పెద్ద ఎత్తున పెంచనున్నామన్న ట్రంప్ నిర్ణయంపట్ల మిత్ర దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఓవైపు దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలు మంచివేనని అగ్రరాజ్య అధ్యక్షుడు తన నిర్ణయాన్ని సమర్థించుకుంటుంటే.. మరోవైపు అమెరికా వాణిజ్య భాగస్వాములైన కెనడా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఆస్ట్రేలియా, మెక్సికోలు అభ్యంతరం వెలిబుచ్చుతున్నాయి. మా ప్రయోజనాలను కాపాడుకునేందుకు మేమూ గట్టిగానే స్పందిస్తామని ఐరోపా యూనియన్ చీఫ్ జీన్-క్లాడ్ జుంకర్ స్పష్టం చేశారు.

తాజా నిర్ణయంతో అమెరికాకు యూరోపియన్ యూనియన్ ఉక్కు ఎగుమతులు 50 శాతం తగ్గవచ్చని అంచనా. ఇక కెనడా, జర్మనీలు కూడా ట్రంప్ నిర్ణయం తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశాయి. మరోవైపు ట్రంప్ సర్కారు నిర్ణయంతో ప్రభావితం అవుతున్న చైనా.. అమెరికాతో చర్చలకు ప్రయత్నిస్తున్నది. అమెరికా ఉక్కు దిగుమతుల్లో చైనాది 11వ స్థానం.

నీరవ్ జోలికెళ్లవద్దు

స్టాక్‌హోల్డర్స్‌కు అమెరికా కోర్టు ఆదేశం

వాషింగ్టన్: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ అమెరికాలోని కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం దీనికి సంబంధించిన విచారణను న్యాయస్థానం చేపట్టింది. రుణదాతలు నీరవ్ దగ్గర నుంచి రుణాలను ఇప్పుడే వసూలు చేయొద్దని.. అతడి మీద ఎటువంటి ఒత్తిడి తీసుకురావద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెండు పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం నీరవ్‌కు రుణాలు ఇచ్చిన రుణదాతలు ఆయన దగ్గర నుంచి డబ్బులు తిరిగి తీసుకోవడం కుదరదు. ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటివి చేయకూడదు.

నీరవ్‌పై రుణదాతలు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకునే పిటిషన్లు దాఖలు చేయకూడదు. రుణం చెల్లించాల్సిందిగా రుణగ్రహీతకు ఫోన్, మెయిల్ చేసి డిమాండ్ చేయకూడదు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ఎవరైనా నీరవ్ ఫైర్‌స్టార్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే.. రుణదాతలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది. దీనికి సంబంధించిన నివేదికను నీరవ్‌కు రుణాలు ఇచ్చిన స్టాక్ హోల్డర్స్‌కు పంపించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.12 వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ ఈనెల 26న అమెరి కాలోని కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. పునర్వ్యవస్థీకరణకు వీలు కల్పించే ఛాప్టర్11(అమెరికా) నిబంధనల ప్రకారం ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ దీన్ని నమోదు చేసింది. వ్యాపారాన్ని సజీవంగా నిలుపుకోవడంతో పాటు రుణదాతలకు అప్పులు తిరిగి చెల్లించే వెసులుబాటు కోసం ఓ ప్రణాళికను ప్రతిపాదిస్తూ ఈ తరహా పిటిషన్‌ను దాఖలు చేస్తారు.

సిరియాలో వ్యాపిస్తున్న జిహాదీ వ్యాధి

డెమాస్కస్: అసలే అంతర్యుద్ధంతో అతాలకుతలం అవుతున్న సిరియాను ఒక కొత్తరకం అంటువ్యాధి బెంబేలెత్తిస్తోంది. జిహాదీ జబ్బుగా వ్యవహరించే లెష్మెనియాసిస్ సిరియాలో వేగంగా వ్యాపిస్తోంది. ముఖ్యంగా ఐసిస్ ఉగ్రవాదులు ఆక్రమించిన ప్రాంతాల్లో ఈ వ్యాధి వ్యాప్తి తీవ్రంగా ఉంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తులు 20-30 రోజుల్లో కన్నుమూస్తున్నారు. గతంలో ఈ వ్యాధి సిరియా, ఇరాక్ లో ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవు. ఐసిస్ ఎప్పుడైతే సిరియాలో ప్రవేశించిందో అప్పుడే ఈ వ్యాధి బయటపడింది. దీంతో ఈ వ్యాధిని స్థానికంగా జిహాదీ వ్యాధిగా వ్యవహరించడం మొదలుపెట్టారు.

ఎడారి ఈగలతో వ్యాప్తి..

ఈ భయంకరమైన వ్యాధి సాధారణంగా ఎడారి ఈగల నుంచి వ్యాపిస్తోంది. ఇవి సిరియాలో లేవు. ఇరాన్ నుంచి ఈ వ్యాధి క్రిములను ఎడారి ఈగలు తీసుకొచ్చి ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. చాలా మంది ఉగ్రవాదులు ఇరాన్ నుంచి సిరియా వచ్చే క్రమంలో వారి సామగ్రిని తరలించారు. ఈ క్రమంలో చుంచులు చనిపోయి ఉండవచ్చని వాటిపై వాలిన ఎడారి ఈగలు



సిరియాలోకి ప్రవేశించి ఉండవచ్చని భావిస్తున్నారు. అవి సిరియాలో ప్రవేశించిన సమయంలోనే ఐసిస్ వివిధ వర్గాలతో యుద్ధం చేస్తోంది. ఈ క్రమంలో చాలా మంది చనిపోయారు. వీరి మృతదేహాలపై ఈగలు వాలి క్రిములను వ్యాపింప చేశాయి. అప్పట్లో శవాలను వీధుల్లోని చెత్తకుప్పల్లో వేసేవారు. దీంతో ఈ వ్యాధి అత్యంత వేగంగా వ్యాపించింది. ఒక సారి ఈ వ్యాధి సోకిన వ్యక్తి శరీరంపై పుండ్లు ఏర్పడి నెమ్మదిగా ఆ భాగాలు కుళ్లిపోతాయి. ముఖంపై మొదలైయ్యే పుండ్లు నెమ్మదిగా శరీరం మొత్తం వ్యాపిస్తాయి. పరాన్న జీవుల నుంచి వ్యాపించే ఈ వ్యాధితో అవయవాలు కుళ్లిపోయి ఆ వ్యక్తి మృతి చెందుతాడు. శరీరంలోని ప్రతి కణం దీనిప్రభావానికి లోనుకావడం శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది.

వ్యాక్సిన్ తయారీలో ముందడుగు..

ఇది కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండే వ్యాధికాదు. దీంతో మిగిలిన ప్రాంతాలకు వ్యాపించక ముందే అదుపు చేసేందుకు వ్యాక్సిన్ తయారు చేసేందుకు ప్రయత్నించారు. కానీ చాలా కాలం ఇక్కడ ఐసిస్ పట్టుఉండటంతో పరిశోధనలకు అవకాశం లభించలేదు. ఇప్పుడు పలు ప్రదేశాల నుంచి ఐసిస్‌ను తరిమివేయడంతో శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఒక ప్రయోగాత్మక వ్యాక్సిన్‌ను సిద్ధం చేశారు.

విజ్ఞానం

మధుమేహం 5 రకాలట

వర్గీకరణ సవరణ




మధుమేహ రోగులకు మరింత మెరుగైన చికిత్స అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత స్థాయిలో రోగులకు అవసరమైన ప్రత్యేక చికిత్సా విధానాలను అభివృద్ధి చేసేందుకు శాస్త్రజ్ఞులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మధుమేహానికి సంబంధించి వర్గీకరణను ఆవిష్కరించారు. ఈ వ్యాధిలో మొత్తం 5 విభిన్న రకాలు ఉన్నాయని తెలిపారు. మధుమేహంలో టైప్-1, టైప్-2 రకాలు ఉండగా 'టైప్-1' బాధితుల్లో ఇన్సులిన్ (రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించే హార్మోన్) ఉత్పత్తి కాదు. చిన్న పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. మొత్తం మధుమేహ కేసుల్లో 'టైప్-1' కేసులు 10 శాతం ఉంటాయి. 'టైప్-2' బాధితుల్లో ఇన్సులిన్ తగినంత స్థాయిలో ఉత్పత్తి కాదు. మధుమేహానికి గురైన13,270 మందిపై స్వీడన్‌లోని లండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం చేపట్టిన పరిశోధనలో ఇన్సులిన్ నిరోధకత, ఇన్సులిన్ ఉత్పత్తి, రక్తంలోచక్కెర నిల్వలు, వయసు, అనారోగ్య ప్రారంభం వంటి అంశాలను పరిశీలించింది. వాటి ఆధారంగా మొత్తం రోగులను ఐదు బృందాలుగా వర్గీకరించింది. అందులో మూడు బృందాల్లో వ్యాధి తీవ్ర ఎక్కువగా ఉందని.. మరో రెండు బృందాల్లో తీవ్రంగా ఏమీ లేదని తెలిపింది. ఇన్సులిన్‌ను ప్రభావవంతంగా ఉపయోగించుకోలేని స్థితి(ఇన్సులిన్ నిరోధకత)లోని వ్యక్తులను శాస్త్రవేత్తలు మొదటి రకం మధుమేహుల బృందంలో చేర్చారు. వారిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. అలాంటి వ్యక్తులు మూత్రపిండ సంబంధిత వ్యాధుల బారినపడే ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇన్సులిన్ నిరోధకత కలిగి ఉన్న రోగులకు సరైన చికిత్స అందడం లేదని అభిప్రాయపడ్డారు. ఇన్సులిన్ లోటుతో బాధ పడుతున్న వ్యక్తుల్లో కూడా మధుమేహ తీవ్రత ఎక్కువగానే ఉందని వెల్లడించారు. వారిని రెండో బృందంగా వర్గీకరించారు. మూడో బృందంలో.. స్వీయ రోగనిరోధకత నాశక మధుమేహంతో బాధపడుతున్నవారిని చేర్చారు. నాలుగు, ఐదోరక బృందాల్లో.. వయసు మీదపడేకొద్దీ మధుమేహం బారినపడే వ్యక్తులు సహా ఇతరులను చేర్చారు. వారిలో తీవ్ర ప్రతికూల ప్రభావాలేవీ కనిపించలేదని తెలిపారు.

అంటార్కిటికా మంచు ఫలకాలు కరుగుతున్నాయి



అంటార్కిటికా సముద్రపు మంచు కరుగదంతో రెండవసారి రికార్డు నమోదు చేసింది. ఆస్ట్రేలియన్ శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ఫ్లోటింగ్ ఐస్ చిన్న ప్రదేశాల్లో ఉండటాన్ని చూడవచ్చు. ప్రతి ఏడాది అంటార్కిటికా సముద్రంలోని మంచు ఫలకాలు వేసవి, వసంత మాసాల్లో కరుగుతూఉంటాయి. మళ్లీ శీతాకాలం ఉష్ణోగ్రతలు పడిపోవడంతో మంచు కప్పు మళ్లీ పెరుగుతుంది. 1979 నుండి పరిశోధకులు అంటార్కిటికా సముద్రపు మంచును కొలుస్తున్నారు. తాజా ఉపగ్రహనివేదిక ఆధారంగా, ఫిబ్రవరిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకారణంగా దాదాపు 2.15 మిలియన్ చదరపు కిలోమీటర్లు మంచుతో కప్పబడిఉంది. ఇది గత సంవత్సరం నమోదైన 2.07 మిలియన్ చదరపు కిలోమీటర్లకంటే ఎక్కువేనని చెప్పవచ్చు. గత ఏడాది ధృవాల వద్ద మంచు 18.05 మిలియన్ చదరపు మైళు కప్పబడిఉంది. ఇదే అత్యల్పమనిచెప్పవచ్చు. 2016 ఆగస్టు నుండి సముద్రపు మంచుతో కప్పబడిన ప్రాంతం దీర్ఘకాలంగా పేరుకుపోయిన మంచుతో చూసుకుంటే మాత్రం తక్కువేనని చెప్పవచ్చు. 2017 శీతాకాలంలో పేరుకుపోయిన మంచు 18.05 కిలోమీటర్లతో అత్యంత తక్కువేనని చెప్పవచ్చు.

భారత్‌లోకి 'అమెజాన్ మ్యూజిక్'



ముంబై: ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో 'అమెజాన్ మ్యూజిక్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మనకు నచ్చిన పాటలను లేదా కొత్త పాటలను డౌన్‌లోడ్ చేసుకుని వింటూ ఆస్వాదించేవారు. కానీ, మారుతున్న ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఇప్పుడు పలు స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫాంలు అందుబాటులోకి వచ్చాయి. సావన్, గానా, యాపిల్ ఐ ట్యూన్స్‌తో పాటు పలు టెలికాం కంపెనీలు సైతం తమ వినియోగదారులకు ఉచితంగా పాటలను అందిస్తున్నాయి. ఎయిర్‌టెల్ వింక్ మ్యూజిక్ ద్వారా.. జియో మ్యూజిక్ పేరుతో రిలయన్స్ జియో ఈ సేవలను అందిస్తున్నాయి. తాజాగా ఇప్పుడు అమెజాన్ సైతం ప్రవేశించింది. ఇప్పటికే అమెజాన్ ప్రైమ్ మెంబర్స్‌గా ఉన్న వారు అమెజాన్ మ్యూజిక్ సేవలను ఉచితంగా పొందవచ్చు. ప్రైమ్ మెంబర్ షిప్ తీసుకున్న వినియోగదారులు ఉచితంగా ఒక్క రోజులో ఆర్డర్ డెలివరీ లభిస్తుంది. దీంతో పాటు ప్రైమ్ వీడియో సేవలు అదనంగా అందుకుంటారు. ఇప్పుడు అమెజాన్ మ్యూజిక్‌ను కూడా ఆస్వాదించవచ్చు. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, తమిళం, కన్నడ, పంజాబీ, మలయాళం, మరాఠి, బెంగాలీ, భోజపురి, గుజరాతీ, రాజస్థానీ భాషల్లోని వేల కొద్ది పాటలను స్ట్రీమింగ్ ద్వారా విని ఆస్వాదించవచ్చు. ఇతర స్ట్రీమింగ్ యాప్స్‌లో భాషను కూడా ఫిల్టర్ సెట్టింగ్స్‌లో ఉపయోగిస్తున్నాయి. కానీ, అమెజాన్ మ్యూజిక్‌లో ఆ సౌలభ్యం లేదు. గత కొన్నేళ్లుగా తాము వినియోగదారుల అభిరుచులను గమనిస్తున్నామని చాలా మంది ఒకటి కంటే ఎక్కువ భాషల గీతాలను వినేందుకు ఇష్టపడుతున్నారని అందుకే తమ అప్లికేషన్‌లోని ఫిల్టర్స్‌లో లాంగ్వేజ్ ఆప్షన్ ఇవ్వలేదని అమెజాన్ మ్యూజిక్ ఇండియా డైరెక్టర్ సాహస్ మల్హోత్రా తెలిపారు. 'అమెజాన్ మ్యూజిక్' 2014లో ప్రారంభంకాగా తాజాగా భారత్‌తో కలిసి ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల్లో లభిస్తోంది.

కాస్త ఊరట

- హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములకు ఉపశమనం
- ఉద్యోగాల తొలగింపుపై అమెరికా నిర్ణయం ఆలస్యం
- ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించి జూన్‌కల్లా ఖరారు



వాషింగ్టన్: హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములకు తాత్కాలిక ఊరట లభిం చింది. అమెరికాలో వీరి ఉద్యోగాల తొలగింపుపై ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం ఆల స్యం కానున్నది. దీంతో ప్రధానంగా భారతీయ కుటుంబాలకు కొంత ఉపశమనం దొరికినైట్లైంది. హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయులు ఎక్కువన్న విషయం తెలి సిందే. హెచ్4 వీసా వినియోగదారుల (హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు) పని అధికారం తొలగింపుపై ఇప్పుడే ఎటువంటి నిర్ణయం తీసుకోబోవడం లేదు అని కోర్టుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) తెలియ జేసింది. ఈ నిర్ణయం వల్ల కనిపించే ఆర్థికపరమైన ప్రభావంపై సమీక్షించి, జూన్ కల్లా ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తామని స్పష్టం చేసింది. 2015 నుంచి గ్రీన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న హెచ్-1బీ వీసాదారుల భాగస్వాముల (భార్య లేదా భర్త)కు హెచ్4 ఆధారిత వీసాలపై అమెరికాలో పని చేసుకునేందుకు గత ఒబామా ప్రభు త్వం అర్హత కల్పించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత ట్రంప్ సర్కారు.. హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలో ఈ హెచ్4 వ్యవ హారంపైనా ఫిబ్రవరి 28కల్లా ఓ నిర్ణయాన్ని తీసుకుంటామని డీహెచ్ఎస్ ప్రకటిం చింది. దీన్నిప్పుడు జూన్ వరకు వాయిదా వేయగా, హెచ్-1బీ వీసాదారుల భాగస్వాముల్లో నెలకొన్న ఆందోళన కొంత తగ్గినైట్లైంది.

ఎండల్లో ఎసిడిటీ నివారణకు సూచనలు



ఈరోజుల్లో చాలామంది ఎసిడిటీ సమస్యతో బాధపడుతున్నారు. దీనిని నివారించటానికి ఆహారంలో మార్పు చేస్తే సరిపోతుంది. వాటిగురించి తెలుసుకుందాం.

- పుచ్చకాయల్లో పీచు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఎసిడిటీ తలెత్తకుండా అడ్డుకుంటాయి. ఈ పండులోని చల్లదనం నీటి కారణంగా శరీరంలో డీహైడ్రేషన్ సమస్య తలెత్తదు. పిహెచ్ పరిమాణాన్ని కూడా తగ్గిస్తుంది. యాపిల్, బొప్పాయి వంటి వాటిల్లో కూడా పీచు పదార్థాలు బాగా ఉన్నాయి. ఇవి శరీరంలో ఎసిడిటీ తలెత్తకుండా కాపాడుతాయి.



- వేసవిలో కొబ్బరి నీళ్లు తాగితే ఎంతో మంచిది. ఇది ప్రకృతి సిద్ధమైన డ్రింక్. ఇందులో క్లీనింగ్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల శరీరంలోని విష పదార్థాలు బయటకు పోతాయి. కొబ్బరి నీళ్లలో కూడా పీచుపదార్థాలు సమృద్ధిగా ఉన్నాయి. కొబ్బరి నీళ్లను రోజూ తాగడం వల్ల జీర్ణక్రియ బాగా జరుగుతుంది.
- చల్లటి పాలు తాగితే కూడా ఎసిడిటీ సమస్య పోతుంది. ఉదరంలోని యాసిడ్‌ని పాలు పీల్చేసుకుంటాయి. దీంతో కడుపులో మంట ఉండదు. కడుపులో ఎసిడిటీతో బాధపడుతున్నా, ఎసిడిటీ కారణంగా హార్ట్ బర్న్ తలెత్తినా పంచదార వేసుకోకుండా చల్లటి పాలు తాగాలి.
- అరటిపండు ఎసిడిటీ మీద బాగా పనిచేస్తుంది. అరటి పండులోని పొటాషియం స్టొమక్ అంచుల్లో మ్యూకస్‌ను ఉత్పత్తి చేసి శరీరంలోని పిహెచ్ ప్రమాణాన్ని తగ్గిస్తుంది. అరటిపళ్లలో పీచు పదార్థాలు కూడా బాగా ఉన్నాయి. అందుకే వేసవిలో మిగలపండిన అరటిపండు తింటే ఎసిడిటీ సమస్య తలెత్తదు.



గులాబీ పూలతో ఉపయోగాలెన్నో..

- గులాబీ రేకులను గ్లాసుడు టీలో నానబెట్టి వాటిని తేనెతో కలిపి తింటే శరీరంలోని వేడి తగ్గుతుంది.
- గులాబీ రేకుల కషాయాన్ని ఆవుపాలతో కలిపి పంచదార వేసుకుని తాగితే పైత్యం వల్ల వచ్చే వికారం, నోటి చేదు తగ్గుతాయి.
- గులాబీ రేకులను గ్లాసు నీటిలో వేసి మరిగించి ఆ నీటిని ఉదయం సగం, సాయంత్రం సగం పంచదారతో తాగితే మలబద్ధకం, మూలశంక తగ్గుతుంది.
- గులాబీ రేకుల పొడిని జాజికాయపొడిని నిమ్మకాయ రసంతో కలిపి తీసుకుంటే గుండెకు బలం చేకూరుతుంది.
- గులాబీని అప్పుడప్పుడూ తలలో పెట్టుకున్నా జేబులో వేసుకున్నా దాని పరిమళం తలనొప్పిని తగ్గించి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్నిస్తుంది.
- గులాబీ రేకులను తినడంవల్ల గుండె దడ, అతిమూత్ర వ్యాధి తగ్గుతుంది. విరేచనం సాఫీగా జరుగుతుంది.
- రాత్రి సమయంలో గులాబీ రేకులను నీళ్ళలో వేసి ఉదయం ఆ నీళ్ళతో కళ్ళు కడిగితే కళ్ళు మంటలు తగ్గిపోతాయి.
- గులాబీ పువ్వులు రాత్రి నీళ్ళలో వేసి ఉదయం ఆ నీటిని టీ డికాషన్ లేదా కాఫీ డికాషన్‌కి ఉపయోగించితే టీ, కాఫీ మంచి రుచి, వాసన వస్తాయి.



వీటిని తింటే చర్మం కాంతివంతంగా ఉంటుంది



చర్మం ఆరోగ్యవంతంగా, కాంతివంతంగా ఉండేందుకు ఈ పదార్థాలను తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

సాల్మన్ ఫిష్ : సాల్మన్ ఫిష్‌లో రిచ్ ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి మీ చర్మాన్ని సూర్య కిరణాల తాకిడి నుంచి కాపాడి.. స్కిన్‌ను కాంతివంతంగా చేస్తాయి.

పెరుగు : చర్మ సౌందర్యానికి పెరుగు సహజసిద్ధమైన ఔషధం. పెరుగును ఆహారంలో క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చుండ్రు తదితర చర్మ సమస్యలకు చెక్ పెట్టవచ్చు

టమోటా : టమోటాలను తీసుకోవడం ద్వారా మీ చర్మంపై ముడతలను పోగొట్టవచ్చు. పైగా స్కిన్ ప్రకాశవంతంగా తయారవుతుంది. చర్మాన్ని, కేశాలను సంరక్షించడంతో టమోటాలు కీలక పాత్ర పోషిస్తాయని న్యూట్రీషియన్లు అంటున్నారు. టమోటాలోని యాంటీ-యాక్సిడెంట్స్ చర్మ రక్షణకు ఎంతగానో తోడ్పడుతాయి.

గ్రీన్ టీ : గ్రీన్ టీలో యాంటీ యాక్సిడెంట్స్ మోతాదు అధికంగా ఉంటుంది. ఇది శరీర బరువును పెరగనీయకుండా చేయడంతో పాటు చర్మాన్ని ప్రకాశవంతంగా చేస్తుంది.

కివీస్ ఫ్రూట్ : కివీస్ ఫ్రూటలో సి విటమిన్ దాగి వుండటంతో మీ చర్మ రక్షణకు తోడ్పడుతుంది. ఇందులోని యాంటీ యాక్సిడెంట్లు చర్మానికి కాంతిని, నిగారింపునిస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

పచ్చి ఉల్లిపాయ ప్రతిరోజూ 50 గ్రాములు తింటే...



ప్రస్తుత కాలంలో చాలామంది షుగర్ వ్యాధితో అనేక రకాలైన ఇబ్బందులు పడుతున్నారు. మందులు వాడుతున్నా తీసుకునే ఆహారం సరియైనది కాకపోవడం వల్ల షుగర్ వ్యాధి పెరిగి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తోంది. మందులతో పాటు కొన్ని ఆహార నియమాలు పాటించడం వల్ల షుగర్ వ్యాధిని కంట్రోల్ చేసుకోవచ్చు. ఈ వ్యాధిని మనం ఇంట్లో రోజూ వాడే పచ్చి ఉల్లిపాయతోనే కంట్రోల్ చేసుకోవచ్చు. అదెలాగో ఇప్పుడు చూద్దాం.

- రోజుకి 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయను ఖచ్చితంగా తినాలి. 50 గ్రాములు ఒకేసారి తినలేకపోతే ఉదయం కొద్దిగా, మధ్యాహ్నం కొద్దిగా, సాయంత్రం కొద్దిగా తింటూ ఉండాలి.
- షుగర్ వ్యాధి ఎక్కువగా ఉన్నవారు ప్రతిరోజు కచ్చితంగా ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటారు. ఇన్సులిన్‌కి బదులు 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయను ప్రతిరోజు తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయ 20 యూనిట్ల ఇన్సులిన్‌తో సమానం.
- ఏడు రోజులు క్రమంతప్పకుండా ఈ పచ్చి ఉల్లిపాయను తినడం వల్ల బాగా ఎక్కువగా ఉన్న షుగర్ లెవల్ కంట్రోల్ అవుతుంది.
- పచ్చి ఉల్లిపాయతో పచ్చి పులుసు చేసుకుని అన్నంలో కలుపుకుని తిన్నా కూడా షుగర్ కంట్రోల్ అవుతుంది.

మార్చి 9న 'ఏ మంత్రం వేసావె'



గోలిసోడా ఫిల్మ్ పతాకంపై సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో అర్జున్‌రెడ్డితో యూత్‌ఫుల్ స్టార్‌గా మారిన విజయ్ దేవరకొండ హీరోగా, శివానీ సింగ్ నాయికగా శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఏ మంత్రం వేసావె. ఈ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కంప్యూటర్, సోషల్‌మీడియాకు బానిసలు కావడం వల్ల నేటి యువత ఒంటరివాళ్లుగా మిగిలిపోతున్నారు. సమాజంతో సంబంధాల్ని తెంచుకుంటున్నారు. ఈ ధోరణి చాలా ప్రమాదకరం. ఇదే అంశాన్ని సినిమాలో చూపించాం. కంప్యూటర్ గేమింగ్ సర్వస్వంగా బ్రతుకుతున్న ఓ యువకుడికి ఆన్‌లైన్‌లో ఓ అమ్మాయి పరిచయమవుతుంది. ఒక మాయా ప్రపంచంలో జీవిస్తున్న అతనికి మానవీయ విలువలు ఏమిటో పరిచయం చేస్తుంది. ప్రేమతో అతని జీవితాన్ని తీర్చిదిద్దుతుంది. ఈ క్రమంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలు ఏమిటన్నదే మా చిత్ర కథ. రొమాంటిక్ థ్రిల్లర్‌గా అందరిని ఆలోచింపచేస్తుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రమిదని సెన్సార్ వారు ప్రశంసించారు. ఇందులో విజయ్ దేవరకొండ పాత్ర చిత్రణ భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. అర్జున్‌రెడ్డి తరహాలోనే నవ్యతతో ఆకట్టుకుంటుంది' అన్నారు. 'పెళ్లిచూపులు అర్జున్‌రెడ్డి చిత్రాలతో విజయ్ దేవరకొండ ప్రేక్షకుల్లో తిరుగులేని ఇమేజ్‌ను సొంతం చేసుకున్నాడు.

ఏ మంత్రం వేసావె అందరి అంచనాల్ని అందుకునేలా ఉంటుంది. చిత్ర ట్రైలర్‌ను యూట్యూబ్‌లో 20 లక్షల మందికిపైగా వీక్షించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు వెయ్యి థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేయబో తున్నాం' అని సమర్పకుడు మల్కాపురం శివకుమార్ చెప్పారు. థియేటర్ల బంద్ గురించి ఆయన మాట్లాడుతూ 'సర్వీస్ పేరుతో పరిశ్రమలోకి వచ్చిన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ నేడు దోపిడి దొంగలుగా మారారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తు న్నాను' అన్నారు. కోమ్యా విరాక్, నీలాక్షిసింగ్, శ్రీరామ్ వెంకటేష్, ఆశిష్‌రాజ్, ప్రభావతి తదిత రులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : శివారెడ్డి, మాటలు : అంజలి పార్వతి, శ్రీధర్ మర్రి, శ్రీకాంత్ నాయుడు, అరుణ్ వేమూరి, సంగీతం : అబ్దుస్ సమద్, ఆర్ట్ : భూపేష్, కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం : శ్రీధర్ మర్రి.

విశాలాంధ్ర సినిమా

సంచలనం సృష్టిస్తున్న 'కాలా' టీజర్



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా ధనుష్ సమర్పణలో లైకా ప్రొడక్షన్స్, వండర్‌బార్ ఫిలింస్ ప్రై. లిమిటెడ్ పతాకాలపై పా.రంజిత్ దర్శకత్వంలో ధనుష్ నిర్మిస్తున్న చిత్రం 'కాలా'. ఏప్రిల్ 27న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేశారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ కొత్త లుక్ ఈ సినిమాకి హైలైట్‌గా నిలవనుంది. 'నలుపు శ్రమ జీవుల వర్ణం.. మా వాడకొచ్చి చూడు మురికంతా ఇంద్రధనుస్సులా కనిపిస్తుంది'

'క్యారే సెట్టింగా.. వీరయ్య బిడ్డన్రా.. ఒక్కడ్నే ఉన్నా.. దిల్లుంటే గుంపుగా రండ్రా..'

'ఈ కరికాలుడి పూర్తి రౌడీయిజాన్ని ఎప్పుడూ చూళ్ళేదు కదూ.. ఇప్పుడు చూపిస్తా..' అంటూ రజనీకాంత్ తనదైన స్టైల్‌లో చెప్పిన డైలాగ్స్ థియేటర్స్‌లో క్లాప్స్ కొట్టిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. రజనీకాంత్, పా.రంజిత్ కాంబినేషన్‌లో వచ్చిన 'కబాలి' రిలీజ్‌కి ముందు, రిలీజ్ తర్వాత ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. 'కాలా' టీజర్ రిలీజ్‌తో మరోసారి వీరిద్దరి సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

సూపర్‌స్టార్ రజనీకాంత్ కెరీర్‌లో 'కాలా' మరో సెన్సేషనల్ మూవీగా నిలవబోతోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్, నానా పాటేకర్, సముద్రఖని, ప్రకాశ్‌రాజ్, ఈశ్వరీరావు, హ్యూమా ఖురేషి, అంజలి పాటిల్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ : మురళి జి., ఎడిటింగ్ : శ్రీకర్‌ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎస్.వినోద్‌కుమార్, నిర్మాత : ధనుష్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పా. రంజిత్.

రాజమౌళి సినిమాలో చరణ్ జోడీగా సమంత!



రాజమౌళి ఎన్టీఆర్ చరణ్‌తో మల్టి స్టారర్ సినిమా చెయ్యబోతున్న సంగతి తెలిసేందే. డివివి దానయ్య ఈ సినిమాను నిర్మించబోతున్నాడు. ఇద్దరు హీరోలు ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రల్లో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ మూవీలో చరణ్ సరసన సమంత నటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ఈగ సినిమాలో సమంత నటించింది. అలాగే చరణ్ సమంత రంగస్థలం సినిమాలో నటించారు. రాజమౌళి స్టైల్ లో తెరకెక్కబోయే ఈ సినిమాలో గ్రాఫిక్స్ ఉండవని సమాచారం. ఫ్యామిలి ఎమోషన్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాది అక్టోబర్ నుండి ప్రారంభం కానుంది. కీరవాణి సంగీతం అందించబోతున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రాజమౌళి, చరణ్, ఎన్టీఆర్‌తో ఉన్న ఫోటో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దగ్గరినుండి ఈ సినిమాపై రోజుకో వార్తా బయటికి వస్తోంది.



నేత్రదానం చేసిన అమలాపాల్

సమీపకాలంలో వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్న 'మైనా' సుందరి అమలాపాల్ ఒక మంచి పనితో అందరి ప్రశంసలూ పొందుతోంది. ఆమె తన కళ్లను దానం చేస్తున్నట్టు ప్రకటించింది. ఇటీవలే పుదుచ్చేరిలో జరిగిన ఒక కార్యక్రమంలో కళ్లను దానం చేస్తున్నట్టు సంతకం కూడా చేసింది. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలోనే కళ్లు లేని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. అందుకు కారణం, కళ్ల దానంపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమే. ఇకపై అయినా ప్రజలు చైతన్యవంతులై నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని కోరుతున్నా' అని పేర్కొంది.

వెంకటేష్ జతగా మరో హీరోయిన్

తేజ దర్శకత్వం వెంకటేష్ నటిస్తున్న సినిమా ఈ నెలలోనే సెట్స్ పైకి వెళ్ళబోతుంది. ఇటీవలే ఈ సినిమాకు హీరోయిన్‌గా శ్రియని తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా ఈషా రెబ్బ ని ఖరారు చేసారట మేకర్స్. లేటెస్ట్ గా 'అ!' లో నటించిన ఈ అమ్మడు తరువాత చేయబోయే సినిమా ఇదే అని సమాచారం. మరి ఈ సినిమాలో ఈషాను తేజ ఎలాంటి క్యారెక్టర్ లో చూపిస్తాడో.. చూడాలి.

'ఎంఎల్ఎ'లో మొదటి పాట విడుదల

కల్యాణ్ రామ్ హీరోగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో విశ్వప్రసాద్, భరత్ చౌదరి నిర్మాతలుగా తెరకెక్కుతున్న సినిమా ఎంఎల్ఎ. మణిశర్మ సంగీతం అందిస్తోన్న ఈ సినిమా మొదటి పాట మోస్ట్ వాంటెడ్ అబ్బాయి సోమవారం సాయంత్రం 5 గంటలకు విడుదల చెయ్యనున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కానుంది.

నాగ అశ్విన్ హీరోగా 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'



షో టైం స్టూడియో సమర్పించు గణేష్ క్రియేషన్స్ సంస్థ నుంచి నాలుగో ప్రొడక్షన్‌గా తెరకెక్కనున్న సినిమా 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. నాగ అన్వేష్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా ఇటీవలే ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత లండన్ గణేష్ మాట్లాడుతూ- 'మా బ్యానర్‌లో ఇదివరకు మొదటి ప్రొడక్షన్ ఓపెనింగ్ స్వర్గీయ రామానాయుడి గారి చేతుల మీదుగా జరిగింది. ఇప్పుడు నాలుగవ ప్రొడక్షన్ జరుపుకుం టోంది. నేను లండన్‌లో ఉండటం మూలాన లండన్ అనేది ఇంటిపేరుగా మారిపోయింది. ఇక సినిమా విషయానికి వస్తే 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' డిఫరెంట్ కాన్సెప్ట్‌తో యంగ్ అండ్ డైనమిక్ హీరో నాగ అశ్విన్ హీరోగా, నా స్నేహితుడు నాగేశ్వరరావు సహకారంతో నిర్మిం చడం జరుగుతోంది. తప్పకుండా ప్రేక్షకాదరణ పొందే చిత్రం అవుతుందని భావిస్తున్నా' అన్నారు. మరో నిర్మాత వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 'మంచి కథ అవడంతోనే నేను భాగస్వామిని అయ్యాను. ఫారిన్, సిటీ, ఫారెస్ట్ ఇలా 3 షెడ్యూల్‌లో షూటింగ్ ఉంటుంది. కొత్త కథ కనుక ఆడియన్స్‌కు నచ్చి తీరుతుందని ఆశిస్తున్నా' అన్నారు. హీరో నాగ అశ్విన్ మాట్లాడుతూ..'చాలా ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్.. టైటిల్ కు తగ్గట్టుగానే ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో అనే విధంగానే ఉంటుంది ప్రతి సన్నివేశం. టాలీవుడ్‌లోనే డిఫరెంట్ సబ్జెక్టుగా నిలుస్తుందని, అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు శ్రీ కృష్ణ గొర్లె మాట్లాడుతూ.. 'సైన్స్ ఫిక్షన్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కనుంది. మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తి చేస్తాము. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మా సినిమా ప్రారంభోత్సవానికి విచ్చేసి తమ అమూల్యమైన ఆశీర్వచనాలు అందించిన వి వి వినాయక్, సాగర్, రమణ గారికి నా కృతజ్ఞతలు" అన్నారు.

అల్లరి నరేష్ చేతిలో మరో రెండు సినిమాలు



అల్లరి నరేష్ హీరోగా భీమినేని శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తోన్న సినిమా తాజా షెడ్యూల్ హైదారాబాద్‌లో ప్రారంభం అయ్యింది. వరంగల్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ కొంతవరకు జరిగింది. చిత్ర శుక్ల ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. సునీల్, అల్లరి నరేష్ ఫ్రెండ్స్‌గా కనిపించబోతున్నారు. తెలుగులో ఉన్న దాదాపు హాస్య నటినటులు ఈ సినిమాలో నటిస్తుండడం విశేషం. వసంత్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. మేడమీద అబ్బాయి సినిమా తరువాత కొంత గ్యాప్ తీసుకొని మంచి కాన్సెప్ట్‌తో రాబోతున్నాడు నరేష్. ఈ సినిమా తరువాత ఏకే బ్యానర్‌లో గిరి దర్శకత్వంలో ఒక సినిమా చెయ్యబోతున్నాడు నరేష్. గిరి గతంలో నందిని నర్సింగ్ హోం సినిమాను డైరెక్ట్ చేసాడు. ఈ ప్రాజెక్ట్ తో పాటు డైరెక్టర్ సత్తిబాబుతో ఒక సినిమా చెయ్యనున్నాడు ఈ హీరో.




బైకుల్లా జైలులో ఇంద్రాణితో పాటు కార్తీ విచారణ

ముంబై : ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అరెస్టు అయిన కార్తీ చిదంబరాన్ని ఆదివారం బైకుల్లా జైలుకు తరలించి విచారించారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఇంద్రాణీ ముఖర్జియాతో పాటు ఆయనను ప్రశ్నించినట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఐఎన్‌ఎక్స్ మీడియా ప్రై లి. మాజీ డైరెక్టర్ ముఖర్జియా ఇప్పటికే షీనా బోరా హత్యకేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. కాగా, సీబీఐకి చెందిన ఆరుగురు సభ్యుల బృందం కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం తనయుడైన కార్తీని ఆదివారం ఉదయం సెంట్రల్ ముంబైలోని బైకుల్లా జైలుకు తరలించినట్టు అధికారి తెలిపారు. ఆయనను ఇంద్రాణిని ఎదురుబదురుగా ఉంచి విచారించినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో జైలు ద్వారాలను మూసివేసి, బయట వ్యక్తులు ఎవ్వరు కూడా జైలు ఆవరణలోకి ప్రవేశించేందుకు వీలులేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇంద్రాణి ముఖర్జియాతో పాటుగా విచారణ ముగిసిన అనంతరం కార్తీని, పీటర్ ముఖర్జియాని ముఖాముఖిగా ప్రశ్నించినట్టు తెలిసింది.

ఫిబ్రవరి 28న ముఖర్జియా ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా సీబీఐ కార్తీని అదుపులోకి తీసుకుంది. ఈనెల 1న ఆయనను ఐద్రోజుల సీబీఐ కస్టడీకి పంపినట్టు అధికారి వెల్లడించారు. బ్రిటన్ నుంచి దేశానికి తిరిగొచ్చిన కార్తీని చెన్నై ఎయిర్‌పోర్టులోనే పోలీసులు అరెస్టు చేయడం విదితమే.

ఓడినా... వీరోచితంగానే



అగర్తలా: త్రిపుర శాసన సభకు జరిగిన ఎన్నికలలో సీపీఐ(ఎం) నాయకత్వంలోగల వామపక్ష కూటమి ఓటమిని చవిచూసింది. గత 25 సంవత్స రాలుగా అత్యంత నిజాయితీపరుడైన మాణిక్ సర్కార్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాడిన ప్రభుత్వం ఓటమి పాలైంది. అక్కడ

- త్రిపురలో వామపక్షాలకు తగ్గిన ఓట్లు 3.3 శాతమే
- బీజేపీకి 43 లెఫ్ట్‌కు 42.7 శాతం
- తేడా 0.3 శాతమే

గెలిచిన బీజేపీకి, ఓడిన వాపక్ష కూటమికి లభించిన ఓట్ల తేడా 0.3 శాతమంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ ఎన్నికలలో బీజేపీకి 43, లెఫ్ట్‌కు 42.7 శాతం ఓట్లు దక్కాయి. ఇంతకూ వామ పక్షాలకు తగ్గిన ఓట్లు 3.3 శాతం మాత్రమే కావడం గమనార్హం

త్రిపురలో 2013వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వామ పక్ష కూటమి 55స్థానాలలో పోటీచేసి 49స్థానాలు గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో లెఫ్ట్‌కు వచ్చిన ఓట్లు 48శాతం. ఈసారి ఆ ఓట్లు 44.7శాతానికి తగ్గాయి. అప్పట్లో ప్రతిపక్షంగావున్న కాంగ్రెసు పార్టీ 50 స్థానాలు పోటీచేసి 10 స్థానాలు గెలిచింది. ఈ పార్టీకి వచ్చిన ఓట్లు 36.7శాతం. అయితే ఆశ్చర్యకరంగా ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 1.9శాతం! సీట్లు ఒక్కటీ గెలవ లేదు. అదే సమయంలో గత ఎన్నికల్లో కేవలం 1.6శాతం ఓట్లతో ఒక్క సీటు కూడా గెలవని భారతీయ జనతా పార్టీ ఈసారి జరిగిన ఎన్నికల్లో 43శాతం ఓట్లు వచ్చాయి. ఈ పార్టీ గెలిచిన సీట్లు 43. అంటే కాంగ్రెసు పార్టీ ఓట్లు బీజేపీకి పడ్డాయి. భారతీయ జనతా పార్టీ గంప గుత్తగా కాంగ్రెసు పార్టీ ఓట్లను కొనేసింది. ఈ దుర్మార్గాన్ని అడ్డుకునే శక్తి కాంగ్రెసు పార్టీకి లేకపోయింది.

అలా కాంగ్రెసు పార్టీని గంప గుత్తగా కొనటంతోనే భారతీయ జనతా పార్టీ సంతృప్తి చెందలేదు. ప్రత్యేక త్రిపురాలాండ్‌ను డిమాండ్ చేస్తున్న పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర అనే టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడుతున్న సంస్థతో భారతీయ జనతా పార్టీ ప్రత్యేక సంబంధం ఏర్పరచుకున్నది. గత ఏడాది ప్రత్యేక త్రిపురాలాండ్ కోసం పీపుల్స్ ఫ్రంట్ భారతీయ జనతా పార్టీ



వెన్నుదన్నుతో జాతీయ రహదారులను దిగ్బంధం చేసిన విషయం దేశమంతా గమనించింది. పశ్చిమ బెంగాల్‌లో మతఘర్షణలు రెచ్చగొట్టటం, డార్జిలింగ్ గూర్ఖాలాండ్ సమస్యను తిరగదోడటం వంటి చర్యలు తూర్పు, ఈశాన్య భారతదేశ ప్రాంతాలలో బీజేపీ అనుసరిస్తు వ్యూహంలో త్రిపురలో ఏర్పరచుకున్న అనుబంధం కూడా ఒక భాగం అని గమనించాలి. దాదాపు 8శాతం ఓట్ల శాతంవున్న ఈ టెర్రరిస్టు సంస్థతో బీజేపీ ఎన్నికల పొత్తు పెట్టుకుంది. అంతంతమాత్రంగా కునారిల్లుతున్న ప్రజాస్వామ్యం రాబోయే రోజుల్లో మరింతగా పతనం కావటం అనివార్యమనే సందేశాన్ని త్రిపుర ఫలితాలు మనకు ఇస్తున్నాయి. అలాగే గెలుపు కోసం, తన రాజకీయ ఆధిపత్యం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందనే వాస్తవాన్ని త్రిపురలో జరిగిన ఎన్నికలు మన కండ్లకు కడుతున్నాయి. విషయం ఇంత స్పష్టంగా కనపడుతున్నా ప్రధాన స్రవంతి మీడియా ఏమీ ఎరుగనట్టు ప్రజల దృష్టిని మరల్చే విశ్లేషణలు చేస్తోంది.

బీజేపీ అనైతిక గెలుపు


ఈశాన్య ఫలితాలపై డి.రాజా వ్యాఖ్య



న్యూఢిల్లీ : ప్రజాతీర్పును తారుమారు చేయ డానికి డబ్బు సహా అన్ని అధికారాలను బీజేపీ ప్రయోగించిందని సీపీఐ నిశితంగా విమర్శించింది. గెలుపే లక్ష్యంగా అనైతిక చర్యలకు పాల్పడిందని దునుమాడింది. ఈశాన్య ఎన్నికల ఫలితాలు దీనినే రుజువు చేస్తున్నాయని స్పష్టం చేసింది. రాజకీయాలను బీజేపీ భ్రష్టు పట్టిస్తోందని అభిప్రాయ పడింది. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా స్పందించారు. త్రిపురలో వేర్పాటువాద సంస్థ ఇండిజీనియన్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) వంటి సంస్థలతో బీజేపీ పొత్తు పచ్చి అవకాశవాదానికి పరాకాష్ట అని డి.రాజా విమర్శించారు. బీజేపీ కపటనాటకం దీంతో బహిర్గతమైందన్నారు.

త్రిపురలో 25 ఏళ్ల పాలనలో లెఫ్ట్‌ఫ్రంటు రాష్ట్రంలోని అన్ని వర్గాలలో మత సామరస్యం సాధించిందని రాజా చెప్పారు. సుపరిపాలన అందించిందని, ఆ ప్రభుత్వంపై ఆరోపణలే లేవని ఆయన తెలిపారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు ధోరణులను తిప్పికొట్టడానికి లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు ఐక్యం కావాలన్న డిమాండు పెరుగుతోందని, ఇప్పుడు ఆ అవసరం మరింత బలపడిందని రాజా చెప్పారు. తీవ్రమైన అజెండాతో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు సాగుతున్నాయన్నారు. వామపక్ష పార్టీలు మరింత లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని, కాంగ్రెసు కూడా దీనిపై ఆలోచించాలని రాజా అభిప్రాయపడ్డారు. తన నయాఉదారవాద ఆర్థిక కార్యక్రమం గురించి పునరాలోచించుకోవాలని హితవు పలికారు.

త్రిపుర ఓటమిపై నిశిత పరిశీలన అవసరం



ఇప్పుడు లెఫ్ట్‌ఫ్రంట్ శక్తీ తగ్గింది
లౌకికశక్తులతో కలిసి నడవడం అనివార్యం
ఏచూరి వాదానికి అచ్యుతానందన్ మద్దతు

తిరువనంతపురం : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్‌ఫ్రంట్ కూటమి ఓటమిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని కేరళలో పాలక సీపీఎం అభిప్రాయపడింది. సంఘ్‌పరివార్‌పై పోరాటానికి లౌకికశక్తులతో చేతులు కలపాలని పార్టీ అధినాయకత్వానికి కేరళ మాజీ సీఎం, సీనియర్ నేత వీఎస్ అచ్యుతానందన్ విజ్ఞప్తి చేశారు. 'దేశం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నది. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ బలహీనపడింది' అని 94 ఏళ్ల మార్క్సిస్టు నేత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, త్రిపురను పాలించిన వామపక్షాలు సైతం బలహీన పడ్డాయని అచ్యుతానందన్ తెలిపారు. బీజేపీపై పోరాటానికి కాంగ్రెస్‌తో అవగాహన అవసరమన్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అచ్యుతానందన్ మద్దతిచ్చారు. సంఘ్‌పరివార్ శక్తులపై పోరాటానికి, వాటిని ఓడించేందుకు వామపక్షాలకు ఇప్పుడు సొంత బలం కూడా లేదని, అందుకే లౌకికశక్తులతో వ్యూహాత్మకంగా ముందుకు కదలాల్సిన అవసరం ఉందని సీనియర్ నేత అభిప్రాయపడ్డారు.

త్రిపురలో విజయం కోసం కాషాయపార్టీ ధనబలం, కండబలం ప్రయోగించిందని సీపీఎం సీనియర్ నేత, మంత్రి ఏకే బాలన్ విమర్శించారు. విజయమే లక్ష్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని మండిపడ్డారు. బీజేపీ విజయం ప్రజాస్వామ్యానికి, జాతీయ సమగ్రతకు సవాల్ వంటిదని వ్యాఖ్యానించారు. త్రిపురలో బీజేపీ గెలుపు ప్రజాతీర్పు కానే కాదని అన్నారు. విజయమే పరమావధిగా భావించి అతిచిన్న రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ చీఫ్ అమిత్‌షా, కేంద్రమంత్రులు రోజుల తరబడి తిష్టవేశారని బాలన్ ఆరోపించారు. వేర్పాటువాదులతో చేతులు కలపడానికీ కాషాయపార్టీ వెనుకాడలేదని అన్నారు. ధనబలంతోనే త్రిపురలో బీజేపీ విజయం సాధించిందని మరో సీనియర్ నేత ఎంవీ జయరాజన్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ఉగ్రవాద గ్రూపులతో అపవిత్ర పొత్తుకు వెనుకాడలేదని నిందించారు. పార్టీ ఓటమిని ఊహించలేదని పొలిట్‌బ్యూరో సభ్యురాలు ఎంఏ బేబీ వ్యాఖ్యానిస్తూ, ప్రజాతీర్పును గౌరవిస్తామన్నారు. 6-7శాతం లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్లు తగ్గడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. దీనిపై త్రిపుర పార్టీ, కేంద్ర కమిటీ పరిశీలన చేయాల్సి ఉందని అన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షం ఓట్లు బీజేపీకి బదిలీ అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోవడం బీజేపీ విజయానికి దోహదపడిందని బేబీ అభిప్రాయపడ్డారు.

జయలలిత సమాధి వద్ద కానిస్టేబుల్ ఆత్మహత్య



చెన్నై : దివంగత తమిళనాడు మాజీ ముఖ్య మంత్రి జయలలిత సమాధి వద్ద పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. మధురైకి చెందిన అరుల్ రాజ్ అనే వ్యక్తి మెరీనా తీరం వద్ద ఉన్న జయలలిత సమాధి వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీకి వెళ్లిన అరుల్ సమాధి వద్దకు చేరుకోగానే తన రైఫిల్‌తో కాల్చేసుకున్నాడు. తెల్లవారుజామున 4.55 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అది గమనించిన సహోద్యోగులు వెంటనే అరుల్‌ని దగ్గరలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. అయితే అరుల్ ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడన్నది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలియగానే గ్రేటర్ చెన్నై నగర కమిషనర్ ఎ.కె.విశ్వనాథన్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.

దేశ భవిష్యత్ నిర్దేశకులు యువతే

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ



తుమకూరు(కర్ణాటక) : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యువతరాన్ని ప్రశంసించారు. యువత ఒక అపార శక్తి అని, దేశ భవిష్యత్‌ను నిర్దేశకులను ఆయన నొక్కి చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుమకూరులో ఒక యువత సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తూ, యువతతో ఏదైనా సంభాషించే సమయంలో ఎప్పుడూ ఏదో ఒకటి తెలుసుకోవడానికి ఉంటుం దన్నారు. 'యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసేందుకు వారిని కలుసుకోవడానికి నేను ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాను. వారితో మాట్లా డతాను, యువత అనుభవాలను వింటాను' అని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం జాతి పునర్నిర్మాణానికి సంబం ధించి యువ శక్తిని వినియోగించుకోవడానికి అనేక నిర్ణయాలు తీసుకుందన్నారు. 'యువత సొంతంగా వ్యాపారం ప్రారంభించ వచ్చు. వారికి బ్యాంకు హామీ రుణం లభిస్తుంది. ఇందుకోసం ప్రధాన మంత్రికి సంబంధించిన నగదు పథకాన్ని ప్రభుత్వం నడుపుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.11 కోట్ల రుణాలను ఈ పథకం క్రింద మంజూరు చేయడం జరిగింది. కర్ణాటక యువత కోసం రూ.14.1 మిలియన్లకుపైగా రుణం మంజూరు చేశాం' అని మోడీ తెలిపారు. స్వయం ఉపాధి, నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహించడంలో భాగంగా యువత తయారు చేసిన ఉత్పత్తుల కోసం ఒక మార్కెట్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర కృషి చేస్తోందన్నారు. కర్ణాటక ప్రజలను ప్రశంసిస్తూ, సాంకేతిక పరిజ్ఞానం, ఆధ్యాత్మిక మధ్య ఒక సమతుల్యతను ఇక్కడి ప్రజలు పాటిస్తారని తెలిపారు. కాగా ఈశాన్య రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఓటు వేయడం ద్వారా ద్వేషపూరిత రాజకీయాలను తిరస్కరించారని ప్రధాని మోడీ అన్నారు. ఇంతకుముందు విపక్ష పూరిత విధానాలు, నిర్ణయాల వల్ల ఈశాన్య ప్రజలు దేశ ప్రధాన స్రవంతి నుంచి తమను తొలగించారని భావించారు. కానీ తమ ప్రభుత్వం ఆ భావనను తుడిచిపెట్టడానికి కృషి చేస్తోందని తెలిపారు.

బీజేపీని ఎదుర్కొనేందుకు

వ్యవసాయం, ఉపాధిపై కాంగ్రెస్ దృష్టి

16 నుంచి జరగనున్న ప్లీనరీలో ప్రత్యేక తీర్మానం

న్యూఢిల్లీ : 2019 సార్వత్రిక ఎన్నికలు, కొన్ని రాష్ట్రాలు ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో అధికార బీజేపీని సవాల్ చేసేందుకు పేదరికం, విద్య, వ్యవసాయ సంబంధిత అంశాలపై దృష్టిసారించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. దేశ రాజధానిలో మార్చి 16-18 తేదీల మధ్య ప్లీనరీ సమా వేశాల కోసం పేదరిక నిర్మూలన, వ్యవసాయం, విద్య సంబంధిత అంశాలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించనున్నది. 2010లో చివరి ప్లీనరీ సెషన్స్ సమయంలో ఆర్థిక తీర్మానంలో భాగంగా వ్యవసాయం, ఉపాధి అంశాలు ఉన్నాయి. హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా అధ్యక్షతన పేదరిక నిర్మూలన, ఉపాధి, వ్యవసాయంపై తొమ్మిది మంది సభ్యులతో ఒక సబ్ గ్రూప్‌ను కూడా కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. ఈ సబ్ గ్రూప్‌కు పార్టీ నాయకుడు మీనాక్షి నటరాజన్ కన్వీనర్‌గా ఉన్నారు. 'ప్రస్తుతం దేశంలో రైతులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రమైనందున, ఆ అంశంపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంది' అని సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. అయితే ఉపాధి, వ్యవసాయ సంబంధిత అంశాలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించడం ఇదే తొలిసారి కాదని, 2001లో కూడా ఇదే విధమైన తీర్మానాన్ని ఆమోదించినట్లు ఆ నాయకుడు వివరించారు.



'మేము అధికారంలో (2014 వరకు) ఉన్న సమయంలో ఈ సమస్యలు మరింత ప్రబలకుండా చర్యలు తీసుకున్నాం. మా పార్టీ చివరి ప్లీనరీ సమావేశాల నాటికి పరిస్థితి బాగానే ఉంది' అని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకుడు మరొక మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఉపాధి, పేదరిక నిర్మూలన అంశాలు తీవ్రమయ్యాయని తెలిపారు. 'పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వంటి ప్రభుత్వ దుందుడుకు చర్యల కారణంగా ఆర్థిక వ్యవస్థ పతనమైంది. మేము ఈ విషయాలను ప్రజలకు వద్దకు తీసుకువెళతాం' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఉపాధితో సహా ఆందోళన కలిగించే అంశాలను తొలి ఓటర్లు, యువత వద్దకు తీసుకు వెళ్లడం ప్రారంభించిందని ఆయన తెలిపారు.

త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ రాజీనామా

అగర్తలా (త్రిపుర) : నాలుగు సార్లు త్రిపుర ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన మాణిక్ సర్కార్ తన రాజీనామాను గవర్నర్ తథాగతరావుకు పంపారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగేవరకు ఆపదర్మ ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగుతారు. శనివారం జరిగిన ఎన్నికల లెక్కింపుతో కమ్యూనిస్టు పార్టీ ఓటమిపాలై, బీజేపీ అధికారం చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అధికార కమ్యూనిస్టు పార్టీ 16 సీట్లు చేజిక్కించుకోగా, బీజేపీ 35 సీట్లు, దాని మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ 8 సీట్లు గెలిచింది.

నేటి నుంచి 10,12 తరగతుల పరీక్షలు

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) 10,12 తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మొత్తం 28 లక్షల మంది ఈ పరీక్షలకు హాజరవుతారు. .16,38,428 మంది 10వ తరగతి, 11,86,306 మంది విద్యార్థులు 12 తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇదివరకటి కాంప్రహెన్సివ్, కంటిన్యూయస్ ఇవాల్యుయేషన్ (సీసీఈ) పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించనున్నారు. దేశంలోని 4,453 కేంద్రాల్లో ఇతరదేశాల్లోని మరో 78 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఉప ఎన్నికల్లో తృటిలో చేజారిన విజయం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని రెండు అసెంబ్లీ నియోజక వర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ కి తృటిలో విజయం చేజారిందని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. కోలారస్, ముంగోలిలో ఫిబ్రవరి 24 జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అయితే అతికొద్ది ఓట్ల తేడాతో కాంగ్రెస్ రెండు సీట్లూ దక్కించుకుందన్నారు. చాలావరకు బీజేపీ పోరాడినా ప్రయత్నంలో లోపం జరిగిందని విలేకరులకు వెల్లడించారు. కొలరాస్‌లో 2013లో కాంగ్రెస్ 25 వేల ఓట్ల మెజార్టీ సాధించగా ప్రస్తుతం 8 వేలకు చేరుకుందని, మంగోలిలో ఇదివరలో 22 వేలు సాధించగా, ప్రస్తుతం 2,100 ఓట్లతో విజయం సాధించారన్నారు.

పారికర్ ఆరోగ్యం మెరుగవుతోంది : బీజేపీ

పనాజీ : ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ఆరోగ్యం మెరుగవుతోందని, మార్చి 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారని గోవా బీజేపీ అధ్యక్షుడు వినయ్ టెండుల్కర్ వెల్లడించారు. రాష్ట్ర పరిపాలనా విభాగం పతనం చెందిందని కాంగ్రెస్ విమర్శించడం సరికాదన్నారు. ఫిబ్రవరి 15 నుంచి ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో పారికర్ కాలేయ చికిత్స పొందుతున్నారు. ఫిబ్రవరి 22న ఆయన డిశ్చార్జి అయిన వెంటనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. నాలుగురోజుల సమావేశాల అనంతరం ఆయన మళ్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బీజేపీ, ఎన్‌డీపీపీ కూటమికి మరో సీటు

కోహిమా : నాగాలాండ్‌లో బీజేపీ, ఎన్‌డీపీపీ కూటమి జాబితాలోకి మరో సీటు వచ్చి చేరింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పొరపాటు వల్ల తారుమారైన టేబుల్‌ను ఈసీ సరిచేసింది. ఎన్‌డీపీపీకి మరో సీటు అదనంగా వచ్చి కలిసింది. దీంతో బీజేపీ, ఎన్‌డీపీపీ కూటమి సంఖ్య 32కి చేరింది. 60 మంది సభ్యులు గల అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటునకు అవసరమైన సాధారణ మెజారిటీ 31. రిటర్నింగ్ అధికారి చేసిన పొరపాటును సరిచేస్తూ ఎన్నికల కమిషన్ కార్యదర్శి అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తెల్లింగ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌పీఎఫ్ అభ్యర్థి ఎన్‌ఆర్ జెలియాంగ్ విజయం సాధించినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఆ తర్వాత పొరపాటును గుర్తించిన ఈసీ ఎన్‌డీపీపీ అభ్యర్థి సత్రీ ఎన్‌చాంగ్ గెలిచినట్టు తెలిపింది.

గల్ఫ్ పిల్లి కోచిలో పట్టివేత

కోచి : గల్ఫ్ నుంచి వచ్చిన పెంపుడు పిల్లిని కోచిలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుకున్నారు. ఇలా పెంపుడు జంతువులను తీసుకెళ్ల కూడదని కస్టమ్స్ అధికారి ఒకరు తెలిపారు. మార్చి 2న జెద్దానుంచి ప్రయాణిస్తున్న భారతీయ జంట వారి వెంట ఈ పిల్లిని తీసుకు వచ్చారు. పెంపుడు జంతువులను దిగుమతి చేసుకుంటానికి ఇది మార్గం కాదని కస్టమ్స్ కమిషనర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. పిల్లిని తెచ్చేందుకు పత్రాలు లేనందున మళ్లీ ఈ పిల్లిని జెద్దాకు పంపాలని అధికారులు సౌదీ ఎయిర్‌లైన్స్‌ను కోరారు.

ఉప ఎన్నికల్లో ఎస్పీకి బీఎస్పీ సహకారం

లక్నో : ఫుల్‌పూర్, గోరఖ్‌పూర్ ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి బహుజన సమాజ్ వదీపార్టీ (బీఎస్పీ) సహకారం అందిస్తుందని బీఎస్పీ ఇన్‌చార్జి ఘనశ్యాం చంద్ర కర్వార్ తెలిపారు. గోరఖ్‌పూర్‌లో ఎస్పీ అభ్యర్థిగా ప్రవీణ్ కుమార్ నిశీద్, ఫుల్‌పుర్ అభ్యర్థి నాగేంద్రసింగ్ పటేల్‌లకు తమ మద్దతు ఉంటుందన్నారు. మా కార్యకర్తలు బీజేపీని తరిమికొట్టాలనుకుంటున్నారని అందువల్ల ఎస్పీకి మద్దతు ఇవ్వాలని నిశ్చయించుకున్నామని కర్వార్ తెలిపారు.

శ్రీశ్రీని కలవడంలో రాజకీయం లేదు : యోగి



లక్నో : ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవిశంకర్‌ను కలవడంలో రాజకీయ కోణం లేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. వీరిద్దరూ అయోధ్య వివాదంపై మధ్యవర్తిత్వం నెరపుతున్న విషయం తెలిసిందే. రవిశంకర్ లక్నో రావడంతో మర్యాదపూర్వకంగా కలుస్తున్నానని విలేకరు లకు తెలిపారు. గతేడాది 500 మంది అయోధ్య, బెంగళూరు, లక్నో, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలోని నాయకులతో రవిశంకర్ మంతనాలు జరిపారు. ఏఐఎంపీఎల్‌బీ బహిష్కృత సభ్యుడు సల్మాన్ నద్వీని గతవారం కలిశారు. నద్వీ మసీదును తరలించడానికి అంగీకరించిన విషయం తెలిసిందే.

విజయోత్సవంలో బీజేపీ నాయకుడు మృతి

ముజఫర్‌నగర్ : ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మెరుగైన ఫలితాలు సాధించినందుకు విజయోత్సవానికి సన్నాహాలు చేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో బీజేపీ జిల్లా నాయకుడు ఒకరు గుండె పోటుతో మరణించాడు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుదాన్ సింగ్(54) గత సాయంత్రం పార్టీ కార్యాలయంలో మరణించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రూపేంద్ర సైనీ తెలిపారు. బుదాన్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లుగా వైద్యులు ధ్రువీకరించారని సైనీ వివరించారు.

పూంఛ్‌లో సైనిక పోస్టులు, గ్రామాలపై పాక్ కాల్పులు

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌కు చెందిన పూంఛ్‌లో నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి గ్రామాలు, సైనిక పోస్టులపై శనివారం రాత్రి పాకిస్తాన్ కాల్పులకు తెగబడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. బాలకోటే సెక్టార్‌లోని సరిహద్దు నుంచి గత రాత్రి కాల్పులు ప్రారంభమయ్యాయని, రెండు గంటలకుపైగా కొనసాగినట్లు వివరించారు. అయితే భారత సైనిక దళాలు ఈ దాడులను తిప్పికొట్టాయన్నారు. ఈ సందర్భంగా ఎవరైనా గాయపడిందీ లేదా నష్టానికి సంబంధించి సమాచారమేదీ లేదన్నారు. కాల్పుల విరమణ సమయంలో సైనిక పోస్టులు, సరిహద్దు గ్రామాలు లక్ష్యంగా పాకిస్తాన్ కాల్పులకు తెగబడుతుందని వివరించారు.

కోల్‌కతాలో 'సంభావన' భారీ నృత్య ప్రదర్శన

కోల్‌కతా : దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది కళాకారులతో శనివారం సాయంత్రం రెండు రోజుల 'సంభావన' భారీ నృత్య ప్రదర్శన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రముఖ భరతనాట్యం కళాకారిణి గీతాచంద్రన్, ప్రసిద్ధ నృత్య దర్శకుడు టెరెన్స్ లెవిస్, ఆధునిక నృత్య కళాకారుడు అసాద్ దేబూ, తన ప్రదర్శన 'యష్టి'కి స్పానిష్ రూపకర్త మిగుల్ మరిన్‌తో కలిసి హేమా భారతీ పళనిలు ప్రదర్శన ఇచ్చారు. శుభా ముద్గల్, అనీష్ ప్రదాన్‌లు అందించిన సౌండ్‌ట్రాక్‌తో చంద్ర 'ఉన్‌ర్త'ను, లెవిస్ 'నెగోషియన్' నృత్యాన్ని ప్రదర్శించారు. రంజనా దేవ్, సుర్జిత్, ఆదితి మంగళ్‌దాస్, సుదర్శన్ చక్రవర్తి వంటి కళాకారులు కూడా పాల్గొన్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



తిరునాళ్లలో ఘోర అగ్నిప్రమాదం

- పెనుగంచిప్రోలులో 50 దుకాణాలు దగ్ధం
- రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మతల్లి చిన్న తిరునాళ్లలో మూడవ రోజు ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మునేటిలోని 50 చిరువ్యాపారుల దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. చిరువ్యాపారుల ఆక్రందనలు మిన్నంటాయి. రూ. 50 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు అమ్మవారికి పాలపొంగళ్లను మునేటి పాకలలో గ్యాస్ పొయ్యిలపై తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒకేసారి పెద్దఎత్తున మంటలు చుట్టుముట్టాయి. తోపుడు బండ్లు, కోళ్లఫారాలతో సహా రకరకాల షాపులు దగ్ధం కావడంతో చిరువ్యాపారులు కట్టు బట్టలతో బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. బొమ్మల దుకాణాలతోపాటు తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలోని ఒడిశా బొమ్మల దుకాణం పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక వాహనాలు అందుబాటులో లేకపోవడంతో భారీ నష్టం జరిగిందని వ్యాపారులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పెనుగంచిప్రోలు ఎస్సై అవినాష్‌తోపాటు భక్తులు మునేటిలో నీరు సప్లయ్ చేస్తున్న పైపులైన్‌ను పీకేసి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి




విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు సంఘటితంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా ముందుకుసాగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మిరియాల వెంకటరావు సామాజిక న్యాయ అధ్యయన కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు వై.శ్రీనివాసరావు (వైఎస్ఆర్) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రత్యేక హోదా-విభజన చట్టంలో అణగారిన కులాల భాగ స్వామ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లా డుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రత్యేక హోదా కోసం కొనసాగుతున్న రాజకీయ, మేధావుల ఉద్యమంలో బహుజనులను భాగస్వా ములను చేయకపోవడం కుట్రలో భాగమే అన్నారు. ప్రజల భావోద్వేగాలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నా యన్నారు. ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కన్వీనర్ అనుమోలు వంశీకృష్ణ మాట్లాడుతూ నిధులు, హామీల విషయంలో కేంద్రం ఇచ్చామనడం, రాష్ట్రం ఇవ్వలేదంటూ పొంతనలేని వాదనలతో ప్రజల్ని మోసంచేస్తున్నాయని ఆరోపించారు. గిరిజన వర్సిటీ వస్తే గిరి జన సంస్కృతులు, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయన్నారు. బీసీ సంఘ నాయకుడు లకనం శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ హోదా సాధిస్తే బీసీలకు మంచి భవిష్యత్ ఉంటుందని, ప్రతి ఒక్కరు పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 85 శాతం జనాభా కలిగిన అణగారిన కులాలన్నీ బలమైన వేదిక నిర్మించడం ద్వారా 2019 ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ హోదా వస్తే బహుజనులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో కేవీపీ సీఎస్ రాష్ట్ర కన్వీనర్ పరిశపోగు రాజేష్, సామాజిక ఉద్యమ నాయకుడు సోడిశెట్టి కృష్ణప్రసాద్, కాపునాడు రాష్ట్ర కార్యదర్శి కూనపరెడ్డి రమేష్, కాపునాడు విజయ వాడ అర్బన్ అధ్యక్షులు నెరుసు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

తలకు ముసుగులేకుండా తీసుకురండి



విశాలాంధ్ర - నెల్లూరు (సిటీ) : మానవ రూపంలో మృగంలా ఒకే రోజు 5 గురు ఆడవాళ్ళపై దారుణానికి ఒడికట్టిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోవూరు బాధితులను ఆదివారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి మానవ మృగాలకు ముసుగు వేయకుండా నడిరోడ్డుపై నడిపించుకుంటూ తీసుకురావాలని, ఇది మరొకరికి గుణపాఠం కావాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. ప్రస్తుతం సమాజంలో నైతిక విలువలు పతనమవుతున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. 60, 70 సంవత్సరాల మహిళల మీద అఘాయిత్యం అంటే చెప్పేందుకే నోరు రావడం లేదన్నారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఇటువంటి మృగాలను మట్టు పెట్టవచ్చన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున రూ. 12,500 అందజేశారు. ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ అతి త్వరలోనే సైకోను పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ -2 వెంకటసుబ్బారెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రశాంతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ పద్మశ్రీ, డీఎస్పీ మురళి పాల్గొన్నారు.

ఆరుగురు మిలీషియా సభ్యుల లొంగుబాటు



విశాలాంధ్ర-విశాఖసిటీ : సీపీఐ (మావోయిస్ట్) కోరుకొండ, గాలికొండ ఏరియా కమిటీ మిలీషియా సభ్యులు ఆరుగురు ఆదివారం విశాఖ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీరందరూ మావోయిస్ట్ కార్యకలాపాల్లో పోస్టర్లను అతికించడం, కరపత్రాలు పంచడం, రోడ్లకు అడ్డంగా చెట్లు నరకడం, పోలీసుల రాకపోకల సమాచారాన్ని చేరవేయడం, మావోయిస్టుల సమావేశాలకు జనసమీకరణ చేయడం లాంటివి చేసేవారన్నారు. మావోయిస్టు కార్యకలాపాలకు విసుగుచెంది లొంగిపోతున్నట్లు పోలీసులను ఆశ్రయించారన్నారు. ఇలా స్వచ్ఛందంగా లొంగిపోయేవారిపై ఎటువంటి వేధింపులు, కేసులు ఉండబోమని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. లొంగిపోవాలనుకునేవారు నేరుగా ఎస్పీ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్లలో సంప్రదించాలన్నారు.

లొంగిపోయిన మావోలు వీరే

చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ తూరుమామిడి గ్రామానికి చెందిన కొర్రా రాజబాబు అలియాస్ రాజు (42) లొంగిపోయారు. ఇతనిపై లక్ష రూపాయల ప్రభుత్వ రివార్డు ఉంది. జీ.కె.వీధి మండలంలోని గూడెం పంచాయతీ కొందు గ్రామానికి చెందిన వంతల సేతు అలియాస్ తిలుసు(25)పై లక్ష రూపాయల రివార్డు ఉంది. ఇదే పంచాయతీ వీరవరం గ్రామమానికి చెందిన కొర్రా మల్లన్న అలియాస్ కుమార్ (30), పాములాయి గ్రామానికి చెందిన పొంగి భాస్కరరావు అలియాస్ పులు (36) లొంగిపోయారు. చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ గొడుగుమామిడి గ్రామానికి చెందిన వంతల రామకృష్ణ (35)పై లక్ష రూపాయల రివార్డు ఉంది. ఇదే పంచాయతీలోని తూరుమామిడి గ్రామానికి చెందిన వంతల రవి అలియాస్ పిప్పడు (30)పై లక్ష రూపాయల రివార్డు ఉంది. లొంగిపోయిన వీరందరికీ ప్రభుత్వ సాయం అందనుంది.

ఆర్టీసీ ఈయూలో చేరిన ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండలరావు

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజమండ్రి బస్‌స్టేషన్ మేనేజర్ యర్రంశెట్టి కొండలరావు తన అనుచరులతో కలిసి ఆదివారం ఇక్కడ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు సమక్షంలో ఆయనకు ఈయూ సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఎన్‌ఎంయూ గుర్తింపులోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినప్పటికీ గత ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సాధించలేకపోయారన్నారు. వేతనాల సవరణ గడువు పూర్తై ఏడాది అవుతున్నా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కాకుండా మరోసారి కార్మికులను మోసం చేసే విధంగా ఈ నెల 12వ తేదీన సమ్మె నోటీసు ఇస్తున్నట్టు మరో డ్రామా ఆడుతున్నారన్నారు. ఈ డ్రామాలు నచ్చక ఐక్య ఉద్యమాల రథసారథి అయిన యూనియన్ ప్రధానకార్యదర్శి కె.పద్మాకర్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరుతున్నానన్నారు, జిల్లాలో ఎంప్లాయిస్ యూనియన్ బలమైన శక్తిగా ఎదిగేలా జిల్లాలోరి అందరి నాయకులతో కలసి పనిచేస్తానని కొండలరావు తెలిపారు. ఈయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన తుని డిపోలో జరగబోయే యూనియన్ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో కొండలరావుకు ఏ స్థాయి నాయకత్వ బాధ్యతలు అప్పజెప్పేదీ ప్రకటిస్తామని తెలిపారు. ఈయన చేరికతో జోన్‌లోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో కూడా ఈయూ బలపడుతుందన్నారు. ఈయూ రాష్ట్ర నాయకులు పి.జార్జిబాబు, పి.సత్యానందం, ఎస్‌వి.రావు, జోనల్ నాయకులు బాబు, రీజినల్ నాయకులు మల్లిబాబు, రాజమండ్రి డిపోకార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు, ఈయూ కండువాతో కొండలరావును సత్కరించారు.



వర్సిటీ అధ్యాపక పోస్టుల భర్తీకి అడ్డంకులెన్నో..

- అన్ని వర్సిటీలకు న్యాయస్థానం స్టే విధింపు
- అయోమయంలో వేలాదిమంది అభ్యర్థులు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు

విశాలాంధ్ర - తిరుపతి (ఎస్వీయూ) : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీ అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఎదురవుతున్న అడ్డంకులు ఇప్పట్లో తొలగే సూచనలు కనిపించడంలేదు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1100కి పైగా పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. ఇందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు కసరత్తు ప్రారంభించాయి. అంతలోనే విశ్వవిద్యాలయాల్లోని పోస్టుల భర్తీని ఏకకాలంలో చేపట్టాలని, ఆ బాధ్యతను స్వయంగా ప్రభుత్వమే చేపట్టనున్నట్టు ప్రకటన వెలువడింది. దీంతో పోస్టుల ఖాళీల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు అందజేశారు. దీనిపై కసరత్తు చేసిన ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వివిధ విభాగాల పోస్టుల్లో మార్పు చేస్తూ విశ్వవిద్యాలయాల వారీ ప్రకటన జారీ చేసింది. ఇందులో వివిధ విభాగాల్లో పోస్టులను ఇతర విభాగాలకు మార్చుచేయడంతోపాటు ప్రొఫెసర్ పోస్టులను అసోసియేట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొన్నింటిని మార్పు చేసింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు తలెత్తాయి. చివరకు విశ్వవిద్యాలయాల వారీ అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీ చేసింది. ఇదే సమయంలో అధ్యాపకుల భర్తీకి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రకటనలు వెలువడిన వెంటనే రాష్ట్రంలో అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అయితే విశ్వవిద్యాలయాలు జారీ చేసిన ప్రకటనల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లను సరిగా పాటించలేదని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అన్ని విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పోస్టుల భర్తీకి హైకోర్టు బ్రేకులు వేసింది. ముఖ్యంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్లతో పాటు గతంలో వివిధ విభాగాల్లోని పోస్టులు కనుమరుగు కావడం ప్రధాన అంశాలుగా ఉన్నాయి. వీటితోపాటు చాలా విభాగాలకు గతంలోని అర్హతను సైతం మార్పు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు సరైన మార్గదర్శకాలు రూపొందించకుండానే ప్రకటనలు జారీ చేయడం అభ్యర్థులను అయోమయానికి గురిచేసింది. స్క్రీనింగ్ టెస్ట్ తేదీని స్పష్టంగా ప్రకటించకపోవడం, మానవ వనరుల విభాగం ప్రతిసారి ఒక్కో పరీక్షా తేదీ ప్రకటిస్తుండడం ఆందోళనకు గురిచేస్తుంది. విశ్వవిద్యాలయాలకు చెందిన ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వం తీరుతో పోస్టుల భర్తీపై సరైన అవగాహన లేక తర్జన భర్జనలు పడుతున్నారు. త్వరలో ఉపకులపతుల పదవీ కాలం పూర్తవుతున్న విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో చాలావరకు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీకాలం మరో రెండు నెలల నుంచి ఆరు నెలల కాలంలో పూర్తి కానుంది. దీంతో ప్రభుత్వమే స్వయంగా ఆయా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీకి బ్రేక్ వేయనుంది. మరోవైపు రాష్ట్రంలో వేయి మంది వరకు విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరి ఉద్యోగ భద్రతకు సైతం ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేకపోతున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న వేలాదిమంది అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సరైన మార్గదర్శకాలు లేకుండా పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటనల జారీ ప్రక్రియను ప్రారంభించడంతోనే ఇటువంటి పరిస్థితి నెలకొందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇకనైనా విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పోస్టుల భర్తీకి సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని అభ్యర్థులు కోరుతున్నారు.



Sri Krishnadevaraya University

అంగన్‌వాడీల సహనాన్ని పరీక్షించొద్దు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు హెచ్చరిక




విశాలాంధ్ర-కడప (జిల్లా పరిషత్) : రాష్ట్ర ప్రభుత్వం తరపున క్షేత్ర స్థాయిలో విశేష సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో జాప్యంపై కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారని, వారి సహనాన్ని ఎక్కువ కాలం పరీక్షించవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో ఎన్నో సంఘటిత ఉద్యమాల ద్వారా సమస్యలను కార్యకర్తలు పరిష్కరించుకున్న తీరును గమనించాలని హితవు పలికారు. కడపలోని హోచిమిన్ భవన్‌లో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం యూనియన్ రాష్ట్ర ఉపాధ్య క్షురాలు ఆర్.సుగుణమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఓబులేసు మాట్లాడుతూ పనిభారం పెంచడంతోపాటు చేసిన పనికి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం, హౌస్ రెంట్, ఇతర బిల్లులు పెండింగ్‌లో పెట్టడం వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించాలని డిమాండ్ చేశారు. శాసన మండలి సభ్యులు కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను శాసన మండలిలో లేవనెత్తుతానన్నారు. అధికారులతో సంప్రదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సిందే

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్ణయించినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ వివరించారు. కేంద్రాలకు సంబంధించి పెండింగ్‌లోని హౌస్ రెంట్స్, కార్యకర్తలు, ఆయాల వేతనాలు, ఇతర పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వడంతోపాటు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నట్లు రూ.10,500 జీతాలు ఇవ్వాలని, బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలని, ఐసీడీసీలో పనిచేసే వారికి ప్రమోషన్లను అర్హత కలిగిన వారికే ఇవ్వాలని తీర్మానించినట్లు చెప్పారు.

'చింతమనేని' చుట్టూ ఉచ్చు



విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభా కర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కోర్టులో జైలుశిక్ష, అనర్హత వేటు వేయాలంటూ ప్రతిపక్షాల డిమాండ్ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరుపై తీవ్ర చర్చ సాగుతోంది. భీమడోలు మేజిస్ట్రేట్ కోర్టు మూడు వేర్వేరు కేసుల్లో మూడేళ్ల జైలు శిక్ష విధించిన వ్యవహారంలో అతనిపై అనర్హత వేటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి 2011లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై చింతమనేని ప్రభాకర్ చేయి చేసుకున్నారు. వట్టి వసంత్ కుమార్ గన్‌మెన్ ఎం. సుబ్బారావుపై చేయిచేసుకున్న కేసులోనూ దోషిగా నిర్ధయిస్తూ భీమడోలు మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. 2011 జూన్‌లో దెందులూరు హైస్కూల్‌లో జరిగిన రచ్చబండలో అప్పటి రాష్ట్ర మంత్రి వట్టి వసంత్ కుమార్‌పై దెందులూరు ఎమ్మెల్యే అయిన చింతమనేని దౌర్జన్యం చేయడంతో పాటు అప్పటి ఎంపీ కావూరి సాంబశివరావుపైనా ప్రజలందరి సమక్షంలో చేయి చేసుకున్నారు. దీనిపై వట్టి వసంత్‌కుమార్ గన్‌మెన్ ఫిర్యాదు మేరకు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు నాలుగు సెక్షన్లుగా కేసు నమోదు చేశారు. ఏడేళ్లుగా కేసు వాదోపవాదనల అనంతరం గత నెలలో ఆయనకు జైలు శిక్ష పడిన విషయం తెలిసిందే. ఆ తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునివ్వడంతో చింతమనేనికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష వర్తిస్తుంది. తీర్పు వెలువడిన వెంటనే చింతమనేని బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశానికి ఆయన రాకుండా అనర్హత వేటు వేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. అతని జైలు శిక్షపై అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

బీమా కంపెనీలకే హెల్త్ స్కీం నిధులు

- పేద రోగులకు కొత్తగా ప్రయోజనాల్లేవు
- గతేడాది కంటే నిధుల కోత : ఎఫ్ఎంఆర్ఏఐ జాతీయ నేత డాక్టర్ అమిత్వ గుహ

విశాలాంధ్ర-విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ స్కీమ్ బీమా కంపెనీలను ప్రోత్సహించేలా ఉందని అఖిల భారత మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్ అసోసియేషన్ సమాఖ్య (ఎఫ్ఎంఆర్ఏఐ) జాతీయ నేత డాక్టర్ అమిత్వ గుహ విమర్శించారు. ఈ స్కీమ్ ద్వారా దేశంలోని 10 కోట్ల కుటుంబాల్లోని 50 కోట్ల మంది రూ. 30 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు పొందవచ్చన్న ప్రకటన ఆచరణ సాధ్యం కాదని గతానుభవాలు చెబుతున్నాయన్నారు. 2014 నాటి జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం ఈ తరహా పథకాల వల్ల 1.2 శాతం గ్రామీణ ప్రజలు, 6.2 శాతం పట్టణ ప్రజలు పాక్షి కంగా మాత్రమే వైద్య ఖర్చులు పొందినట్టు తేలింద న్నారు. విశాఖలోని ఏయూ టీఎల్ఎన్ సభా హాలులో ఆదివారం 'అందరికీ ఆరోగ్యం-ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై జరిగిన జాతీయ సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అంతర్జాతీయ అనుభవాల ప్రకారం ప్రభుత్వ వైద్యరంగం ద్వారానే ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించగలమని రుజువైన అంశాలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 2007 నుంచి 2013 వరకు ఖర్చు చేసిన రూ.47.23 బిలియన్లలో రూ.36.52 బిలియన్లు ప్రైవేటు రంగానికే పోయాయన్నారు. కేవలం రూ.10.71 బిలియన్లు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు.

ఆరోగ్యరంగంపై ప్రభు త్వాలు చేసే ఖర్చును 3 నుండి 0.9 శాతానికి తగ్గించుకు న్నాయన్నారు. ఈ ఏడాది భారత ప్రభుత్వం పట్టణ, గ్రామీణ హెల్త్ మిషన్‌కు నిధులు కుదించిందన్నారు. 2017-18లో రూ.30,801 కోట్లు కేటాయించగా, 2018-19లో హెల్త్ స్కీమ్‌కు రూ.30,129 కోట్లకు తగ్గించారన్నారు. దీంతో ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషించే జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు 5 శాతం మేర నిధులకు కోత పడిందన్నారు. గతేడాది రూ.25,458 కోట్లు కాగా ఈ ఏడాది రూ.24,279 కోట్లకు పరిమితం చేశారన్నారు. 'మహిళల ఆరోగ్యం- ప్రభుత్వాల పాత్ర' అనే అంశంపై సెమినార్‌లో ప్రముఖ గైనకా లజిస్ట్ డాక్టర్ పి.ప్రతిభ ప్రసంగించారు. ఏయూ వీసీ జి. నాగేశ్వర రావు, ప్రజారోగ్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎస్.సురేష్, ఏయూ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ కార్డియాలజీ పూర్వ ఆచార్యులు డాక్టర్ జి. వెంకటేశ్వరరెడ్డిని ఘనంగా సన్మానించారు.



మన్యం బంద్ విజయవంతం

- మన్యమంతటా నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు, బైఠాయింపులు
- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- సీఆర్‌పీఎఫ్ పోలీసుల పహారా
- నేతల అరెస్టులు, విడుదల

విశాలాంధ్ర నెట్‌వర్క్ : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీల అమలు, విశాఖ రైల్వేజోన్ సాధన కోసం గిరిజన జేఏసీ పిలుపుతో ఆదివారం మన్యం బంద్ విజయవంతంగా ముగిసింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో బంద్ జరిగింది. సీపీఐ, సీపీఎం, వైసీపీ, కాంగ్రెస్ నేతలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పలుచోట్ల పోలీసులు నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. విశాఖ జిల్లా అనంతగిరి మండలంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రధాన రోడ్డుపై గిరిజన సంఘం, సీపీఐ, సీపీఎం నాయకులు బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అరకులోయ సుంకరమెట్ట సంతలో గిరిజన సంఘం, సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెదబయలులో వామపక్షాలతో పాటు వర్తక సంఘం, మోటర్ యూనియన్ బంద్‌కు మద్దతు తెలిపాయి. పెద్దఎత్తున ర్యాలీ అనంతరం నాలుగు రోడ్డు కూడలి వద్ద నినాదాలు చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ బోయ వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో రాజకీయ పార్టీలు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. కొయ్యూరులో నేతలు రోడ్డుపై బైఠాయించారు. గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పొట్టిక సత్యనారాయణ, వామపక్ష నేతలు ఎస్.సూరిబాబు, చిన్నారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, మక్కువ, కొమరాడ తదితర మండలాల్లో బంద్ కట్టుదిట్టంగా జరిగింది. పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం డిపోల నుంచి ఏజెన్సీకి రావాల్సిన ఆర్టీసి బస్సులు రాలేదు. సివిల్ పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్ సాయుధ బలగాలు పహారా కాశాయి. మాజీ ఎమ్మెల్యే, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మక్కువ మండలంలోని ఎర్రసామంత వలస వద్ద ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఏపీ గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎం. అమర్‌నాథ్, టీ.ప్రభాకర్, ఎం.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. కొమరాడ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. రెండు గంటలపాటు రాస్తారోకో కొనసాగడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనకారులను కొమరాడ పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్టులు చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తే పోలీసులు నిర్బంధించడం అన్యాయమని సాంబమూర్తి అన్నారు. మోటారు కార్మికులు మద్దతు తెలపడంతో ఆటోలు తిరగకపోవడంతో మండల కేంద్రమంతా నిర్మానుష్యంగా మారింది. శ్రీకాకుళం జిల్లా భామిని మండలంలో గిరిజన ఐక్యవేదిక ప్రతినిధులు కొండగొర్రి భాస్కరరావు, పిరపాక శ్రీనువాసరరావు, బిడ్డిక కృష్ణారావుల అధ్వర్యంలో మెయిన్ కూడలిలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. భామినిలో ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయుకులు కద్రక. లక్ష్మీనారాయణ, కోలక.సంజీవరావు పాల్గొన్నారు.





నేవిగేషన్ స్వేచ్ఛ పరిరక్షణ, సంకుచిత జాతీయవాదంపై పోరు అవశ్యం

వియత్నాం అధ్యక్షుడు క్వాంగ్



న్యూఢిల్లీ : అన్ని దేశాలు నేవిగేషన్ స్వేచ్ఛను పరిరక్షించుకుంటూ, సంకుచిత జాతీయవాదంపై పోరాటం చేసినప్పుడే ఇండో-ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సామరస్యం, సుసంపన్నత నెలకొంటుందని వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ దయి క్వాంగ్ అన్నారు. ఐరాస భద్రతా మండలి (యూఎన్ఎస్సీ)లో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న కృషిని సమర్థించారు. ప్రాదేశిక అనుసంధానం, సహకార యంత్రాంగాలలో న్యూఢిల్లీ క్రియాశీలతకు మద్దతు పలికారు. రాజకీయాలు, రక్షణ, భద్రత సహకరాలు ద్వైపాక్షిక సంబంధాలకు వ్యూహాత్మక స్తంభాలన్నారు. వియత్నాం, భారత్ సంబంధాలపై క్వాంగ్ మాట్లాడారు. వచ్చే శతాబ్దం ఇండో-ఆసియా-పసిఫిక్ శతాబ్దం కావాలని ఆకాంక్షించారు. అన్ని దేశాలు ఉమ్మడి విజన్‌తో ముందుకు సాగినప్పుడే అది సాధ్యమన్నారు. అలా జరిగిననాడు శాంతి, సుస్థిరత, సామరస్యం, సుసంపన్నత నెలకొంటాయని, ఏ దేశంగానీ, ఏ జాతిగానీ, ఏ సంఘంగానీ వెనుకబడదన్నారు. ఒక్క ద్వైపాక్షిక సంబంధాల విషయంలోనే కాకుండా కీలక క్షేత్రాల్లో మేరిటైమ్ కనెక్టివిటీని పెంపొందించుకోవాల్సిన అవసరం ఇరు దేశాలకు ఉందని క్వాంగ్ అన్నారు. మేరీటైమ్ కనెక్టివిటీతో పాటు పోర్ట్ సహకారం, పర్యావరణ పరిరక్షణ, సముద్ర వనరుల సుస్థిర వినియోగం ద్వారా బ్లూ-సీ ఎకానమీని అభివృద్ధి చేసుకునేందుకు భారత్-వియత్నాం దేశాలు సంయుక్తంగా కృషి చేయాలని క్వాంగ్ తెలిపారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే...



ఆదివారం విశాఖలో జరిగిన ప్రత్యేక హోదా బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రఘువీరా, శివాజీ, జేవీ సత్యనారాయణ మూర్తి, నరసింగరావు ద్రోణంరాజు శ్రీనివాస్ తదితరులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రత్యేక హోదా కోసం.. రైల్వే జోన్ కోసం.. వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలంటూ సాగర తీరం హోరెత్తింది. ఆదివారం సాయంత్రం ఉత్తరాంధ్ర చర్చావేదిక నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సారథ్యంలో చేపట్టిన కాగడాల ప్రదర్శన జనసంద్రమైంది. చిక్కని చీకటిలో అలల ఘోషలో హోదా కోసం ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం, 5 కోట్ల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే విభజన హామీలు అమలు కోసం దివిటీలతో యువత ఉకరలేసి ఉద్యమించారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, లోక్‌సత్తా, ప్రజాసామాన్య పార్టీతోపాటు విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక సంఘాల నేతలు, వివిధ సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ కాగడాల ప్రదర్శన విజయవంతం చేశాయి. ఆర్‌కే బీచ్ జంక్షన్ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు వేలాదిమంది కాగడాలు ప్రదర్శనలో పాల్గొని హోదా కోసం నినదించారు. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు విమర్శించుకోవడమే తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని, దగాపడ్డ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఇక ఢిల్లీలో తాకట్టుపెట్టబోమని ప్రజలే ఉద్యమించి హోదాను సాధిస్తామని నినదించారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని, విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండు చేశారు. అంతకుముందు బీచ్ రోడ్డులో జరిగిన సభలో అన్ని పార్టీల నేతలు పాల్గొని మాట్లాడారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవ శంఖారావం విశాఖ నుంచే పూరిస్తున్నామని, విభజన హామీల సాధనకు ఇక ప్రజా పోరాటం నిర్వహిస్తామన్నారు. ఆంధ్రాకు జరిగిన అన్యాయంపై పక్కనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి హోదా కోసం మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదని, ఈయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రేనా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ముందుండి రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాడాల్సింది పోయి, నాలుగేళ్లపాటు ప్రజలను మోసం చేశారన్నారు. ప్రతిపక్ష నేత జగన్ కూడా చలో ఢిల్లీ వెళ్లి ఉద్యమంలో పాల్గొనాలన్నారు. ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, రూ.15 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ తక్షణం కేంద్రం ప్రకటించాలని డిమాండు చేశారు. విశాఖలో రైల్వే జోన్, ఎయిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించాలని, గిరిజన యూనివర్సిటీని ఉత్తరాంధ్రలోనే నెలకొల్పాలని, హైకోర్టు బెంచ్ విశాఖలో పెట్టాలని డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఈ కాగడాల ప్రదర్శన 5 కోట్ల ప్రజల జీవితాల్లో వెలుగు నింపే హోదా కోసం, రైల్వే జోన్ కోసం, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ కోసం ఉద్యమమన్నారు. విశాఖ నుంచే ఉద్యమాన్ని రగిలించి ఢిల్లీ వీధుల్లో పోరాడుతామన్నారు. విభజన హామీలు సాధించే వరకు ఢిల్లీలోనే ఉంటామన్నారు. లోటు బడ్జెట్‌పై పవన్ కల్యాణ్‌కు ఉన్న అవగాహన చంద్రబాబుకు లేకపోవడం ఆంధ్ర ప్రజల దురదృష్టమన్నారు. విశాఖ ఎంపీ హరిబాబు ఎక్కడున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో ఒక్కసారైనా రైల్వే జోన్, ప్రత్యేక హోదాపై ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ గెలిస్తే హోదా అడగమన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు మొక్కుబడి, రాజకీయ లబ్ధి కోసం ఉద్యమించవద్దని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమించాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఇది ఆఖరి పోరాటమని, నెల రోజుల్లో హోదా, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ సాధించుకోవాలన్నారు. ఢిల్లీలో అందరం కలిసి పోరాడుదామన్నారు. చంద్రబాబు వెంటనే అసెంబ్లీ వాయిదా వేసి ఢిల్లీ రావాలని, జగన్ పాదయాత్రను ఆపి ఢిల్లీ రావాలని రఘువీరా కోరారు. బీజేపీకి బందీలై ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు విముక్తి కావాలని హితవు పలికారు. విశాఖ ఉక్కు ఉద్యమ స్ఫూర్తితో మరో ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధన సమితి నాయకుడు, సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ కోరుకోని విభజన ఆంధ్రా ప్రజలకు అంటగట్టి ఉపాధి లేకుండా నాలుగేళ్లపాటు నరకయాతన అనుభవిస్తున్న రాష్ట్ర ప్రజల విముక్తి కోసం మరో ఉక్కు పోరాటం చేపడదామన్నారు. ఐదేళ్లలో రూ.83 వేల కోట్లు నష్టపోయిన ఆంధ్రాకు న్యాయం జరగాలంటే ప్రజలంతా జాతీయ రహదారులు దిగ్బంధం, రైల్‌రోకోలు చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్రం ఒడిశాలో ఎన్నికల కోసమేనన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన మొదటి వ్యక్తి వెంకయ్యనాయుడేనన్నారు. రాబోయే తరం కోసం నిజాయతీగా ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం విభజన హామీల అమలుకు ఉద్యమిద్దామన్నారు. కొంతమంది వర్షంలా వచ్చి డ్రామా పోరాటాలు చేస్తున్నారని శివాజీ ఎద్దేవా చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు మాట్లా డుతూ హోదా కోసం చంద్రబాబుకు అడగడం చేతకాక కేంద్రానికి సన్మానం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విభజన హామీలు అమలు చేయాలని, ఇందుకోసం అల్లూరి స్ఫూర్తితో మరో ఉక్కు ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ప్రజా సామాన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిబాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస్, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, రామారావుతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, డాక్టర్ జహీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, వామపక్ష పార్టీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొణతాల అనుచర వర్గం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం



విశాలాంధ్రబ్యూరో-హైదరా బాద్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టు సిబ్బంది అప్రమత్తత కారణంగా ఆదివారం పెనుప్రమాదం తప్పింది. విమాన ఇంధనం.. రన్‌వేపై ధారలా కారిపోవడంతో ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో కల కలం చెలరేగింది. తక్షణమే ఫైరింజన్లను రప్పించి, రన్‌వే మొత్తాన్ని శుభ్రంగా కడిగేశారు. సాంకేతిక నిపుణులు విమానంలో లీకేజీ లోపాన్ని సరిచేశారు. ఒకవేళ ఆ విమానం టేకాఫ్ ఉంటే పెను ప్రమాదమే జరిగేదని అధికారులు చెప్పారు. చౌక విమానయాన సంస్థ 'సిటీ లింక్'కు చెందిన విమానం ఇంధనం కోసం అత్యవసరంగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో దిగింది. అప్పటికే సిద్ధంగా వున్న ఎయిర్‌పోర్టు సిబ్బంది విమానంలో ఇంధనం నింపి, టేకాఫ్ కోసం రన్‌వేపైకి మళ్లించారు. టేకాఫ్ సమయంలో విమానం నుంచి ఇంధనం లీకవుతున్నట్టు గుర్తించారు. వెంటనే విమానాన్ని అపేయాలంటూ పైలేట్‌కు అదేశాలు జారీచేశారు. విమానం ఆగిన వెంటనే రన్‌వేపై కారిన ఇంధనాన్ని ఫైర్‌ఇంజన్ల సహాయంతో శుభ్రం చేశారు. విమానంలో లీకేజి లోపాన్ని సరిచేశారు. అనంతరం విమానం బయల్దేరి వెళ్లింది. సిటీలింక్ విమానం జెడ్డా నుంచి జకార్తాకు వెళు తున్నట్లు అధికారులు తెలిపారు.

గిరినెక్కిన గిరిపుత్రిక పథకం...



- కావాల్సింది రూ.9 కోట్లు..
- ఉన్నది రూ. 2.53 కోట్లు..
- బడ్జెట్‌లో న్యాయం జరిగేనా...

విశాలాంధ్ర అమరావతి : గిరిజన సంక్షేమం ప్రకటనలకే పరిమితమవుతోంది.. ఎన్నో ఆశలతో పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిరాశే మిగులుతోంది.. తెలుగుదేశం సర్కార్ ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు వివాహం చేసుకునే సమయంలో ఆర్థిక సాయమందించాలనే ధ్యేయంతో గిరిపుత్రిక కళ్యాణ పథకాన్ని ప్రారంభించారు. 2016 జనవరి మాసంలో రావెల కిషోర్ బాబు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించి, కొంతమందికి ఆర్థిక సహాయం అందించిన సర్కార్ తర్వాత ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఈ పథకం ద్వారా వివాహం చేసుకునే గిరిజన మహిళలకు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారు. అందులో భాగంగానే ప్రతి ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ వస్తున్నారు. కాగా ప్రస్తుతం గిరిపుత్రిక పథకానికి 5,350 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, దరఖాస్తులు పరిశీలించిన శాఖ ఉన్నతాధికారులు 4,646 మంది లబ్ధిదారులను పథకానికి అర్హులుగా ఎంపిక చేశారు. కాగా ఇంకా 694 మంది దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. అయితే 4,646 మందిలో 3,679 మంది లబ్ధిదారులకు మాత్రమే గిరిపుత్రికలో సాయమందించారు. మొత్తంగా ఇప్పటివరకు ఉన్న వారిలో 1,816 మంది లబ్ధిదారులకు గిరిపుత్రిక పథకం అమలు చేయాల్సి ఉంది. ఇందుకోసం సుమారు తొమ్మిది కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని అధికారుల చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి అధికంగా 1525 మంది దరఖాస్తులు చేసుకోగా చిత్తూరు జిల్లా నుంచి అత్యల్పంగా 164 మంది చేసుకున్నారు. శ్రీకాకుళం నుంచి 501 మంది , విశాఖపట్నం నుంచి 458 మంది , పశ్చిమగోదావరి నుంచి 538 , నెల్లూరు నుంచి 341, అనంతపురం నుంచి 450 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖలో రూ. 2.53 కోట్ల రూపాయలు నిధులు మాత్రమే ఉన్నాయని శాఖ ఉన్నతాధికారులు తెలియచేస్తున్నారు. మిగిలిన రూ. 6.55 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. ఈ పథకంలో ప్రతి మూడు నెలలకు ఆర్థిక సహాయాన్ని అందించాల్సి ఉండగా, ఏడాది నుంచి వీటిని అటకెక్కించారు. గిరిజన శాఖలో ఉన్న నిధులనైనా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. భవిష్యత్ ఎన్నికలని దృష్టిలో పెట్టుకుని అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన రీతిన స్పందిస్తారనే ఆశాభావాన్ని లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

నేడు అమిత్‌షాతో టీడీపీ నేతల కీలకభేటీ

తేలనున్న ఏపీ వ్యవహారం



విశాలాంధ్ర అమరావతి : ఏపీ విభజన హామీలు అమలు, ఇతర ప్రధాన అంశాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో సోమవారం కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీ రామమోహన్‌నాయుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావులు ఢిల్లీలో భేటీ కానున్నారు. ఈ భేటీకి అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి మిత్రపక్షాలుగా వ్యవహరిస్తున్న టీడీపీ, బీజేపీల మధ్య తీవ్ర వైరం ఏర్పడింది. ఏపీకి కేంద్రం న్యాయం చేయలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో పోరు ప్రారంభించారు. దీనికి తోడు ప్రత్యేకహోదా కోసం వామపక్షాలు ఇచ్చిన బంద్‌కు వైసీపీ, కాంగ్రెస్ తో పాటు టీడీపీ కూడా మద్దతు పలికింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదాను తాము వద్దన లేదని, ప్యాకేజీ ద్వారా హోదా రాయితీలన్నీ ఇస్తామని అంటేనే ప్యాకే జీకి ఒప్పుకున్నామని, దాని రూపేణా కూడా న్యాయం చేయ లేదని, అందువల్ల ప్రత్యేక హోదా కోరుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపక్షాలన్నీ ప్రత్యేకహోదా డిమాండ్‌ను తీవ్ర తరం చేశాయి. దీనికి తగ్గట్టుగా ఢిల్లీలో నిరసనలు తెలిపేందుకు అన్ని పార్టీల నాయకులు ఇప్పటికే అక్కడకు చేరుకున్నారు. దీనికి తోడు ఏపీ విభజన హామీల అమలు, ప్రత్యేకహోదా, పోలవరం, రెవెన్యూలోటు, తదితర 19అంశాలపై కేంద్రం సోమవారం నాటికి స్పష్టమైన ప్రకటన చేయకుంటే తమ నిర్ణయం తాము తీసుకుంటామని, పొత్తు వద్దంటే నమస్కారం పెట్టి తప్పుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించటంతో పాటు రాష్ట్ర ప్రయోజనాల సాధన విషయంలో కేంద్రంపై పోరాటంలో ఎక్కడా వెనక్కు తగ్గద్దని తన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. దీంతో పరిస్థితి చేయిదాటుతుందని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా గ్రహించి నాలుగు రోజుల క్రితం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి 5న ఢిల్లీకి రావాలని, చర్చించుకుందామని కోరారు. అయితే ఇందుకు చంద్రబాబు తాను రానని చెప్పి పార్టీ ప్రతినిధులుగా కేంద్రమంత్రి సుజనా, మరో ఇద్దరిని పంపుతామని అమిత్‌షాకు చెప్పారు. అయితే ఇప్పటికే కేంద్రంతో తెగదెంపులు చేసుకొనే ఆలోచనలు టీడీపీలో జరుగుతున్నాయి. దీనికితోడు పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదిక వల్ల కేంద్రం ఏపీకి చాలా నిధులు ఇవ్వాలని తేలిపోయింది. ఇదే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలతో కలిసి జాతీయస్థాయిలో తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు పిలుపునిచ్చారు. దీనికితోడు ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వటం సమంజసమని మద్దతు పలికారు. కేసీఆర్ తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు జాతీయస్థాయిలోని పలు పార్టీల నుంచి సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉండగా వైసీపీ అధినేత జగన్ ఈ నెల 21న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. సోమవారం నుంచి ఏపీకి ప్రత్యేకహోదా నినాదాన్ని ఢిల్లీ వీధుల్లో అన్ని పార్టీల నేతలు హోరెత్తించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ నేతలతో చర్చించనున్న అమిత్‌షా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటారన్నదానిపై టీడీపీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



దళితులకు న్యాయం చేయాలి

ఆత్మగౌరవ సభలో వక్తలు డిమాండు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామంలో దళితులపై దాడి చేసిన ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేసి దళితులకు న్యాయం చేయాలని దళిత ఆత్మ గౌరవ సభలో వక్తలు డిమాండ్ చేశారు. గుంటూరు ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్‌లో పెదగొట్టిపాడు దళిత బాధితుల సంఘీభావ కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ అధ్యక్షతన దళిత ఆత్మ గౌరవ సభ ఆదివారం జరిగింది. ఈ సభలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడి, రాష్ట్రంలో చంద్రబాబులు వచ్చిన తరువాత నిమ్నజాతులను అణగతొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ ఐక్యంగా ఈ ఆగడాలను ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పెదగొట్టిపాడు వంటి ఘటనలను ఎదుర్కొనకపోతే రాబోయే కాలంలో ఇటువంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విరసం జి.కళ్యాణ్‌రావు, డీఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది వైకె, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు షేక్ మస్తాన్ వలి, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు సింహాద్రి ఝాన్సీ, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, గొట్టిపాడు దళిత బాధితుల పోరాట కమిటీ నాయకురాలు జొన్నలగడ్డ జయభాగ్యమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట మాల్యాద్రి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు. కనకరాజు ప్రసాద్, బహుజన మహాసభ కేంద్ర కార్యదర్శి జి.అర్.భగత్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు కొరివి వినయ్‌కుమార్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలోకి పవన్.. !

- పార్టీ నేతలు, కార్యకర్తల ఆకాంక్ష
- జనసేన కార్యాలయం వద్ద అభిమానుల సందడి
- 14న గుంటూరులో ఆవిర్భావ సభ
- కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : ఏపీకి ప్రత్యేక హోదా సాధించేందుకు ప్రజాక్షేత్రంలోకి రావాలంటూ జనసేనాని పవన్‌కల్యాణ్‌ను పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు. ప్రత్యేక హోదాతోనే న్యాయం జరుగుతుందని పవన్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేశారు. ఈ క్రమంలో ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. కేంద్ర ప్రభు త్వ నిధులు, ఖర్చులపై పవన్ నేతృత్వంలోని జేఎఫ్‌సీ నివేదికను సమర్పించింది. ఇందులో ఏపీకి వచ్చిన కేంద్ర నిధులపై సమగ్ర సమాచారం ఉంది. ఆయా వివరాలను పవన్ ప్రజలకు వివరించారు. ప్రత్యేక హోదాతోనే ఏపీకి న్యాయం జరుగుతుందని ఆయన శనివారం విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు పార్టీ కార్యాల యానికి చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. చాలామంది పవన్‌కు ఫోన్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జేఎఫ్‌సీ నివేదిక అధారంగా క్షేత్రస్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని వారంతా పవన్‌ను కోరుతున్నట్టు చెబుతున్నారు. వివిధ రాజకీయపక్షాలు హోదా కోసం పోరాడుతున్న తరుణంలో పవన్ ఉద్యమం చేబడితే కేంద్రం పై మరింత ఒత్తిడి పెరుగుతోందన్న భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఏపీలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలు కోసం పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తూ.. పజలను చైతన్యవంతం చేస్తున్నాయి. కొన్ని రోజులుగా ఏపీలో ఉద్యమాలు తారాస్థాయికి చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకహోదా నినాదం మార్మోగుతోంది. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతుండడంతో పవన్ ఉద్యమించేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నారు. రెండు అధికార పార్టీలతో సామరస్యంగా వుంటూ వచ్చిన పవన్‌తో విభేదించేందుకు ఆ పార్టీలు సిద్ధంగా లేకపోవడంతో ఆయన చేసే ఉద్యమంతో కచ్చితంగా కదలిక వస్తుందని ఆశిస్తున్నారు. ఏపీ ఎంపీలపై కూడా పవన్ ఉద్యమంతో ఒత్తిడి పెరిగి పార్లమెంటులో హోదాతో పాటు విభజన హామీలపై గళమెత్తుతారని, కేంద్రంపై ఒత్తిడి పెంచుతారని అంటున్నారు. ఈనెల 14న గుంటూరులో జరిగే పార్టీ ఆవిర్భావ సభలో పవన్ పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. భవిష్యత్తు కార్యాచరణ, ప్రత్యేక హోదా విషయంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజాసమస్యలపై ఉద్యమించాల్సిన విధానాలపై నాయకులతో పవన్ చర్చించనున్నారు. హోదా వల్లే ఏపీకి న్యాయం జరుగుతుందన్న వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలు పవన్‌ను ప్రజాక్షేత్రంలోకి రావాలని ఒత్తిడి చేస్తున్నారు.

నాగాలాండ్, మేఘాలయల్లో

బీజేపీ కూటమి ప్రభుత్వాలు..!

- రాష్ట్ర గవర్నర్లను కలిసిన నేతలు
- మేఘాలయలో 34 మంది మద్దతు లేఖ అందజేసిన కాన్రాడ్ సంగ్మా
- నాగాలాండ్‌లో 32 మంది మద్దతున్నట్లు తెలిపిన నైఫీ రియో





కోహిమా/షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాలు నాగాలాండ్, మేఘాలయలలో బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు చేసే అవ కాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఆ కూటమి పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) నేతృత్వంలో బీజేపీతో కలిసి ఐదు పార్టీల కూటమి మేఘాలయలో అధికారంలోకి రానున్నది. దీంతో రాష్ట్ర శాసన సభకు శనివారం వెలువడిన ఫలితాల్లో అతి పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ ఆశలు సన్నగిల్లాయి. ఎన్‌పీపీ నాయకుడు కాన్రాడ్ సంగ్మా తదుపరి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలున్నాయని, కానీ ఆయన సోదరి అగాథ సంగ్మా కూడా రేసులో ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఆదివారం సాయంత్రం కాన్రాడ్ సంగ్మా గవర్నర్ గంగా ప్రసాద్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటు విషయాన్ని తెలిపారు. ఎమ్మెల్యేల మద్దతుతో కూడిన లేఖను గవర్నర్‌కు అందజేశారు. అంతకుముందు, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) అధ్యక్షుడు దొంకూపర్ రాయ్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 19 సీట్లు సాధించిన ఎన్‌పీపీకి తమ పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాయ్ నివాసంలో బీజేపీ నాయకులు కిరేన్ రిజుజ్జు, కె.జె.అల్ఫోన్స్, హిమాంత్ బిశ్వా శర్మ, యూడీపీ నాయకుల మధ్య సమావేశం అనంతరం రాయ్ ఈ ప్రకటన చేశారు. 'మేఘాలయలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వాన్ని అన్ని రకాల మద్దతు ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చింది' అని రిజుజ్జు ఇక్కడ రాయ్ నివాసంలోకి వెళ్లే ముందు విలేకరులకు చెప్పారు. సంగ్మా సమావేశం అనంతరం గవర్నర్ శర్మ ట్వీట్ చేస్తూ 'ఒక స్వతంత్ర సభ్యుడు, ఎన్‌పీపీ, యూడీపీ, పీడీఎఫ్, హెచ్ఎస్‌పీడీపీ, బీజేపీలకు చెందిన నూతనంగా ఎన్నికైన 34 మంది సభ్యులు అధికారాన్ని పంచుకోవడం, ఆ సంకీర్ణ కూటమికి కాన్రాడ్ సంగ్మా నాయకుడిగా ఉండటం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా మాట్లాడుతూ భావసారూప్యత కలిగిన పార్టీలతో కాంగ్రెస్ చర్చలు జరుపుతోందన్నారు. గత రాత్రి గవర్నర్‌ను కాంగ్రెస్ కలుసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపింది. కానీ ప్రాంతీయ పార్టీలు ఇంకా మద్దతు తెలపకపోవడంతో స్వల్ప మెజార్టీ మాత్రమే కలిగి ఉంది. కాంగ్రెస్ తొమ్మిది స్థానాలు కావాల్సి ఉంది. ఆరు సీట్లతో కింగ్ మేకర్‌గా ఉన్న యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ)ని సంప్రదించింది. కానీ దాని మద్దతు సంపాదించడంలో విఫలమయ్యింది. అయితే కేవలం రెండు స్థానాలే పొందిన బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అనుకుంటుందని ముకుల్ సంగ్మా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలే వారిని వద్దనుకున్న నేపథ్యంలో ఏకంగా ప్రభుత్వం ఏర్పాటు కోసం బీజేపీ పావులు కదుపుతుందన్నారు. యూడీపీ అధ్యక్షుడు దొంకూపర్ రాయ్ విలేకరులతో మాట్లాడుతూ ముకుల్ సంగ్మా తనను కలిశారని, రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిని పంచుకునే విషయాన్ని ప్రతిపాదించారని తెలిపారు. 'మేము ఆయన ప్రతిపాదనను తిరస్కరించాం. కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం' అని రాయ్ తెలిపారు. కాన్రాడ్ సంగ్మా విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ పదవీ కాలం ముగుస్తున్నందున వచ్చే రెండు, మూడు రోజులు కీలకమైనవన్నారు. మార్చి 7వ తేదీనాటికి శాసనసభ పదవీకాలం ముగుస్తుంది. అంతకన్నా ముందుగానే, సోమవారంనాటికి అంతా స్పష్టమవుతుందని ఆయన చెప్పారు. కాగా ఎన్‌పీపీ చీఫ్ కాన్రాడ్ సంగ్మా గవర్నర్‌ను కలిసి తనకు 34 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా, మార్చి 6వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో ముఖ్యమంత్రి పదవీ స్వీకార ప్రమాణం ఉండవచ్చని భావిస్తున్నారు. మేఘాలయలో ఎన్‌పీపీకి 19, యూడీపీ 6, పీడీఎఫ్ 4, బీజేపీ 2, హెచ్ఎస్‌పీడీపీ 2, స్వతంత్రులు ఒకరు మొత్తం 34 మందిగా ఎన్‌డీఏ బలం ఉంది. కాగా రాష్ట్ర శాసనసభలో మెజార్టీ మార్కు 31 కాగా, ఈ ఐదు పార్టీల కూటమితో మెజార్టీ సాధిస్తుంది.

నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమి

నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు స్పష్టమైన మెజారిటీతో ఎన్‌డీపీపీ అధినేత నైఫీ రియో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాల్సిందిగా ఆదివారం నాగాలాండ్ గవర్నర్‌ను కలిశారు. 60 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో తనకు 32 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు రియో గవర్నరు పీబీ ఆచార్యకు తెలిపారు. దీంతో ఆయనే ప్రభుత్వ ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. శనివారం వెలువడిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించలేకపోయింది. ఎన్‌డీపీపీ 16, బీజేపీ 11, ఎన్‌పీపీ 2, జేడీ(యు) ఒక స్థానంలో గెలుపొందారు. ఇప్పటికే నాగాలాండ్ జేడీయు తమ మద్దతు బీజేపీకే ఇస్తామని ప్రకటించేసింది. ఇక స్వతంత్ర్య అభ్యర్థి కూడా బీజేపీకే మద్దతు తెలిపారు. ఇతరుల మద్దతు మొత్తం కలుపుకొని ఎన్‌డీపీపీ అభ్యర్థి రియోకు 32 సభ్యులు అండగా నిలవడంతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నరు ఆమోదం తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ ఏర్పాటులో పాలు పంచుకోవాల్సిందిగా బీజేపీ కూటమిని అధికార ఎన్‌పీఎఫ్ నేత, ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్ ఆహ్వానించారు. కానీ అందుకు బీజేపీ కూటమి అంగీకరించకుండా ఇతరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.

ఆగని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: పోలీసు హెచ్చరికలను సైతం బేఖా తరు చేస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మద్యం ప్రియులపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోవడం లేదు. మద్యం ప్రియులను నియంత్రించే ఉద్దేశంతో పోలీ సులు కఠినంగా వ్యవహరిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టుల్లో హాజరుపరిచి జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తున్నా వారిలో మార్పు కనిపించడం లేదు. ప్రతి రోజు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడుతూనే ఉన్నారు. వీకెండ్‌లలో వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుందని పోలీసులు అంటున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిలో సంపన్నులు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఎన్ని చర్యలు తీసుకున్నా వారిలో మార్పు రాకపోవడం పోలీసులను కలవరపెడు తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పురుషులతో పాటు మహిళలు కూడా పట్టుబడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో ఓ మహిళా వైద్యురాలు పట్టుబడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో పోలీసుల తనిఖీల్లో మొత్తం 99 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌లోని రోడ్‌నెంబర్ 36లో ఇద్దరు యువతులు పట్టుబడ్డా రని, వారిలో ఒకరు ఛత్తీస్‌ఘడ్ నుండి ఇక్కడికి వచ్చి వైద్యవృత్తి నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

విశాలాంధ్ర

క్రీడలు

నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా దినేశ్ కార్తీక్



కోల్‌కతా: గౌతమ్ గంభీర్‌ను తప్పించిన అనంతరం కోల్‌కతా నైట్ రైడర్స్ సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్న ఉత్కంఠకు తెరపడింది. జట్టులోని పలువురు సీనియర్ల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. చివరికి ఆ అదృష్టం దినేశ్ కార్తిక్‌కు దక్కింది. ఈ విషయాన్ని జట్టు సీఈవో వెంకీ మైసూర్ ఆదివారం ప్రకటించారు. ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో మాట్లాడుతూ వెంకీ ఈ విషయాన్ని వెల్లడించారు. కార్తిక్‌ను ఎంచుకోవడానికి గల కారణాలను వివరించారు. 'జట్టులో దీర్ఘకాలిక మార్పు కోసం చూస్తున్నాం.. గౌతం గంభీర్ స్థానాన్ని భర్తీ చేయగల సామర్థ్యం ఎవరిలో ఉంది అని పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నాం. సీనియర్ ఆటగాళ్లైన క్రిస్ లీన్, రాబిన్ ఊతప్పల పేర్లు కూడా పరిశీలించి.. చివరికి దినేశ్ కార్తిక్‌కు ఆ బాధ్యతలు అప్పగించాం. రాబిన్ ఊతప్పను వైస్ కెప్టెన్‌గా నియమించాం.' అని వెంకీ తెలిపారు. దినేశ్ కార్తిక్‌ను జనవరిలో నిర్వహించిన ఐపీఎల్ వేలంలో కొల్‌కతా రూ. 7.4 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. తనకు జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించడంపై కార్తిక్ సంతోషం వ్యక్తం చేశాడు. 'పదేళ్లుగా కోల్‌కతా జట్టు మంచి ప్రదర్శన చేస్తూ వస్తోంది. జట్టు గొప్ప వారసత్వాన్ని కలిగి ఉంది. నాకు ఈ బాధ్యతలు అప్పగించడాన్ని గౌరవంగా భావిస్తున్నా. మా జట్టులో యువ ఆటగాళ్లు, సీనియర్ ప్లేయర్లు ఉన్నారు. కోచ్ కల్లీస్ నేతృత్వంలో జట్టును మరింత ముందుకు తీసుకువెళ్తాను' అని అన్నారు. కోల్‌కతాకు రెండు సార్లు ట్రోఫీ అందించిన గౌతమ్‌గంభీర్‌ను ఆ జట్టు తన వద్ద అట్టిపెట్టుకోకుండా ఐపీఎల్ వేలానికి వదిలేసింది. చివరికి గౌతీని ఢిల్లీ డేర్‌డేవిల్స్ జట్టు దక్కించుకుంది.

జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా ఆశిష్?



న్యూఢిల్లీ: పరస్పర విరుద్ధ ప్రయోజనాల్లో భాగంగా భారత జూనియర్ క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్ పదవికి మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేసిన నేపథ్యంలో అతని స్థానంలో భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ ఆశిష్ కపూర్ పేరును పరిశీలిస్తున్నారు. గతంలో ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ ప్యానల్‌లో పని చేసిన ఆశిష్‌ను చైర్మన్‌గా చేయాలని బీసీసీఐ పరిపాలన కమిటీ(సీఓఏ) భావిస్తోంది. వెంకటేశ్ ప్రసాద్ ఉన్నపళంగా తప్పుకోవడంతో ప్రస్తుత సెలక్షన్ కమిటీ ప్యానల్‌లో జ్ఞానేంద్ర పాండే, రాకేశ్ పారిక్‌లు మాత్రమే మిగిలారు. అంతకుముందు ఐదుగురు సభ్యులతో కూడిన జూనియర్ సెలక్షన్ కమిటీ ప్యానల్ ఉండేది. లోథా నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత అందులో ముగ్గురు సభ్యులు మాత్రమే మిగిలారు. ఆ క్రమంలోనే ఆశిష్ కపూర్, అమిత్ శర్మలు ప్యానెల్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కాగా, వెంకీ రాజీనామాతో ఆశిష్, అమిత్‌లు పేర్లు మరోసారి తెరపైకి వచ్చాయి. అయితే ఇక్కడ ఆశిష్‌కే కమిటీ చైర్మన్ అయ్యేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. అర్హత పరంగా చూస్తే ఆశిష్ మాజీ టెస్టు క్రికెటర్ కూడా కావడం అతనికి కలిసొచ్చే అంశం. మిగతా వారికి టెస్టు ఆడిన అనుభవం లేకపోవడంతో ఆశిష్ వైపే సీఓఏ మొగ్గుచూపే అవకాశం ఉంది. అండర్-19 ప్రపంచకప్ గెలిచి నెల కూడా తిరుగకుండానే జూనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సుమారు 30 నెలలుగా ఈ పదవిలో కొనసాగిన వెంకటేశ్ ప్రసాద్ వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశాన్ని ప్రసాద్ ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. వచ్చే ఐపీఎల్లో వెంకటేశ్ ప్రసాద్ కింగ్స్ పంజాబ్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. దీనిలో భాగంగానే తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

'పంజాబ్' కోచ్‌గా వెంకటేశ్‌ప్రసాద్



మొహాలి: టీమిండియా మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా నియమించింది. బీసీసీఐ జూనియర్ చీఫ్ సెలక్టర్ పదవికి రాజీనామా చేసిన మూడు రోజుల్లోనే ఆయన కింగ్స్ బృందంలో చేరడం గమనార్హం. ఐపీఎల్ 11వ సీజన్ సందర్భంగా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు తమ సహాయక బృందాన్ని ప్రకటించింది. 'టీమిండియా మాజీ పేసర్, బీసీసీఐ జూనియర్ నేషనల్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్ ప్రసాద్‌ను జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమించాం' అని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు బ్రాడ్‌హడ్జ్‌ను మూడు సీజన్లకు ప్రధాన కోచ్‌గా ఎంపిక చేసింది. టీ20ల్లో 7000 పరుగులకు పైగా సాధించిన హడ్జ్ మాజీ డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మార్గదర్శనంలో జట్టులో కీలక మార్పులు చేసి ముందుకు నడిపించగలడని ఆశాభావం వ్యక్తం చేసింది. ఢిల్లీ మాజీ ఆటగాడు మిథున్ మన్హాస్ సహాయక కోచ్‌గా ఎంపికయ్యారు. నిశాంత్ ఠాకూర్‌ను స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా, శైమల్ వల్లభ్‌జీని టెక్నికల్ కోచ్‌గా, నిషాంత బొర్దొలైను ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపిక చేశారు. వెంకటేశ్ ప్రసాద్ బౌలింగ్ కోచ్‌గా తమ బృందంలో చేరినందుకు సెహ్వాగ్ ఆనందం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్‌తో మ్యాచ్ డ్రా



ఇఫో (మలేసియా): 'చావు తప్పి కన్ను లొట్టబోయింది' అన్న చందంగా ఉంది భారత హాకీ జట్టు ప్రదర్శన. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా తొమ్మిది పెనాల్టీ కార్నర్ అవకాశాలను వృథా చేసింది సర్దార్ సింగ్ నేతృత్వంలోని యువ భారత జట్టు. చివరికి తగిన మూల్యమే చెల్లించుకుంది. అజ్లాన్ షా హాకీ టోర్నీలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించింది. యువ ఆటగాడు శీలానంద్ లర్కా (14వ నిమిషం) భారత్ తరపున ఏకైక గోల్ నమోదు చేశాడు. అతడి కెరీర్‌లో ఇదే తొలి గోల్. 53వ నిమిషంలో ఇంగ్లండ్ ఆటగాడు మార్క్ గ్లెగ్‌హార్న్ పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసి మ్యాచ్‌ను 1-1తో ముగించాడు. ప్రస్తుత డ్రాతో టోర్నీలో భారత్ ఆరో స్థానంలో నిలిచింది. తొలి మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా చేతిలో 2-3తో ఓడిన టీమిండియా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో పూర్తిగా అనుభవలేమిని ప్రదర్శించింది. అందివచ్చిన తొమ్మిది పెనాల్టీ కార్నర్ అవకాశాల్లో కనీసం నాలుగింటిని గోల్స్‌గా మలచలేకపోయింది. ఇంగ్లండ్ డిఫెన్స్ విభాగం భారత్ దాడులను బాగా అడ్డుకుంది. తొలి క్వార్టర్ చివర్లో శీలానంద్ గోల్ చేసి భారత్‌ను 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత రెండు జట్లు గోల్ కోసం బాగానే పోరాడాయి. ముఖ్యంగా టీమిండియా గోల్స్ చేయడంలో విఫలం కాగా ఇంగ్లండ్ డిఫెన్స్ విభాగం అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆ జట్టు గోల్ కీపర్ హారీ గిబ్సన్ భారత్ గోల్స్ చేయకుండా అడ్డుకున్నాడు. చివర్లో మార్క్ గోల్ చేయడంతో 1-1తో మ్యాచ్ ముగిసింది. భారత్ మంగళవారం ప్రపంచ నంబర్ వన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది.



వన్డేల్లో బెర్త్‌పై..

ఉనాద్కట్ కన్ను

న్యూఢిల్లీ: శ్రీలంక జట్టుతో మార్చి 6 నుంచి జరగబోయే టీ20 మ్యాచ్‌ల ద్వారా వన్డేల్లో బెర్త్‌పై పేస్ బౌలర్ జయదేవ్ ఉనాద్కట్ కన్నేశాడు. వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచకప్‌లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడు. 2016లో ఉనాద్కట్ హరారేలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. శ్రీలంకతో డిసెంబరులో జరిగిన మ్యాచ్‌లో వెలుగులోకి వచ్చాడు. 'రాబోయే రోజుల్లో జరిగే పెద్ద టోర్నమెంట్‌లకు ఈ మ్యాచ్‌లు ఉపయోగపడతాయని అనుకుంటున్నా. ఒక్క టీ20 అనే కాదు, 50 ఓవర్ల మ్యాచ్‌ల్లో కూడా శాశ్వత్ బెర్త్ కోసం ప్రయత్నిస్తున్నా. ఒక్కసారి టీంలోకి వెళితే నాలో ఉన్న ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. దీంతో మేనేజ్‌మెంట్, కెప్టెన్‌ల పని తేలిక అవుతుంది' అని ఉనాద్కట్ తెలిపాడు. డిసెంబరులో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఎలాంటి ప్రదర్శన ఇచ్చాడో, అలాంటి గేమ్ ప్లాన్‌నే శ్రీలంకపై కూడా అమలు చేస్తానని పేర్కొన్నాడు. సీనియర్ పేసర్లయిన భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బూమ్రాలకు టీమ్ మేనేజ్‌మెంట్ రెస్టు ఇవ్వడంతో, ఈ 26 ఏళ్ల సౌరాష్ట్రా బౌలర్‌కు సువర్ణావకాశం వచ్చింది. 6 నుంచి శ్రీలంక, భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య జరగబోయే టీ20 సిరీస్‌లో తనేంటో నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాడు ఈ యంగ్ బౌలర్. 'టీమిండియాతో ఆడేందుకు ఇది ఓ సువర్ణావకాశం. టీంలో కుదురుకునేందుకు కష్టపడతా. నా ప్రతిభ ఏంటో కూడా రుజువుచేస్తా' అని తెలిపాడు. శ్రీలంకతో భారత్‌లో జరిగిన మ్యాచ్‌లో ఉనాద్కట్ నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం దక్షిణాఫ్రికాతో సెంచూ రియన్, జొహన్నెస్‌బర్గ్‌లలో జరిగిన టీ20 ల్లో మూడు వికెట్లు తీశాడు. తన టీ20 కెరీర్‌లో ఆరు మ్యాచ్‌ల్లో 7 వికెట్లు సాధించాడు.



జోఫ్రా ఆర్కర్.. ఐపీఎల్‌కు అనుమానం..!

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆటగాళ్ల కోసం నిర్వహించిన వేలంలో వెస్టిండీస్‌కు చెందిన పేసర్ జోఫ్రా ఆర్కర్ రికార్డు స్థాయిలో రూ.7.2కోట్లకు అమ్ముడుపోయాడు. రాజస్థాన్ రాయల్స్ ఇతగాడిని దక్కించుకుంది. ఐతే, ఇప్పుడు జోఫ్రా ఐపీఎల్‌లో ఆడేదానిపై అనుమానాలు నెలకొన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం అతడు అనారోగ్యం కారణంగా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) నుంచి దూరమయ్యాడు. పీఎస్ఎల్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతడు పొట్టలో ఓ సమస్య కారణంగా పీఎస్ఎల్ నుంచి దూరమౌతున్నట్లు క్వెట్టా గ్లాడియేటర్స్ ఫ్రాంఛైజీ ట్విటర్ ద్వారా తెలిపింది. దీంతో ఇప్పుడు అతను ఐపీఎల్‌లో ఆడేదానిపై అనుమానాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 7 నుంచి ఐపీఎల్-11వ సీజన్ ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో జోఫ్రా ఆడతాడో లేదో తెలియాలంటే కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే.

రైనా ఆటతీరు భేష్ : రవిశాస్త్రి



ముంబై: దక్షిణాఫ్రికాలో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా వెటరన్ క్రికెటర్ సురేశ్ రైనా నిర్భయంగా ఆడటం నచ్చిందని కోచ్ రవి శాస్త్రి అన్నాడు. చాలా కాలం తర్వాత జట్టులోకి పునరాగమనం చేసినప్పుడు ఒత్తిడి ఉంటుందన్నాడు. అలాంటి సందర్భంలోనూ రైనా దూకుడుగా ఆడటం బాగుందని పేర్కొన్నాడు. సఫారీలతో జరిగిన చివరి టీ20లో రైనా 27 బంతుల్లోనే 43 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 'రైనాకు చాలా అనుభవం ఉంది. అది ఎలా పనిచేస్తుందో అతడు చూపించాడు. నిర్భయంగా కనిపించడం నన్ను ఆకట్టుకుంది. అతడి పట్టుదల నచ్చింది. సాధారణంగా జట్టులోకి చాలా కాలం తర్వాత పునరాగమనం చేసినవారు తమ స్థానం పదిలం చేసుకోవాలనుకుంటారు. అలాంటప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కానీ రైనా దాన్నీ లెక్కచేయలేదు. మైదానంలోకి నిర్భయంగా వెళ్లి దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అది చూడ్డానికి చాలా బాగుంది' అని రవిశాస్త్రి అన్నాడు. సఫారీ సిరీస్‌లో ఆడిన మూడు టీ20ల్లో రైనా 153.44 స్ట్రైక్‌రేట్‌తో 89 పరుగులు చేశాడు. మొత్తం 12 బౌండరీలు రెండు సిక్సర్లు బాదేశాడు. అంతకు ముందు 2017 ఫిబ్రవరి 1న ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రైనా 45 బంతుల్లోనే 63 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత జరిగిన టీ20 సిరీస్‌కు సెలక్టర్లు అతడిని ఎంపిక చేయలేదు.

బూకీలే ఆటగాళ్లను సంప్రదిస్తున్నారు



దుబాయ్: ఫిక్సింగ్ ఆరోపణలో ఈ మధ్య పాకిస్థాన్ ఆటగాళ్లు నిషేధాలను ఎదుర్కొంటున్నారు. తాజాగా దుబాయ్‌లో జరుగుతోన్న పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్)లో కూడా బుకీలు ఆటగాళ్లను సంప్రదిస్తున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆ దేశ బోర్డు ప్రతినిధి ఒకరు వెల్లడించడం విశేషం. ఈ ఏడాది పీఎస్ఎల్-3వ సీజన్ పోటీలు ఫిబ్రవరి 22న ప్రారంభమైంది. ఇప్పటికే అభిమానులు లేక వెలవెలబోతున్నాయి స్టేడియాలు. ఇప్పుడు తాజాగా ఈ లీగ్‌పై బుకీల నీడలు కమ్ముకున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా బుకీలు పలువురు ఆటగాళ్లను సంప్రదింపులు జరుపుతున్నారట. తాజాగా దీనిపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ..'ఇది నిజమే. కొన్ని సోషల్ మీడియా యాప్స్ ద్వారా బుకీలు ఆటగాళ్లతో చర్చలు జరుపుతున్నారు. అయితే ఆటగాళ్ల నుంచి వారికి ఎలాంటి స్పందన దక్కలేదు. ఈ సమస్యను ఇప్పటికే ఆటగాళ్లు మా దృష్టికి తీసుకువచ్చారు. అప్రమత్తమైన మేము ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం' అని ఆయన తెలిపారు. పీఎస్ఎల్‌లో ఫిక్సింగ్ ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. గత సీజన్లో లతీఫ్, షర్జీల్ ఖాన్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో వారిపై ఐదేళ్ల నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే.

పాక్ సెనేటర్‌గా దళిత మహిళ

పీపీపీ టికెట్‌పై చారిత్రక గెలుపు



ఇస్లామాబాద్: ముస్లిం ఆధిక్య దేశమైన పాకిస్థాన్‌లోని సింధు ప్రావిన్స్ నుంచి సెనేట్‌కు ఎన్నికైన తొలి హిందూ దళిత మహిళగా కృష్ణకుమారి కోల్హీ రికార్డుల్లోకి ఎక్కారు. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) సభ్యురాలైన కృష్ణకుమారి (30) సింధు నుంచి మైనారిటీ సీటుకు ఎన్నికయ్యారు. పాకిస్థాన్‌లో మహిళలు, మైనారిటీల హక్కుల సాధనలో కృష్ణకుమారి ఎన్నిక ఓ మైలురాయి. గతంలో రత్నా భగవాన్‌దాస్ చావ్లా అనే హిందూ మహిళ మొట్టమొదటి సెనేటర్‌గా పీపీపీ తరపు ఎన్నికయ్యారు. కాగా, కృష్ణకుమారి కోల్హీ సింధు ప్రావిన్స్ థార్‌లోని నాగర్‌పార్కర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో 1979 ఫిబ్రవరిలో పేద రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నతనంలో కటుంబంతో కలిసి ఉమెర్‌కోట్ జిల్లాలోని కుర్నికి చెందిన భూస్వామికి చెందిన ఓ ప్రైవేటు జైలులో మూడేళ్లు గడిపారు. అప్పుడు ఆమె మూడోతరగతి చదువుతున్నారు. ఆమెకు16వ ఏటా లాల్‌చంద్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అప్పుడు ఆమె తొమ్మిదో తరగతి విద్యార్థి. పెళ్లి అయిన తర్వాత కూడా ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె 2013లో సింధూ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో మాస్టర్స్ పట్టాపొందారు. ఆ తర్వాత సామాజిక కార్యకర్తగా పీపీపీలో చేరారు. తన సోదరుడితో కలిసి సామాజిక కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. బెరానో యూనియన్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. థార్, ఇతర ప్రాంతాల్లో అణగారినవర్గాల హక్కుల సాధన పోరులో క్రియాశీల పాత్ర పోషించారు. 1857లో నాగర్‌పర్కార్ తరపున సింధ్ నుంచి బ్రిటిష్ సామ్రాజ్యవాదశక్తులను ఎదరించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు రూప్లూ కోల్హీ కుటుంబంలో కృష్ణకుమారి జన్మించారు. 1858, ఆగస్టు 22న రూప్లూ కోల్హీని బ్రిటిషర్లు ఉరితీశారు. కాగా, 52 మంది సెనేటర్ల పదవీకాలం ఈ నెలతో ముగియనుండడంతో పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించింది. పంజాబ్, సింధు నుంచి చెరో 12 స్థానాలు, ఖైబర్-పఖ్‌తున్వా, బలూచిస్థాన్ నుంచి చెరో 11, గిరిజన ప్రాంతం నుంచి 4, ఫెడరల్ క్యాపిటల్ నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రాజకీయ పార్టీలు నామినేట్ చేసిన వారితో పాటు స్వతంత్ర అభ్యర్థులను కలిపి మొత్తం 130 మందికిపైగా ఎన్నికల్లో పోటీచేశారు.

గోల్డ్‌మెడల్‌తో అప్పులు మాయం




చండీగఢ్: సీనియర్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన నవజ్యోత్ కౌర్ తన గోల్డ్ మెడల్‌తో కుటుంబ భారాన్ని తగ్గించింది. దశాబ్దకాలంతో ఆమె తండ్రి సుక్‌చైన్ సింగ్ ఆమె ట్రెనింగ్ కోసం చేసిన అప్పులను కౌర్ ఈ మెడల్‌తో వచ్చిన డబ్బులతో తీర్చేసింది. కౌర్ ట్రెనింగ్ కోసం ఆమె తండ్రి దాదాపు 13 లక్షల రూపాయలు అప్పు చేశాడు. ఆమె ట్రెనింగ్ కోసం ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందలేదని, దీంతో తప్పని పరిస్థితుల్లో అప్పు చేశానని ఆమె తండ్రి సుక్‌చైన్ తెలిపారు. ఇప్పుడు తమ కష్టానికి ప్రతిఫలంగా కౌర్ గోల్డ్ మెడల్ సాధించడమే కాక.. అప్పుల భారాన్ని కూడా తీర్చేదయం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. 65 కేజీల మహిళల ఫ్రీ రెజ్లింగ్ విభాగంగా కౌర్ జపాన్ రెజ్లర్ మియా ఇమాయిపై 9-1 తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

లంకకు టీమిండియా



న్యూఢిల్లీ: శ్రీలంక వేదికగా భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య జరిగే ముక్కోణపు సిరీస్ కోసం టీం ఇండియా సిద్ధమైంది. రోహిత్ శర్మ నాయకత్వంలో పూర్తి యువ జట్టుతో భారత్ లంక గడ్డపై అడుగుపెట్టనుంది. ఈనెల 6 ప్రారంభమయ్యే తొలి మ్యాచ్ కోసం టీం ఇండియా శ్రీలంక బయలుదేరింది. దీనికి సంబంధించిన ఫోటోలను బీసీసీఐ ట్వీట్ చేసింది. అయితే నెటిజన్లు మాత్రం ఈ ట్వీట్‌పై కాస్త భిన్నంగానే స్పందిస్తున్నారు. కొందరు టీం ఇండియాకి ఆల్ ది బెస్ట్ చెబుతుండగా.. మరికొందరు మాత్రం అక్కడ సిరీస్ ఓడిపోతే.. జట్టు అసలు భారత్‌లో అడుగుపెట్టొద్దని హెచ్చరిస్తున్నారు. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోనీలతో పాటు పలువురు కీలక ఆటగాళ్లకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. దీంతో ఈ సిరీస్‌కి రోహిత్ శర్మ కెప్టెన్‌గా, శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.